




# స్తంభం ఎక్కి.. జంపర్ వేసి

**కరెంట్‌ను పునరుద్ధరించుకున్న గ్రామ యువకులు.. 7 గంటలుగా కరెంట్ లేక గ్రామస్థుల అవస్థలు**

బయ్యారం, ఆగస్టు 20: విద్యుత్తు అంతరాయంతో ఇబ్బంది పడిన గ్రామస్థులు స్వయంగా మరమ్మతులు చేసుకుని కరెంటు సరఫరాను పునరుద్ధరించుకున్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోటగడ్డ ఫీడర్ పరిధిలోని చర్లపల్లి తండాలో షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్తు వైరు తెగిపోయింది. రామచంద్రాపురం పంచాయతీ పరిధిలోని పెంకుతండా, కేసీఆర్ కాలనీకి సోమవారం మధ్యాహ్నం 2 నుంచి ఏడు గంటల పాటు కరెంటు సరఫరా నిలిచిపోయింది. గ్రామస్థులు గంటల తరబడి కరెంట్ కోసం ఎదురుచూస్తూ అవస్థలు పడ్డారు. జ్వరాల బారిన పడ్డవారు కరెంట్ లేక నరక యాతన అనుభవించారు. ఈ విషయాన్ని విద్యుత్తు సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా స్పందించలేదు. అరగంటలో వస్తామని రాత్రి వరకు రాలేదు. రాత్రి ఫోన్ చేస్తే తాము అందుబాటులో లేమని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. చేసేదిలేక గ్రామంలోని యువకులు రామచంద్రాపురం సెంటర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ పక్కన ఉన్న స్తంభం వద్ద జంపర్ తెగినట్టు గుర్తించారు. మరమ్మతులు చేసుకుంటామని విద్యుత్తు అధికారులకు చెప్పి ఎల్‌సీకి అనుమతితీసుకున్నారు. యువకులు స్తంభం ఎక్కి.. జంపర్ వేసి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడంతో సమస్య తీరింది. గంటల తరబడి కరెంటు లేక ఇబ్బందులు పడితే.. అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు అసహనం వ్యక్తంచేశారు.



### ఇది బీఆర్ఎస్ మార్క్ పాలన

బీఆర్ఎస్ పాలనలో నిరుడు వర్షాకాలంలో నల్లగొండ జిల్లాలో కరెంటు సమస్య తలెత్తితే వానను కూడా లెక్కచేయకుండా ఓ లైన్‌మన్ కరెంటు సరఫరాకు నడుంబిగించాడు. కింద ఏరులా నీరు పారుతున్నా లెక్కచేయకుండా కరెంటు స్తంభం ఎక్కి విద్యుత్తును పునరుద్ధరించిన చిత్రం.

## విద్యుత్తు అంతరాయం మానవ తప్పిదం కాదు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి విద్యుత్తు అధికారి స్పందన

వరంగల్‌చౌరస్తా, ఆగస్టు 20: వరంగల్ నగరంలోని కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో విద్యుత్తు అంతరాయం మానవ తప్పిదం వల్ల జరగలేదని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 19న కురిసిన వర్షం కారణంగా విద్యుత్తు లైన్‌పై చెట్ల కొమ్మలు విరిగిపడటంతో దవాఖానకు కరెంటు సరఫరా నిలిచిపోయిందని పేర్కొన్నారు. వెంటనే సిబ్బంది కొమ్మలను తొలగించి మరమ్మతులు చేసి దవాఖానకు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించినట్టు ఎస్ఈ వివరించారు.

## నల్లా కనెక్షన్లకు 30వేలు లంచం

- ఏసీబీకి చిక్కిన మణికొండ జలమండలి మేనేజర్

మణికొండ, ఆగస్టు 20: మణికొండ మున్సిపాలిటీ జలమండలి మేనేజర్ లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీకి పట్టుబడింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్‌సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డు డివిజన్-18 మణికొండ మేనేజర్‌గా స్ఫూర్తిరెడ్డి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా నవీన్‌గౌడ్ పని చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ వెంకటేశ్వరకాలనీకి చెందిన బొమ్మ ఉపేంద్రనాథ్‌రెడ్డి కొత్త బిల్డింగ్‌కు రెండు నీటి కనెక్షన్ల కోసం అధికారులను కలిశాడు. ఇందుకు మేనేజర్ స్ఫూర్తిరెడ్డి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ద్వారా ఉపేంద్రనాథ్‌రెడ్డి నుంచి రూ.30 వేలు డిమాండ్ చేశారు. దరఖాస్తులు సరిగ్గానే ఉన్నా కనెక్షన్లు ఎందుకు ఇవ్వరని బాధితుడు ప్రశ్నించాడు. డబ్బులు ఇస్తేనే కనెక్షన్లకు అనుమతి ఇస్తామని చెప్పడంతో ఏసీబీని ఆశ్రయించాడు. మంగళవారం స్ఫూర్తిరెడ్డి, నవీన్‌గౌడ్ బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి పీఆర్ఎల్ ఎదుట హాజరుపర్చినట్టు తెలిపారు.

# రాష్ట్రంలో కుండపోత వాన

- యాదగిరిగుట్టలో 17 సెం.మీ
- గ్రేటర్ హైదరాబాద్‌లో జడివాన బీభత్సం
- వరదలో కొట్టుకొచ్చిన మృతదేహం
- నిండిన చెరువులు, కుంటలు, పారిన వాగులు
- అయిజ మండలంలో 13.33 సెం.మీ



గద్వాల జిల్లా అయిజ పీహెచ్‌సీ ఆవరణలో నిలిచిన నీటిలో వాహనంపై వెళ్తున్న సిబ్బంది



భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు-రుద్రవెల్లిలో లెవెల్ బ్రిడ్జి పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

మహబూబ్‌నగర్ నెట్‌వర్క్/యాదాద్రి భువనగిరి/సిటీబ్యూరో, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు దంచికొడుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున జల్లులతో మొదలైన వర్షం.. తెల్లారేసరికి కుండపోతగా కురిసింది. చెరువులు, కుంటలు నిండిపోయి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. 2 గంటలపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి గ్రేటర్ హైదరాబాద్ అతలాకుతలం అయ్యింది. భారీగా వరద నీరు చేరి రహదారులు చెరువులను తలపించాయి. మ్యాన్ హోల్స్ పొంగిపొర్లాయి. వర్షపు నీరు నిలిచి భారీగా ట్రాఫిక్ స్తంభించింది. రాంనగర్ ప్రేయర్ పవర్ చర్చి ప్రాంతానికి చెందిన బీ విజయ్ కుమార్ (43) ఇంటిముందు అరుగుపై నిద్రిస్తుండగా.. ఒక్కసారిగా వచ్చిన వరదలో చిక్కుకుని ఊపిరాడక మృత్యువాత పడ్డాడు. పంజాగుట్ట సుఖ్‌నివాస్ అపార్ట్‌మెంట్ వద్ద పిడుగుపడి కారు, ఎల్బీ స్టేడియం ప్రహరీ కూలి పోలీస్ వాహనం ధ్వంసం అయ్యాయి. అత్యధికంగా ఖైరతాబాద్ మండలంలో 12.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరద నుంచి మధ్యాహ్నానికి తేరుకున్నా.. అస్తవ్యస్తంగా మారిన జనజీవనంపై సాయంత్రం వరుణుడు మళ్లీ ఉగ్రరూపం చూపాడు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం ఉంటే తప్ప బయటకు రావొద్దని జీహెచ్‌ఎంసీ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా.. జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు, చెరువులు అలుగులు పోశాయి. అయిజ-కర్నూల్, అయిజ-ఎమ్మిగనూర్ అంతర్రాష్ట్ర రహదారులతోపాటు ఉత్తనూర్-సింధనూర్, అయిజ-తూంకుంట, అయిజ-చిన్నతాండ్రపాడు రోడ్లపై వాగులు ఉధృతంగా పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అయిజ-పులికల్ రోడ్డులోని పోలోని వాగుపై డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయి, పొలాలు నీటి మునిగాయి. కంది, పత్తి, వరి దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందారు. అయిజలో 13.33 మి.మీ. వర్షపాతం నమోదైంది. 14 ఏండ్లల్లో ఎప్పుడూ ఇంత వర్షం కురవలేదని మండల రైతులు పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భూదాన్ పోచంపల్లి నుంచి బీబీనగర్ వెళ్లే మార్గంలో రుద్రవెల్లి దగ్గర మూసీనది పొంగిపొర్లుతున్నది. రాకపోకలు బంద్ అయ్యాయి. యాదగిరిగుట్టలో 17 సెంటీమీటర్లు, భువనగిరిలో 13.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

### 24 వరకు భారీ వర్షాలు.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): వచ్చే ఐదు రోజులు తెలంగాణలో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నెల 24 వరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వికారాబాద్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది.



మంగళవారం కురిసిన వర్షానికి మక్తల్ మండలం దాసరిదొడ్డి శివారులో గండిపడిన సంగంబండ లో లెవెల్ కాల్వ

# భీమా కాల్వకు గండి


**నాడు ఆర్భాటంగా ప్రారంభించిన మంత్రులు.. నాణ్యతలేక ఐదు నెలలకే కోత**

మక్తల్, ఆగస్టు 20 : నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో బీడు భూములకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో సంగంబండ పెద్దవాగుపై నిర్మించిన చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లెఫ్ట్ లోలెవెల్ కెనాల్‌కు గండిపడింది. మంగళవారం కురిసిన వర్షానికి నీటి ఉధృతి పెరగడంతో కోతకు గురై పంట పొలాలను ముంచెత్తింది. కేసీఆర్ ప్రభుత్వం సంగంబండ నిర్వాసితులకు కూలీ డబ్బులు చెల్లించేందుకు 2023 ఆగస్టు 24న జీవో 925 తీసుకొచ్చింది. సంగంబండ, ఉజ్జల్లి, గార్లపల్లికి రావాల్సిన రూ.26,35,23,410 విడుదల చేసింది. తర్వాత అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో నిధుల చెల్లింపు జరగలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఈ నిధులను తామే విడుదల చేసినట్టు స్థానిక ఎమ్మెల్యే ముంపు గ్రామాలు తిరిగి ప్రచారం చేసుకున్నారు. 400 మీటర్ల బండను పగలగొట్టేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గాలి మోటర్‌లో ఇక్కడికొచ్చి హల్‌చల్ చేశారు. గాలి మాటలు చెప్పి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. తర్వాత చేపట్టిన కాల్వ పనులు నాసిరకంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికే గండిపడింది. దీంతో నీరంతా వృథాగా పోయి సమీపంలోని పంటల పొలాలను ముంచెత్తింది. నాసిరకం పనులతో కాల్వ తెగిపోతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తంచేశారు.

## సీతక్క అనుచరుడి ఇసుక దందా

మొదటిపేజీ తరువాయి...

చేయడంతో మంగళవారం సోషల్ మీడియా వేదికగా చక్కర్లు కొట్టింది. ఈ ఘటనపై ఓ లారీ డ్రైవర్ ఫోన్‌లో స్పందిస్తూ.. శ్రీనివాస్‌రెడ్డితో వాగ్వాదం జరిగింది వాస్తవమేనని స్పష్టం చేశారు. ఇసుక లోడింగ్ కోసం ఒక్కో లారీకి రూ.4,500 చెల్లించామని, అయినప్పటికి లోడింగ్ విషయంలో ఆలస్యం జరగడంతో తాము నిలదీసినట్టు చెప్పారు. ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి డ్రైవర్లను దుర్భాషలాడగా తామంతా లారీలను నిలిపివేసి అక్కడే రోడ్డుపై ధర్నా కూడా చేశామని తెలిపారు. ఇది జరిగిన మరుసటి రోజు లారీల్లో ఇసుక లోడ్ చేసి పంపించారని వివరించారు. కాగా, ఈ వీడియోపై సదరు కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా మంగళవారం రాత్రి స్పందించారు. 'ఈ ఘటనకు మంత్రి సీతక్కతోపాటు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదు. నా బతుకు దెరువు కోసం ఇసుక క్వారీ యజమాని వద్ద గుమస్తాగా పనిచేస్తున్నా. ఇసుక లారీలను క్రమ పద్ధతిలో లోడింగ్ చేసే క్రమంలో జరిగిన గొడవను వీడియో తీసి సోషల్ మీడియా ద్వారా కొందరు వైరల్ చేశారు. వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటా'నని తెలిపారు. లారీ డ్రైవర్లు రోడ్డెక్కి ధర్నా చేసినా, లారీలను ఆపినా ఈ వ్యవహారం బయటకు పొక్కక పోవడంలో అధికారులు పాత్ర ఉందా? లేక రాజకీయ ఒత్తిళ్లు పనిచేశాయా? అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



## 'నమస్తే తెలంగాణ' కార్టూనిస్టుకు అరుదైన అవార్డు

*స్విట్జర్లాండ్ ఎంబసీ కార్టూన్ పోటీల్లో మృత్యుంజయ్‌కు బహుమతి*

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): 'నమస్తే తెలంగాణ' కార్టూన్ ఎడిటర్ చిలువేరు మృత్యుంజయ్‌కు అరుదైన అవార్డు లభించింది. ఢిల్లీలోని స్విట్జర్లాండ్ ఎంబసీ భారత్-స్విస్ మైత్రీ అంశంపై నిర్వహించిన కార్టూన్ పోటీల్లో మృత్యుంజయ్ కార్టూన్‌కు బహుమతి వచ్చింది. దేశవ్యాప్తంగా వచ్చిన కార్టూన్లలో 19 కార్టూన్లను ఎంపిక చేసినట్టు, విజేతలకు నగదు పారితోషకం ఇవ్వనున్నట్టు స్విట్జర్లాండ్ ఎంబసీ కల్చరల్ ప్రోగ్రాం ఆఫీసర్ తనీమా మణికంటల తెలిపారు. 'స్విట్జర్లాండ్-ఇండియా 75 : సక్సెస్ స్టోరీస్ టు బీ కంటిన్యూ' పేరిట ఈ కార్టూన్లను కేరళ కార్టూన్ అకాడమీ సహకారంతో ఈ నెల 21 నుంచి 25 వరకు కొచ్చిలో జరిగే నేషనల్ కార్టూన్, క్యారికేచర్ ఫెస్టివల్ క్యారిటూన్‌లో ప్రదర్శించనున్నారు. లలితకళా అకాడమీ చైర్మన్ మురళి అధ్యక్షతన స్విట్జర్లాండ్ ఎంబసీ కాన్సులేట్ జనరల్ ప్యాట్రిక్ ముల్లర్ ఈ ప్రదర్శనను ప్రారంభిస్తారని తెలిపారు. కల్చరల్ సెంటర్ డైరెక్టర్ అనిల్ ఫిలిప్, కార్టూన్ డైరెక్టర్ రతీశ్ రవి, కేరళ కార్టూన్ అకాడమీ చైర్మన్ సుధీర్‌నాథ్, సెక్రటరీలు సతీశ్, బాలమురళీకృష్ణన్ పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు. ఈ ప్రదర్శనను స్విట్జర్లాండ్‌లోనూ ప్రదర్శించనున్నట్టు తనీమా మణికంటల తెలిపారు.

# ఈడీ తీరుపై 'సుప్రీం' అసహనం

- కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్న
- 27కు ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ



ఢిల్లీలో సుప్రీం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో మాట్లాడుతున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ కవిత భర్త అనిల్, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే వేముల

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవిత బెయిల్ వ్యవహారంలో ఈడీ తీరును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఈ విషయంలో వచ్చే గురువారంలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను 27కు వాయిదా వేసింది. కస్టడీలో ఉన్న కవిత.. బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఆమె పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో జస్టిస్ జస్టిస్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ కేసులోనే నిందితులుగా ఉన్న ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయాన్ని కవిత తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి గుర్తుచేశారు. ఇదే రీతిన కవితకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఈ కేసులో సీబీఐ కౌంటర్ దాఖలు చేసిందని, ఈడీ ఇంకా దాఖలు చేయాల్సి ఉందని ఈడీ తరఫు న్యాయవాదులు నివేదించారు. దీంతో ధర్మాసనం ఈడీ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. హైకోర్టులో కేసు డైరీలో ఉండగా కౌంటర్ దాఖలు చేసేందుకు ఆలస్యం ఎందుకైందని ప్రశ్నించింది. శుక్రవారం వరకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. బెయిల్‌కు కవిత అర్హురాలని ఆమె న్యాయవాదులు ధర్మాసనానికి నివేదించారు.

**బెయిల్ వస్తుందని ఆశిస్తున్నాం: వేముల**

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వస్తుందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కవితకు బెయిల్ రాకుండా ఈడీ కాలయాపన చేస్తుందనే అనుమానాలు ఈడీ తీరుతో నిరూపితమైందనారు. బెయిల్ పిటిషన్‌పై విచారణ నేపథ్యంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా ఢిల్లీకి చేరుకున్నారు. తీహార్ జైలులో ఉన్న కవితతో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ మంగళవారం ములాఖత్ అయ్యారు. ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

# ఆమ్రపాలి అదనపు పోస్టులకు కత్తెర

- ఇప్పటివరకు ఆమె చేతిలో నాలుగు బాధ్యతలు
- ఇక జీహెచ్ఎంసీ కమిషనర్ పదవికే పరిమితం
- అదనపు పోస్టింగ్‌ల నుంచి రిలీవ్ చేసిన సర్కారు
- మరో ఐదుగురు ఐఏఎస్ అధికారుల బదిలీ



హైదరాబాద్/సిటీబ్యూరో, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ ): ఐఏఎస్ అధికారిని ఆమ్రపాలి కాట విషయంలో రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. ప్రభుత్వం ఏర్పడగానే ఆమెకు విశేష ప్రాధాన్యత ఇస్తూ కట్టబెట్టిన పదవులన్నింటికీ ఇప్పుడు కత్తెర పెట్టింది. ఆమ్రపాలికి ఉన్న అదనపు పోస్టులను తొలగిస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక ఆమె గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) కమిషనర్‌గానే పూర్తిస్థాయి బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఇప్పటివరకు ఆమ్రపాలికి జీహెచ్ఎంసీ కమిషనర్ బాధ్యతలతో పాటు హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ బోర్డు ఎండీ, హెచ్‌జీసీఎల్ ఎండీ వంటి కీలక బాధ్యతలను ప్రభుత్వం అప్పగించిన సంగతి తెలిసిందే. ఒకే ఐఏఎస్‌కు, అందునా అనేక మంది సీనియర్ ఐఏఎస్‌లను కాదని జూనియర్‌కు ఇన్ని కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల తీవ్ర విమర్శలు వచ్చాయి. పైగా ఆమె ఏ బాధ్యతకూ సంపూర్ణ న్యాయం చేయలేకపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా కోటి మందికి పైగా జనాభా నివసించే జీహెచ్ఎంసీకి ఆమె సమయం కేటాయించలేకపోతున్నారని, ఫలితంగా సమస్యలు పేరుకుపోతున్నాయనే విమర్శలు వచ్చాయి. ఈ విషయాన్ని గుర్తించడానికి ప్రభుత్వానికి ఎంతో సమయం పట్టలేదు. చివరకు ఆమెకు అదనపు బాధ్యతలను తొలగిస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ విధులకు మాత్రమే పరిమితం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

### ఆరుగురు ఐఏఎస్‌ల బదిలీ

**రాష్ట్రంలో** ఆమ్రపాలి సహా ఆరుగురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న దానకిశోర్‌కు మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. హెచ్ఎండీఏ కమిషనర్‌గా ఉన్న సర్ఫరాజ్ అహ్మద్‌కు హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(హెచ్‌జీసీఎల్) ఎండీగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా ఉన్న కోట శ్రీవాస్తవను హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా, వెయిటింగ్‌లో ఉన్న చహత్ బాజ్‌పాయ్‌ను కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించారు. నారాయణపేట అదనపు కలెక్టర్(లోకల్‌బాడీ)మయాంక్ మిట్టల్‌ను జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.

## కేంద్రానికి రెండు రాష్ట్రాల అభిప్రాయాలు నివేదిస్తాం

- సీతారామ- సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టుపై జీఆర్ఎంబీ స్పష్టీకరణ

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): గోదావరి నదిపై తెలంగాణ నిర్మిస్తున్న సమీకృత సీతారామ-సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టుపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు తమ వాదనలు వినిపించాయి. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌పై మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో రెండు రాష్ట్రాలతో గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశం నిర్వహించింది. అభ్యంతరాలు ఉంటే సీడబ్ల్యూసీ వద్ద పరిష్కరించుకోవచ్చని సూచించింది. సమగ్ర ప్రాజెక్టు నివేదికపై (డీపీఆర్) తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అభిప్రాయాలను పొందుపర్చుతూ కేంద్ర జల సంఘానికి నివేదిక పంపిస్తామని బోర్డు తెలిపింది. రెండు రాష్ట్రాల మధ్య వాదనలు చోటుచేసుకున్నట్టు తెలిసింది. ప్రాజెక్టుకు సంబంధించి సీడబ్ల్యూసీ ఏపీకి నాలుగుసార్లు లేఖలు రాసింది. అయినా వాళ్లు పట్టించుకోలేదు. తెలంగాణ పూర్తి వివరాలు అందజేసింది. ఏపీ ఇచ్చిన ప్రాజెక్టుల వివరాల మేరకే 531 టీఎంసీలను సీడబ్ల్యూసీ కేటాయించింది. వాస్తవానికి ఏపీ ఇచ్చిన జాబితా, టీఏసీ వివరాల ప్రకారం 518 టీఎంసీలే ఇవ్వాలి. ట్రిబ్యునల్ మేరకు కేటాయింపుల్లో నీటిని వినియోగించుకొనేందుకు మాకు హక్కు ఉన్నది. మీకు అభ్యంతరాలు ఉంటే సీడబ్ల్యూసీ వద్ద తేల్చుకోవాలి' అని తెలంగాణ పేర్కొన్నది.

# 'స్వచ్ఛ్ బయో'పై ఈడీకి ఫిర్యాదు

మొదటిపేజీ తరువాయి...

విడుదల చేసిన రూ.1,000 కోట్ల పెట్టుబడితో ఎనుముల రేవంత్‌రెడ్డి (తెలంగాణ ముఖ్యమంత్రి), స్వచ్ఛ్ బయో కంపెనీ మధ్య జరిగిన అవగాహన ఒప్పందాన్ని మీ దృష్టికి తేవాలని అనుకుంటున్నాం. స్వచ్ఛ్ బయో ఇద్దరు డైరెక్టర్లలో ఒకరు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖలో నమోదైన ఎనుముల రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల జగదీశ్‌రెడ్డి కావడం ఆందోళన కలిగిస్తున్నది. డైరెక్టర్ ఎనుముల జగదీశ్‌రెడ్డి కరస్పాండెన్స్ చిరునామా 'ఫిలడెల్ఫియా, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా' అని ఉంది. దీనిని మీరు గమనించాలి. తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు వ్యాపారం చేయడాన్ని సమర్థించారు. అధికారిక పర్యటనలో సీఎం స్వయంగా ఓ కంపెనీతో వ్యాపారాన్ని ప్రకటిస్తుంటే అది 'కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రెస్ట్ అండ్ క్విడ్ ప్రోకో'లా అనిపిస్తుంది. సీఎం ఫిలడెల్ఫియా పర్యటనకు కేవలం 15 రోజుల ముందు కంపెనీని విలీనం చేయడం ఇక్కడ గమనార్హం. ఆ కంపెనీ జూబ్లీహిల్స్, హైదరాబాద్ చిరునామాతో ఎంసీఏలో రిజిస్టర్ చేయబడింది. అయితే, అమెరికాలో ఈ కంపెనీని ప్రకటించడం యొక్క ఉద్దేశం ఏమిటి? ఇందులో విదేశీ నిధుల ప్రమేయం ఉందా? మనీలాండరింగ్‌తో ఏదైనా సంబంధం ఉందా? జూబ్లీహిల్స్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో అధికారికంగా నమోదు చేసిన కార్యాలయంలో కంపెనీ పేరు, కనీసం బోర్డు కూడా లేదు. ఇది కార్పొరేట్ చట్టాన్ని ఉల్లంఘించడమే. ముఖ్యమంత్రి రేవంత్ ఎంవోయూపై సంతకం చేస్తున్న చిత్రంలో సీఎం తమ్ముడితోపాటు హర్ష పసునూరి అనే వ్యక్తి ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన వ్యాపార లబ్ధికి తన సోదరుడు జగదీశ్‌తో ఎంవోయూపై సంతకం చేయడం అతిపెద్ద అధికార దుర్వినియోగం. మా విజ్ఞప్తిని ఫిర్యాదుగా స్వీకరించి, స్వచ్ఛ్ బయో డైరెక్టర్లతో పాటు సీఎం రేవంత్‌రెడ్డిపై విచారణ జరిపించాలని ఫిర్యాదులో కోరారు.

### జాతీయ మీడియాలో 'స్వచ్ఛ్ బయో' రచ్చ

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి తన సోదరుడు జగదీశ్వర్‌రెడ్డికి చెందిన స్వచ్ఛ్‌బయో కంపెనీతో చేసుకున్న ఒప్పందం ఇప్పుడు జాతీయస్థాయిలోనూ చర్చనీయాంశమైంది. తన సొంత తమ్ముడితో కంపెనీ పెట్టించి దానితో రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం ఒప్పందం చేసుకోవడం విడ్డూరంగా ఉందంటూ జాతీయ మీడియాలో కథనాలు మొదలయ్యాయి. అసలు స్వచ్ఛ్ బయో కంపెనీ ఎవరిది? దాని పుట్టుపూర్వత్తరాలపై 'సీఎన్ఎన్' చానల్ ప్రత్యేక కథనాలను ప్రసారం చేసింది. 15 రోజుల క్రితమే ఏర్పాటైన కంపెనీతో ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ఒప్పందం ఎలా చేసుకున్నదని 'ఇండియా టుడే' ప్రత్యేక కథనంలో ప్రశ్నించింది. 'మనీ కంట్రోల్' కూడా సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి, స్వచ్ఛ్ బయో కంపెనీ తరపున ఆయన తమ్ముడితో చేసుకున్న ఒప్పందాలపై వార్తలను ప్రసారం చేసింది. ప్రముఖ న్యూస్ ఏజెన్సీ 'ఐఏఎన్ఎస్' కూడా దీనిపై కథనాలు రాసుకొచ్చింది.

## కౌలు రైతు బలవన్మరణం

జూలూరుపాడు, ఆగస్టు 20: పంటకు పెట్టుబడి సాయం అందక ఓ కౌలు రైతు పురుగుల మందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం శంభునిగూడెంలో మంగళవారం చోటు చేసుకున్నది. పోలీసులకథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కౌలు రైతు వగ్గెల ప్రసాద్ (36) కొన్నేండ్లుగా అదే గ్రామంలో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది కూడా ఐదెకరాలు పత్తి సాగు చేశాడు. మరో రెండెకరాల్లో వరి వేసేందుకు పెట్టుబడి సాయం కోసం తెలిసిన వారి వద్ద అప్పు అడిగినా పుట్టలేదు. దీంతో మనస్తాపం చెందిన ప్రసాద్ ఈ నెల 19న చేను వద్ద పురుగుల మందు తాగాడు. కొత్తగూడెం ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

## వీధికుక్కల వీరంగం

- గర్భిణి సహా 10 మందిపై దాడి

శక్కర్‌నగర్, ఆగస్టు 20: నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని తట్టికోట్ లో మంగళవారం వీధికుక్కలు వీరంగం సృష్టించాయి. గర్భిణి, చిన్నారులు సహా 10మందిపై దాడి చేశాయి. ఓ బాలుడిని లాక్కెళ్లేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. గాయాలైన వారిని బోధన్ దవాఖానకు తరలించారు. వీధి కుక్కల బెడదను నియంత్రించాలని అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆందోళనకు దిగారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# విగ్రహ రాజకీయం

**అస్తిత్వ** పోరాటంలో నుంచి ఎగిసిన ఆత్మగౌరవ పతాకం తెలంగాణ. అరవై ఏండ్ల సమైక్య ఆధిపత్య పాలనపై అలుపెరుగని పోరాటమే తెలంగాణ. స్వాభిమాన, సార్వభౌమాధికార శిఖరమే తెలంగాణ. అలాంటి తెలంగాణ అస్తిత్వంపై ఎనిమిది నెలల కాలంలోనే మరోసారి నీడలు పరచుకుంటున్నాయి. గత ఎన్నికలకు ముందు మాజీ సీఎం కేసీఆర్ హెచ్చరించినట్టుగానే ఢిల్లీ ఆధిపత్యం మళ్లీ జడలు విప్పుతున్నది. తెలంగాణ ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టే బానిసబుద్ధులు 'జీ హుజూర్ జో హుకుం' అంటూ మోకరిల్లుతున్నారు. ఇక్కడి ప్రజల ఆదర్శాలకు, ఆశయాలకు గండికొడుతున్నారు. ఇక్కడి ప్రతీకలను వెనుకతట్టు పట్టిస్తున్నారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టేందుకు వారికి చేతులు రాకపోవడమే అందుకు అతిపెద్ద నిదర్శనం. అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టేందుకు ఉరుకులాడటం వైపరీత్యం. దేశానికి ప్రధానులుగా చేసిన అనేకమందిలో రాజీవ్ ఒకరు. దేశంలో ఆధునిక సాంకేతికత ప్రవేశపెట్టేందుకు పాటుపడిన నేతగా ఆయనను గుర్తుంచుకోవాల్సిందే, గౌరవించుకోవాల్సిందే. దేశం కోసం సర్వోన్నత త్యాగం చేసిన నేతగా ఆయనను స్మరించుకోవాల్సిందే. ఎవరూ కాదనరు. అయినా ఇక్కడ ఆయనకు ఏం తక్కువైందని? రాజీవ్ రహదారి లేదా? రాజీవ్ స్టేడియం లేదా? రాజీవ్ అంతర్జాతీయ విమానాశ్రయం లేదా? ఊరూరా విగ్రహాలు ఉండనే ఉన్నాయి. నగరం నడిబొడ్డున పంజాగుట్టలో రాజీవ్ విగ్రహం ఉంది. అయినా ప్రాపకం కోసం వెంపర్లాట తప్పిస్తే కొత్తగా రాజీవ్ విగ్రహం పెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది?

వెన్నెముక లేని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు పదవుల కోసం ఢిల్లీ ముందు మోకరిల్లడం నాటి నుంచీ అలవాటే. ఆ అలవాటులో భాగంగా జరుగుతున్నదే రాజీవ్ విగ్రహ ఏర్పాటు హంగామా. అందుకు తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలనుకున్న చోటునే ఎంచుకోవడం వారిలో ప్రాంతీయ అస్తిత్వ చైతన్యం లోపించడాన్ని వేలెత్తి చూపుతున్నది. ఇక్కడి ఆకాంక్షల్ని ప్రతిఫలించే విగ్రహాలు పెట్టాల్సిన అవసరం లేదా? ఇక్కడి ప్రతీకల్ని నిలుపుకోవాలన్న సోయి ఉండొద్దా? తెలంగాణ అస్తిత్వంతో రాజీవ్‌కు ఏమైనా సంబంధం ఉందా? తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షతో కాంగ్రెస్ ఆటలాడిన చరిత్ర మరిచిపోలేం కదా. దేశాన్ని ఆర్థిక సుడిగుండం నుంచి బయటపడేసి మహోన్నత ప్రధానిగా మన్ననలందుకున్న ఈ గడ్డ ముద్దుబిడ్డ పీవీకి కాంగ్రెస్ చేసిన అవమానాలు కడిగితే పోయేవి కావు. అన్నీ మరిచిపోయి రాజీవ్ విగ్రహాలు పెడుతూ పోతే సరిపోతుందా? బీఆర్ఎస్ హయాంలో విమానాశ్రయానికి రాజీవ్ పేరు తొలగించి, తెలంగాణ అస్తిత్వంతో సంబంధమున్న వ్యక్తి పేరు పెట్టాలనే డిమాండ్లు బలంగా వినిపించాయి. అయినా అప్పటి నాయకత్వం సంయమనంతో, పరిణతితో వ్యవహరించి అందుకు పూనుకోలేదు. రేపు ప్రజల ఒత్తిడి ఎక్కువైతే పూనుకోదని మాత్రం చెప్పలేం. ఢిల్లీ పార్టీకి అధిష్ఠానమే సర్వోన్నతం. కానీ, బీఆర్ఎస్‌కు ప్రాంతీయ అస్తిత్వమే సర్వస్వం.

తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నం సాకారమై నూతన సచివాలయ భవనం వెలిసింది. ఆ భవనం ముందర తెలంగాణ తల్లి విగ్రహం ఉండటమే ఉచితం. కొందరు మిడిమిడి జ్ఞానులు తెలంగాణ తల్లి భావనపై, రూపురేఖలపై ప్రశ్నలు లేవనెత్తి గందరగోళపర్చాలని చూస్తున్నారు. తెలంగాణ తల్లి భావన ఈనాటిది కాదు. దాశరథి, రావెళ్ల రామారావు వంటి కవులు ఆనాడే తెలంగాణ తల్లి అంటూ పద్యాలు రాశారు. తెలంగాణ మలిదశ ఉద్యమ స్ఫూర్తిలో నుంచి ఆవిష్కృతమైన తెలంగాణ తల్లి విగ్రహాలు ఈనాడు చాలా ఊళ్లలో కనిపిస్తున్నాయి. ఆ విగ్రహ రూపురేఖలపై సర్వత్రా ఆమోదం వ్యక్తమైంది. అదే నికరమైంది. సమైక్య పాలకులు తమ ఆధిపత్యాన్ని స్థిరీకరించుకునేందుకు ముందుకుతెచ్చిన తెలుగు తల్లి భావన ఇక్కడ ఎవరికీ పెద్దగా ఎక్కలేదు. ఇక్కడి ప్రజల మనసుల్లో తెలంగాణ తల్లి తప్ప మరొకటి లేదు. రాజీవ్ విగ్రహం ఆలోచన మానుకుని తెలంగాణ తల్లి విగ్రహాన్ని తెలంగాణ సచివాలయం ముందు నెలకొల్పాలని కోరుతూ ఇక్కడి విద్యావంతులు కాంగ్రెస్ అధిష్ఠానానికి బహిరంగ లేఖ రాసిన సంగతి తెలిసిందే. ప్రజల ఆకాంక్షలు, ఆశలను సోనియా, రాహుల్ కాదంటారా? రాజీవ్ పేరును కాంగ్రెస్ నేతలు అత్యుత్సాహంతో రగడలోకి లాగడాన్ని వారు సమర్థిస్తారా?

కాంగ్రెస్‌కు ప్రజలు ఒకవిడత అధికారం మాత్రమే ఇచ్చారు. రాష్ర్టాన్ని రాసివ్వలేదు. తెలంగాణ చైతన్యశీలమైన గడ్డ. కాంగ్రెస్ నాయకుల బానిస మనస్తత్వాన్ని ఇక్కడి ప్రజలు ఏ మాత్రం సహించరు. ఇది కాంగ్రెస్ పాలకులు ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన సత్యం. మీ పదవులను పదిలం చేసుకునేందుకు మీరు రాజీవ్ నామజపం చేస్తున్నారేమో. అధినేత్రి సోనియాను ప్రసన్నం చేసుకునేందుకు అదొక తాయెత్తులా పనిచేస్తుందనే చౌకబారు ఆలోచన తప్పితే ఇందులో మరేమైనా ఉందా? మీరు రాజీవ్‌ను గౌరవిస్తున్నామని అనుకుంటున్నారేమో. కానీ, ప్రజల దృష్టిలో చులకన చేస్తున్నామని గుర్తించడం లేదు. ఉదాత్త ఆశయాలు, ఆధునిక భావజాలమున్న రాజీవ్ గనుక బతికుంటే ఈ తరహా వ్యక్తి ఆరాధనను సహించేవారా అని కూడా కాంగ్రెస్ నేతలు ఆలోచించడం లేదు. తెలంగాణ పోరుగడ్డ. తలవంచని వీరుల గడ్డ. ఇక్కడ గడీలు కూలినై, అహంకారాలు నేలవాలినై. ప్రజలు కన్నెర్రజేస్తే 'సహేంద్ర తక్షకాయ స్వాహా' అన్నట్టుగా మీరు, మీ అధికారం, మీ విగ్రహాలు అన్నీ కుప్పకూలకతప్పదు.



## ఆర్థిక అసమానతలు తీవ్రతరం!

మన దేశంలో నిరుద్యోగ సమస్య మాత్రమే కాదు, ధనికులు-పేదల మధ్య అంతరం కూడా మరింతగా పెరుగుతున్నది. అసాధారణ సంపద పంపిణీ.. ఆర్థిక అసమానతలను మరింత తీవ్రతరం చేసిందని దానర్థం. ఈ పరిస్థితి ప్రజలతో పాటు దేశ ప్రయోజనాలను ప్రభావితం చేస్తున్నది. ఇది ఆందోళన కలిగించే అంశం.

- మాయావతి, యూపీ మాజీ ముఖ్యమంత్రి

# మళ్లీ అస్తిత్వ పోరు.. తప్పదు జనహోరు!

**ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి దశాబ్ద కాలం పూర్తయినప్పటికీ తెలంగాణ అస్తిత్వ పోరాటం మళ్లీ మొదటికే వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువైన వెంటనే తెలంగాణ అస్తిత్వ ప్రతీకలపై దాడి మొదలైంది. తెలంగాణ సాంస్కృతిక, చారిత్రక వారసత్వ చిహ్నాలపై విషం చిమ్మడం ప్రారంభమైంది. ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన కాకతీయ కళాతోరణం కళాత్మకతను కప్పిపెట్టే ప్రయత్నం జరిగింది. ఆరోగ్య, సౌభాగ్య హైదరాబాద్‌ను కాంక్షిస్తూ నిర్మించిన ఆధునిక మానవ జీవనాభివృద్ధి, నగర నిర్మాణస్ఫూర్తి చిహ్నం చార్మినార్ రాచరికపు చిహ్నం స్థాయికి పడిపోయి అవమానపడింది.**



**ఎర్రోజు శ్రీనివాస్**
**97003 02973**



అవమానాల వరుసలో ఇప్పుడు తెలంగాణ తల్లి వంతు వచ్చింది. మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రత్యామ్నాయ అస్తిత్వ ప్రతీకలను ముందుపెట్టుకొని సాగింది. తెలంగాణకున్న ప్రత్యామ్నాయ సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని పునర్నిర్వచించుకున్నది. ఆ సాంస్కృతిక పునర్నిర్మాణ పరంపరలో తెలంగాణ తల్లి ఆవిర్భవించింది. ఉమ్మడి ఏపీలో తెలుగు తల్లికి ప్రత్యామ్నాయంగా తెలంగాణ ప్రజలు తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించుకున్నారు. ఊరూరా, వాడవాడలా తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్ఠించుకున్నారు. 2003లో మొదటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నప్పటి నుంచి ఇక్కడి ప్రజల ఆకాంక్ష అంతా స్వరాష్ట్ర సాధన చుట్టే తిరిగింది. సచివాలయంలో తెలంగాణ వాళ్లుండాలి, సచివాలయం తెలంగాణ తల్లిని గౌరవించాలి. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం ముందు నిలబెట్టాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పుడు తెలంగాణ ఉద్యమకారులు, ప్రజలు సంతోషించారు. మన స్వీయ అస్తిత్వానికి, స్వయంపాలనకు తెలంగాణ తల్లి విగ్రహం ప్రతీకగా నిలుస్తుందని సంతోషించారు, ఆహ్వానించారు. కానీ, ప్రభుత్వం మారగానే తెలంగాణ అస్తిత్వంపై దాడి మళ్లీ మొదలైంది. తెలంగాణ చరిత్రను కొందరు వక్రీకరించే పనిలోపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు మారడం సహజం. ఏ ప్రభుత్వం వచ్చినా ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పరిపాలన చేయాలి. కానీ, అస్తిత్వాన్ని దెబ్బతీస్తామంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు.

తెలంగాణ తల్లికి రాజీవ్‌గాంధీ ప్రత్యామ్నాయం కాగలరని కాంగ్రెస్ వారు భావిస్తున్నారా? అయితే, భరతమాతకు బదులుగా వేరే రాజకీయ నాయకులను ప్రత్యామ్నాయంగా చూపే సాహసం చేస్తారా? గతంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టే ప్రదేశాన్ని రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడానికి ఎంపిక చేయడంతో ఈ ప్రభుత్వ దుర్బుద్ధి బహిర్గతమైంది. తెలంగాణ అస్తిత్వంతో ఈ ప్రభుత్వం పనిచేయడం లేదని అర్థమవుతున్నది. తెలంగాణపైనే ఎందుకింత కక్ష? కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఇతర రాష్ర్టాల్లో వారి స్థానిక అస్తిత్వాలను వదులుకుంటున్నారా? మన రాష్ట్రంలోనే ఇలాంటి సంఘటనలు జరగడానికి కారణం ఈ రాజకీయ నాయకత్వం వెనుక ఆంధ్రా నాయకత్వ లాబీ పనిచేస్తున్నదనటంలో ఎటువంటి సందేహం లేదు. రాజకీయ నాయకత్వం రూపంలో తెలంగాణతనం సారంలో ఆంధ్రా తత్వం కురిపిస్తున్నది. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలనుకున్న ప్రదేశంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయం తీసుకోవడం గర్హనీయం. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, మనోభావాలతో రాజకీయం చేయాలని చూసిన ఆంధ్రా నాయకత్వాన్ని మన రాష్ట్రం నుంచి తరిమికొట్టాం. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా మన ప్రాంత రాజకీయ నాయకులు మన అస్తిత్వాలను, మన సోయిని కలిగిలేరు. తెలంగాణ ప్రజల కరుణతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు మరెవరికో ఊడిగం చేయడానికి తెలంగాణ తల్లిని అవమానించాలని చూస్తున్నారు. తమకు అధికారాన్ని అప్పగించిన ప్రజల ఆకాంక్షలు చూసేవారు ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల పోరాటాన్ని మననం చేసుకోవాల్సిందిగా కోరుతున్నా.

> **తెలంగాణపైనే ఎందుకింత కక్ష? కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఇతర రాష్ర్టాల్లో వారి స్థానిక అస్తిత్వాలను వదులుకుంటున్నారా? మన రాష్ట్రంలోనే ఇలాంటి సంఘటనలు జరగడానికి కారణం ఈ రాజకీయ నాయకత్వం వెనుక ఆంధ్రా నాయకత్వ లాబీ పనిచేస్తున్నదనటంలో ఎటువంటి సందేహం లేదు.**

> **సంచలనాల కోసం, వివాదాల కోసం ప్రజల ఆకాంక్షలు, తెలంగాణ అస్తిత్వంతో ఆడుకునే ప్రయత్నం చేయకూడదు. మాట, యాసలోనే తెలంగాణ, ఆలోచనలన్నీ ఆంధ్రాలో అన్నట్టున్నది పరిస్థితి. విశ్వనగరంలా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరాన్ని చూసి ఇతర ప్రాంతాలవారు ఇలాంటి నగరాన్ని నిర్మించుకోవాలని ఆశపడుతుంటే, ఇక్కడ అమరావతి లాంటి నగరాన్ని నిర్మిస్తామని ప్రకటించడం ద్వారా వారి మెదడు ఆలోచనలు ఎవరి స్వాధీనంలో, ఆధీనంలో ఉన్నాయో అర్థం అవుతున్నది.**

తెలంగాణ తల్లి భావన తిరిగి మలిదశ తెలంగాణ ఉద్యమంలో పునర్జీవం పొందింది. అందుకే తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అయిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని నెలకొల్పాల్సినచోట రాజీవ్ విగ్రహాన్ని పెట్టడం ద్వారా అధిష్ఠానం మెప్పు పొందుతారేమో.. కానీ, ప్రజల్లో ఉన్న పతారా మాత్రం పోగొట్టుకోవడం ఖాయం. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసేచోట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెడతామని.. ఎవరినీ సంప్రదించకుండా, ఎవరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నది. ఇది తెలంగాణ తల్లిని అవమానించడమే. ఇది ఇక్కడితో ఆగిపోదు. ప్రజల మనోభావాలను, ఆకాంక్షలను దెబ్బతీస్తే.. స్వీయ అస్తిత్వ ఆకాంక్షల పరిరక్షణకు ప్రజల ప్రతిస్పందనను ముందే ఊహించవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా. ఉద్యమ సమయంలో ప్రజలు తమ నేమ్ ప్లేట్ల మీద, వెహికల్ నంబర్ ప్లేట్ల మీద స్వచ్ఛందంగా 'టీజీ' అని రాసుకొని ఏపీ ఆనవాళ్లను చెరిపేసిన ఘటనలు ఈ ప్రభుత్వంలో ఉన్న వారికి ఇంకా గుర్తుండే ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లోకి తెలంగాణ ప్రజలను నెట్టే కార్యక్రమాలేవీ చేయకపోవడం మంచిది.

సంఖ్యా బలం ఉన్నదని అస్తిత్వాలను కూలగొడదామంటే కుదరదు. సంఖ్యాబలాలు శాశ్వతం కావు. అవి ఐదేండ్లకోసారి మారేవే. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఏం చేసినా సంఖ్యా బలాలు తారుమారైపోతాయి. నా తెలంగాణ తల్లి పుణ్యకంజాతవల్లి. తెలంగాణ అస్తిత్వం ముందు ఏదీ నిలబడదు. తెలంగాణ తల్లికి మరో ప్రత్యామ్నాయం లేదు.

**(వ్యాసకర్త: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ వికాస సమితి)**

**విభిన్న జాతులు, మతాలు, భాషలు, నైసర్గిక స్వరూపాలు కలిగిన ప్రాంతాల సమాహారం జమ్ముకశ్మీర్. నిత్యం వార్తల్లో ఉండే ఈ ప్రాంతంలో పదేండ్ల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. సెప్టెంబర్ 18 నుంచి మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల కమిషన్ ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్టికల్ 370 రద్దుతో కేంద్రపాలిత ప్రాంతంగా మారిన కశ్మీర్‌లో జరగనున్న ఈ ఎన్నికలు జమ్ముకశ్మీర్ చరిత్రలోనే ప్రత్యేకమైనవి. ఈ నేపథ్యంలో 'పీపుల్స్ పల్స్' బృందం కశ్మీరు లోయ నుంచి జమ్మూ మైదాన ప్రాంతాల వరకు.. ఎందరో సామాన్య కశ్మీరీలతో మాట్లాడి, వారి మనసులో ఏముందో పసిగట్టే ప్రయత్నం చేసింది.**

# కశ్మీరీలను గెలవడం పార్టీలకు పరీక్షే!



**దిలీప్ రెడ్డి**
**99490 99802**



**1977**లో మొరార్జీదేశాయ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక జరిగిన అసెంబ్లీ ఎన్నికలొక్కటే.. 78 ఏండ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో స్వేచ్ఛగా, న్యాయంగా జరిగిన ఎన్నికలని కశ్మీరీలు అంటుంటారు. అంతకు ముందు, ఆ తర్వాత జరిగిన ఎన్నికలన్నీ ఢిల్లీ పాలకులకు అనుకూలంగా జరిగిన ఎన్నికలేననేది వారి భావన. అక్కడి ప్రజలకు స్థానిక సమస్యల పరిష్కారం పట్ల ఏకాభిప్రాయం లేనప్పటికీ.. లెఫ్టినెంట్ గవర్నర్ పాలన పోయి, తాము ఎన్నుకున్న ప్రభుత్వం రావాలనే విషయంలో మాత్రం ఏకాభిప్రాయం ఉన్నది.

ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని 2023 డిసెంబరు 11న సుప్రీంకోర్టు సమర్థించింది. అయితే, రాష్ట్ర హోదాను పునరుద్ధరించి, సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అక్కడివారితో ముచ్చటించగా.. 'సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇప్పుడు జమ్ముకశ్మీర్‌లో ఎన్నికలు జరగబోతున్నాయి. మహా అయితే ఢిల్లీ లాంటి ప్రభుత్వం ఏర్పడవచ్చు. అక్కడ అన్ని కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. అలాంటి ప్రభుత్వం మాకొద్దు' అని ఒక వ్యాపారి అభిప్రాయపడ్డారు. ఇలాంటి అభిప్రాయమే చాలాచోట్ల వినపడింది. కేంద్రపాలిత ప్రాంతాలుగా కాకుండా.. రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఇటు కశ్మీర్, అటు లఢఖ్ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.

> **గతంలో బీజేపీకి ఓటేసినవాళ్లు కూడా రాష్ట్ర హోదా-పాలన విషయంలో ఢిల్లీ మోడల్‌ను వ్యతిరేకిస్తున్నారు. బీజేపీకి బలమైన మద్దతుదారులుగా ఉన్న గుజ్జర్ సామాజికవర్గం ఇప్పుడు ఆ పార్టీకి దూరమైంది. స్థానిక బీజేపీ నాయకులు కూడా రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని, ఢిల్లీ తరహా ప్రభుత్వం వద్దని చెప్తున్నారు. కశ్మీర్ విషయంలో తమది చారిత్రాత్మక నిర్ణయమని దేశవ్యాప్తంగా బీజేపీ ప్రచారం చేసుకుంటుండగా.. ఆ నిర్ణయం సరైనదేనని కశ్మీర్ బీజేపీ నాయకులు ధైర్యంగా చెప్పలేకపోతున్నారు.**

కశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ప్రజలెన్నుకున్న ప్రభుత్వంలో కొన్ని లోపాలు, వైఫల్యాలు ఉంటాయి. కానీ, మిలిటరీ సాయంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్న ఎల్జీ పాలన కంటే అది మెరుగ్గానే ఉంటుందని అక్కడి ప్రజలు భావిస్తున్నారు. 'ఎల్జీకి, ప్రజలకు మధ్య సంబంధాలు తెగిపోయాయి. ఎన్నికలతో సంబంధం లేకుండా వచ్చిన ఎల్జీ, అతని బ్యూరోక్రాట్ల బృందం నుంచి ప్రజాస్వామిక పాలనను ఆశించలేం' అని జమ్ము యూనివర్సిటీకి చెందిన ఓ ప్రొఫెసర్ అన్నారు. 'ప్రజల అంచనాలకు తగ్గట్టుగా నాయకులు పని చేయకపోతే, వచ్చే ఎన్నికల్లో తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. అది దృష్టిలో ఉంచుకొనైనా వారు ప్రజల కోసం పనిచేస్తారు. కానీ, ఎల్జీ, బ్యూరోక్రాట్లకు ఆ ప్రమాదం లేదు' అని శ్రీనగర్‌లో కలిసిన ఓ ప్రభుత్వ ఉద్యోగి అభిప్రాయపడ్డారు.

> **రాజకీయ పార్టీల పట్ల కశ్మీరీల దృక్పథం మారిందని ఇటీవలి లోక్‌సభ ఎన్నికలు నిరూపించాయి. కశ్మీర్ ప్రాంతంలో అశాంతికి, తీవ్రవాదానికి, మత కలహాలకు చోటులేదని సార్వత్రిక ఎన్నికల్లో పెరిగిన ఓటింగ్ శాతం అన్ని రాజకీయ పార్టీలకు సానుకూల సంకేతాలు పంపించింది.**

వేర్పాటువాదాన్ని, తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నదనే ఆరోపణలపై జమాతె ఇస్లామీ సంస్థను నిషేధించిన ఎన్డీయే ప్రభుత్వమే.. ఆ నిషేధాన్ని ఎత్తివేయడంపై ప్రజల్లో భిన్నమైన సంకేతాలు వెళ్తున్నాయి. సంప్రదాయ నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీలకు జమాతె ఇస్లామీ ప్రత్యామ్నాయంగా మారే అవకాశాలను కశ్మీరీలు కొట్టిపారేయడం లేదు.

లోక్‌సభ ఎన్నికల్లో కశ్మీర్‌లో అభ్యర్థిని నిలబెట్టకుండా జమ్మూలో బీజేపీ తన బలాన్ని పరిరక్షించుకుంది. ఈ అసెంబ్లీ ఎన్నికలను ఆ పార్టీ ఒక ప్రయోగంగా చూస్తున్నట్టు అనిపిస్తున్నది. ఎలాంటి ఫలితాలు వచ్చినా ఫర్వాలేదన్నట్టుగా బీజేపీ వ్యవహరిస్తున్నది. మరోవైపు బీజేపీని ఆకాశానికెత్తేందుకు మీడియాలో చూపించే వంతెనలు, అండర్‌పాస్‌లను పక్కనపెడితే.. స్థానిక ప్రాంతాలను కలిపే రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. మొత్తంగా 2019కి ముందే బాగుండేదని స్థానికులంటున్నారు.

జమ్మూ, శ్రీనగర్.. పేరుకే స్మార్ట్ సిటీలని, కనీస మౌలిక వసతులు లేక తమ వ్యాపారాలు దెబ్బతిన్నాయని వ్యాపారులు వాపోతున్నారు. బయటి నుంచి వచ్చిన వ్యాపారులు అక్రమ మైనింగ్ చేస్తున్నారని, మద్యం వ్యాపారం చేస్తున్నారని, ముఖ్యమైన పదవుల్లో స్థానికేతర అధికారులే ఉంటున్నారని, దానివల్ల తమకు అన్యాయం జరుగుతున్నదని అందరూ ముక్తకంఠంతో చెప్తున్నారు. 'ఐఐఎం, ఐఐటీల్లో కూడా ముఖ్యమైన పదవుల్లో బయటివాళ్లనే ఎందుకు నియమిస్తున్నారు? ఎందుకంత భయం?' అని అడ్వకేట్ షేక్ షకీల్ ప్రశ్నించారు.

ఉద్యోగావకాశాలు సన్నగిల్లడం, బయటివాళ్లు అక్కడి వ్యాపారాలు, సంస్థలను నియంత్రించడం పట్ల కశ్మీరీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇవన్నీ బీజేపీకి నష్టం చేసేవే. 'మాకు ఉద్యోగాల్లేవు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దేశద్రోహుల కింద మాపై నేరం మోపుతున్నారు' అని కశ్మీరీ యువత అభిప్రాయపడుతున్నది.

అనవసర ఖర్చు అవుతున్నదని చలికాలంలో జమ్మూ, వేసవిలో శ్రీనగర్ నుంచి జరిగే దర్బార్ పాలనకు 2019లో ఎన్డీయే ప్రభుత్వం చెక్‌పెట్టింది. కానీ, దర్బార్ ఉన్నప్పుడు అధికారులు, వాళ్ల కుటుంబాలు ఇక్కడే బస చేసేవని, వారు ఐదారు నెలల పాటు చేసే ఖర్చే తమ ఆదాయమని జమ్మూకు చెందిన వ్యాపారి వికాస్‌శర్మ చెప్పారు. అంతేకాదు, అమర్‌నాథ్, మాత వైష్ణో దేవి యాత్రికులు గతంలో జమ్మూలో బాస్మతి బియ్యం, రాజ్మా, బాదం, కుంకుమ, దుస్తులు కొనుగోలు చేసేవారు. ఇప్పుడు కత్రాకు రోడ్డు, రైలు మార్గాలు విస్తరించడంతో జమ్మూలో యాత్రికులు ఆగడం లేదు. ఇది కూడా జమ్మూలో ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. ఇలా తమ ప్రాంతంలోని అనేక సమస్యలు పరిష్కారం కావాలని కశ్మీరీలు కోరుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో 1990లో చెల్లాచెదురైన కశ్మీరీ పండిట్లకు ఎలాంటి భరోసా కల్పిస్తారు? నిరుద్యోగ సమస్యను ఎలా రూపుమాపుతారు? అభివృద్ధి, సంక్షేమాన్ని ఎలా అందిస్తారు? శాంతిని ఎలా నెలకొల్పుతారు? లాంటి అనేక ప్రశ్నలకు రాజకీయ పార్టీలు, నాయకులు సమాధానం చెప్పాల్సి ఉంది. ఆ సమాధానాల ఆధారంగా ఓటేసి తమ భవితవ్యాన్ని రూపొందించుకోవాలని కశ్మీరీలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**(వ్యాసకర్త: రాజకీయ విశ్లేషకుడు, పీపుల్స్ పల్స్ రిసెర్చ్ సంస్థ)**

# 'నాకు రుణమాఫీ గాలె'

*ఇప్పుడు రాష్ట్రంల 'నాకు రుణమాఫీ గాలె' కాలం నడుస్తున్నది. 'నీ క్రాప్ లోన్ మాఫైందా?' అన్న ప్రశ్నలకు 'నాదింకా మాఫీ గాలె' అన్న జవాబులే ఎక్కువగా ఇనవడ్తున్నయి. 'రైతులందరికీ రుణమాఫీ జేసినమని కాంగ్రెస్ సర్కార్ గొప్పలు చెప్పుకుంటుంటే.. నువ్విట్లా రాస్తున్నవేంద'ని మీకు డౌట్ గొట్టొచ్చు, తప్పు లేదు. కానీ, ఓ పవోజనంల పది మంది బంతి మీద గూసున్నప్పుడు ఒక్కతనికి గంటెడు తున్కలేసి, తతిమా తొమ్మిది మందికి ఉత్త శోర్వా వోసి సాలిచ్చుకుంటే.. అక్కడున్నోళ్లందరికీ కడుపు నిండా తిండి వెట్టినట్టు కాదు. ఆ తున్కలు వడ్డాయన తిట్టకపోవచ్చు కానీ, తతిమా తొమ్మిది మంది మాత్రం.. 'వీనికి ఎల్లకుంటె యాటలు కోసి పవోజనం ఎవ్వడు చెయ్యిమన్నడు. కూరగాయలతోని పవోజనం జేసి అందరికీ కడుపు నిండా తిండివెడ్తే ఎవ్వడన్న కొడ్తుండెనా?' అని బండు బండు కడ్గుతరు. ఆ తిట్లకు గంటెడు తున్కలు తిన్న మనిషికి గూడ మనసున వట్టది. అచ్చం రుణమాఫీ ముచ్చట గూడ అసొంటిదే. పదిమందిల ఎవ్వలికో ఒగలికి రుణమాఫీ అయితే.. రైతులందరికీ రుణమాఫీ అయినట్టు ఎట్లయితది? అస్సల్కే గాదు.*



**గడ్డం సతీష్**
**99590 59041**



***

మస్తు రోజుల తర్వాత నా దోస్తు ఒకతను మస్కట్ నుంచి తెలంగాణకొచ్చిండు. నలభై రోజుల చుట్టీ మీదొచ్చిన అతను మళ్లా మస్కట్ వోతడనంగా ముఖ్యమంత్రి నోట్లెకెళ్లి 'రుణమాఫీ' ముచ్చట బైటికెళ్లింది. ఆ ముచ్చటిన్న నా దోస్తు.. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చే భూమిని తన పేరు మీన జేస్కుందామని మస్కట్ పోవుడు వాయిదా ఏస్కున్నడు. నా దోస్తు వాళ్ల బాపు పేరు రాములు. ఆయనగూడ వలస జీవే. ఓ పదిహేనేండ్ల పాటు మస్కట్‌ల ఉండి ఐదారేండ్ల కిందనే సొంతూరికొచ్చిండు. పుష్కలంగా ఉన్న సాగునీటిని జూసిన రాములు 'నేనిగ మళ్లా మస్కట్ వోను, ఇక్కన్నే ఎవుసం జేస్కుంట'నని ఒక్కశిత్తం జేస్కున్నడు. లాగోడి కోసం తన భూమి కాయిదాలను బేంకుల కుదవెట్టి మరీ లక్షా నలభై వేల రూపాల క్రాప్‌లోన్ దీస్కున్నడు. పుట్టినూళ్లనే మళ్లా ఎవుసం షురూ జేసిండు. రెండు పసళ్ల పంట దీసిండో, లేదో పాపం పానం మంచిగలేక రాములు కాలంజేసిండు. ఆయ్యనే కాలం జేసిండంటే ఇగ క్రాప్‌లోన్ ఎవరు గడ్తరు, యాడికెళ్లి గడ్తరు?, అదట్లనే పడావున్నది. ఇప్పుడు ముఖ్యమంత్రి రుణమాఫీ జేస్తే.. రాములు కుదవెట్టిన పాస్‌బుక్కులను బేంకుల కెళ్లి ఇడిపిచ్చుకుందామని అనుకుంటున్నడు రాములు కొడుకు. ఆ భూమిని తన పేరుమీన జేస్కున్నంక మళ్లా మస్కట్ వోదామనుకుంటున్నడు. అందుకే మస్కట్ పోవుడు వాయిదా గూడ ఏస్కున్నడు. మొన్న కాంగ్రెస్ సర్కారోళ్లు విడుదల జేసిన మూడు రుణమాఫీ లిస్టుల్లో రాములు పేరు లేదు. క్రాప్‌లోన్ ఇగ మాఫైతదా, అగ మాఫైతదా అని జూసిన నా దోస్తు ఆశలు ఆవిరైనయి. మొన్న ఫోన్జేసి 'అరేయ్.. ఆ క్రాప్‌లోన్ మాఫ్ గాదు, మన్ను గాదు. ముఖ్యమంత్రి ముచ్చటను నమ్ముకుంటే నా నోట్లె మన్ను వడుతది. ఇగ నేను వోతరా మస్కట్' అని తెగ బాధవడవట్టిండు.

పంబ శివశంకర్ అని మా ఆఫీసుల పన్జేస్తడు. సీఎం రేవంత్‌రెడ్డి నోట్లెకెళ్లి రుణమాఫీ ముచ్చట ఎల్లినకాన్నుంచి ఆ పిల్లగాని సంబురానికి పట్టపగ్గాల్లెవ్వు. శివ వాళ్ల కుటుంబానికి పదెకరాల భూమున్నది. ముగ్గురి పేర్లమీన ఉన్న ఆ భూమి కాయిదాలను తుమ్మన్‌పేట్ బేంకుల కుదవెట్టి మూణ్నాలుగేండ్ల కింద లక్షా తొంభై వేల రూపాల క్రాప్‌లోన్ దీస్కున్నరు. మిత్తితోని గల్పి అవిప్పుడు మూడు లచ్చల నలభై వేలైనయి. 'ఆ క్రాప్‌లోన్ మాఫైతే మా అంత అదృష్టమంతులెవరూ ఉండరన్నా' అని పాపం శివ రోజూ శెప్తనే ఉంటడు. రుణమాఫీ లిస్టు విడుదలైనప్పుడల్లా శివ కాలు గాలిన పిల్లి లెక్క ఆఫీసుల అటూ ఇటూ తిర్గుతనే ఉంటడు. ఏం ఫాయిదా? మూడు లిస్టుల్ల ముగ్గురి పేర్లేమొగని, కనీసం ఒక్కరి పేరు గూడ లేదు. అసలు ముచ్చటేందంటే.. ముగ్గురికి గల్పి రెండు లచ్చల రూపాలు మాఫైనా.. తతిమా పైసలు బేంకుల గడ్తమని ఇంకో లచ్చా నలభై వేల రూపాలు అప్పు దీస్కొచ్చి మరీ ఇంట్ల వెట్టుకున్నరట. ఆ రెండు లచ్చలు మాఫైంది లేదు గనీ, ఈ లచ్చా నలభై వేలకు మాత్రం రోజురోజుకు మిత్తి వెర్గుతనే ఉన్నది.

> **మార్కొండ రమణ అని నాకు అల్లుడైతడు. తన భూమి కాయిదాలు బేంకుల కుదవెట్టి నాలుగైదేండ్ల కింద రెండు లచ్చల రూపాల క్రాప్‌లోన్ తీస్కున్నడు. తీస్కున్నప్పడల్లా నాగ వోకుండా ఏటా మిత్తి కట్టేటోడె గని, 'క్రాప్ లోన్లు మీరు కట్టకుర్రి.. మేమొచ్చినంక మాఫీ చేస్త' మని రేవంత్‌రెడ్డి చెప్పిన ముచ్చట్లను వట్టుకొని ఈసారి ఆ మిత్తి గూడ కట్టలె. 'నేడే.. రుణమాఫీ పండుగ' అని కాంగ్రెస్ నాయకులు చెప్పినప్పడల్లా మాఫీ లిస్టుల 'నా పేరున్నదా, లేదా..' అని ఆత్రంగ వోయి జూసిండు. రుణమాఫీ కాలేదు, మన్ను కాలేదు. రమణకు ఇగ మాఫైతదనే నమ్మిక గూడ వోయింది. 'ముఖ్యమంత్రి మాట వట్టుకుంటే ఉత్తగ మిత్తీ మీద మిత్తీ వడవట్టె గద మామా..' అని తల్లడిల్లుతున్నడు.**

***

ఇట్లా ఏ రైతుతోని మాట్లాడినా.. 'నాకు రుణమాఫీ గాలె' అనే ముచ్చటనే ఎల్తున్నది తప్ప, 'ఛల్.. నాకు రుణమాఫీ అయింద'ని మాత్రం ఒక్క రైతు గూడ గట్టిగ చెప్తలేడు. కల్లబొల్లి మాటలు చెప్పిన కాంగ్రెస్ సర్కార్ రుణమాఫీ అమలులో కొర్రీల పేరిట కోతలు వెడ్తున్నదని రైతులు తమ గోడును ఎల్లవోసుకుంటున్నరు. అయినా నన్నడిగితే... తీరొక్క పన్జేసి గూడ చెప్పుకోని నాటి సర్కార్ కన్నా ఈ సర్కారే నయ్యం తీయిర్రి. చెయ్యని, చెయ్యలేని పనులను గూడ చేసినమని చెప్పుకొంటున్న చెయ్యి గుర్తు సర్కారోళ్లకు ఎన్ని శనార్థులు చెప్పినా తక్కువే!

### ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): రిజర్వు బ్యాంకు 90 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా క్విజ్‌ను నిర్వహిస్తున్నది. జాతీయ స్థాయిలో క్విజ్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు, ఇందుకు సంబంధించి కళాశాలలవారీగా విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నది. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10 లక్షలు, రూ.8 లక్షలు, రూ.6 లక్షలుగా నిర్ణయించింది. వివరాలకు ttps://www.rbi90quiz.in సంప్రదించాలని సూచించింది.

### కిమ్స్‌లో పెరిగిన ఎస్బీఐ లైఫ్ వాటా

న్యూఢిల్లీ, ఆగస్టు 20: కిమ్స్‌లో ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ తాజాగా 7.75 లక్షల షేర్లను రూ.184 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో కిమ్స్‌లో ఎస్బీఐ లైఫ్ వాటా మరో 0.97 శాతం పెరిగినట్లు అయింది.

# బంగారం.. హై జంప్

**ఒక్కరోజే రూ.1,400 ఎగబాకిన తులం ధర**

**ఢిల్లీలో రూ.74,150కి చేరిక**

**వెండి రూ.3,150 ఎగిసి కిలోరూ.87,150 వద్దకు**



న్యూఢిల్లీ, ఆగస్టు 20: బంగారం ధరలు భారీగా పెరిగాయి. మంగళవారం ఒక్కరోజే తులం 24 క్యారెట్ గోల్డ్ రేటు ఏకంగా రూ.1,400 ఎగిసింది. గడిచిన నెల రోజుల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. దీంతో ఢిల్లీ మార్కెట్‌లో 99.9 స్వచ్ఛత కలిగిన పుత్తడి రూ.74,150 పలికింది. సోమవారం ఇది రూ.72,750గా ఉన్నది. ఇక 22 క్యారెట్ పసిడి విలువ కూడా ఇంతే స్థాయిలో పుంజుకున్నది. ఫలితంగా 99.5 స్వచ్ఛత కలిగినది 10 గ్రాములు రూ.73,800గా ఉన్నది. మార్కెట్‌లో బంగారానికి స్థానిక నగల వ్యాపారుల నుంచి డిమాండ్ ఉండటం, అంతర్జాతీయంగా కూడా ఆదరణ పెరగడం.. ధరల్ని పరుగులు పెట్టిస్తున్నదని ట్రేడర్లు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బంగారంపై దిగుమతి సుంకాన్ని తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో అదే రోజున రూ.3,350 క్షీణించింది. ఆ తర్వాత కూడా కొద్ది రోజులు పతనం దిశగానే పయనించింది. కానీ మళ్లీ ఇటీవలి కాలంలో ధరలు పుంజుకుంటున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లోనూ గోల్డ్ సేల్స్ జోష్ మీదనే కనిపిస్తున్నాయి. అయినప్పటికీ 22 క్యారెట్ 10 గ్రాములు రూ.66,600, 24 క్యారెట్ రూ.72,650గానే ఉన్నాయి.

**వెండి ధరలూ దౌడు**

వెండి ధరలూ పెద్ద ఎత్తున పెరిగాయి. ఢిల్లీలో ఈ ఒక్కరోజే కిలో రేటు రూ.3,150 ఎగిసింది. దీంతో అక్కడ కేజీ సిల్వర్ విలువ రూ.87,150గా నమోదైంది. ఇక హైదరాబాద్‌లో కిలో రూ.1,000 పెరిగి రూ.92,000 మార్కును తాకింది. గ్లోబల్ మార్కెట్ విషయానికొస్తే.. ఔన్సు గోల్డ్ 18.80 డాలర్లు పెరిగి 2,560.10 డాలర్లను చేరింది. సిల్వర్ 30.19 డాలర్లుగా ఉన్నది. 'అమెరికా ఫెడ్ రిజర్వ్ పాలసీ, అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ఇతరత్రా పరిణామాలు.. బంగారం ధరల్ని నిర్దేశిస్తున్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో స్థిరంగా ఔన్సు ధర 2,500 డాలర్లపైనే పలుకుతున్నది' అని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

**ఫ్యూచర్ మార్కెట్‌లో..**

ఫ్యూచర్ మార్కెట్‌లో పుత్తడి ధరలు క్షీణించాయి. అంతర్జాతీయ పరిణామాలు రేట్లను ప్రభావితం చేస్తున్నట్టు విశ్లేషకులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే అక్టోబర్ డెలివరీకిగాను మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్‌పై గోల్డ్ కాంట్రాక్ట్స్ రూ.71,583 పలికింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్ ఉద్రిక్తతల మధ్య అమెరికా, ఆసియా, ఐరోపా ఈక్విటీ మార్కెట్ల కదలికలు.. మదుపరులను ప్రభావితం చేస్తున్నాయంటున్నారు.

## 444 రోజుల ఎఫ్‌డీపై 7.85 శాతం వడ్డీ

**ఐడీబీఐ బ్యాంక్ ప్రత్యేక డిపాజిట్ స్కీం**

నూఢిల్లీ, ఆగస్టు 20: డిపాజిట్లను ఆకట్టుకోవడమే లక్ష్యంగా ఐడీబీఐ బ్యాంక్ మరో ప్రత్యేక డిపాజిట్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. 444 రోజుల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై 7.85 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతోపాటు 375 రోజుల కాలపరిమితి కలిగిన ఎఫ్‌డీలపై 7.75 శాతం వడ్డీని చెల్లించనున్నట్లు తెలిపింది. ఉత్సవ్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పేరుతో ప్రవేశపెట్టిన ఈ డిపాజిట్ స్కీం సెప్టెంబర్ 30 వరకు అమలులో ఉండనున్నదని బ్యాంక్ పేర్కొంది. ఈ స్కీం బ్యాంక్ వెబ్‌సైట్ లేదా మొబైల్ బ్యాంకింగ్ అప్లికేషన్ లేదా బ్యాంక్‌నకు సంబంధించి ఏదైనా బ్రాంచ్‌లో ప్రారంభించుకోవచ్చునని సూచించింది.



# ఆరేండ్లలో పూర్తిగా సిద్ధం

**అమర రాజా బ్యాటరీ ప్లాంట్‌పై మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ జిల్లాలోని దివిటిపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న అమర రాజా లిథియం అయాన్ బ్యాటరీ ప్లాంట్.. పూర్తిస్థాయి ఉత్పత్తిని అందుకోవడానికి ఆరేండ్లు పడుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. రూ.9,500 కోట్ల పెట్టుబడితో మొదలైన ఈ కర్మాగారం.. మొదటి దశ ఇప్పటికే పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రారంభించిందన్నారు. 2, 3 దశల నిర్మాణం వేగంగా సాగుతున్నదని చెప్పారు. ఈ క్రమంలోనే 2030 నాటికి ప్లాంట్.. పూర్తిస్థాయి ఉత్పత్తిని ప్రారంభిస్తుందని పేర్కొన్నారు. కాగా, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఈ ప్లాంట్ ఏర్పాటుకు ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌కు 80 కిలోమీటర్ల దూరంలో దివిటిపల్లి వద్ద దీనికి 262 ఎకరాల భూములను అప్పుడే కేటాయించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మంత్రి శ్రీధర్ బాబు ప్లాంట్ నిర్మాణ పురోగతిపై సచివాలయంలో అమర రాజా చైర్మన్ జయదేవ్ గల్లాతోపాటు ఆ సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. ఈ పరిశ్రమలో ప్రస్తుతం 350 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు.

# 'ఫైబర్ గ్రిడ్'కు సహకరిస్తాం

**కార్పొరేషన్ అధికారులతో కేంద్ర మంత్రి**

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : మారుమూల ప్రాంతాలకు సైతం ఇంటర్నెట్ సేవలను విస్తరించేందుకు ఉద్దేశించిన తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చినట్టు అధికారవర్గాలు తెలిపాయి. మంగళవారం ఢిల్లీలో ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు కేంద్రమంత్రితో భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు. నెట్‌వర్క్ ఇంటిగ్రేషన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఖమ్మం, నిజామాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలను టీ ఫైబర్‌కు అప్పగించాలని అధికారులు కోరగా దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. భారత్ నెట్ ఉద్యమి పథకాన్ని టీ ఫైబర్‌కు విస్తరించాలని అధికారులు కోరారు. దీనివల్ల రాష్ట్రంలో ఇంటర్నెట్ సేవలు మరింత మెరుగవుతాయని చెప్పారు.

### ఫ్లట్టర్ జీసీసీ సెంటర్

హైదరాబాద్, ఆగస్టు 20: అమెరికాకు చెందిన ఫ్లట్టర్ ఎంటర్‌టైన్‌మెంట్..హైదరాబాద్‌లో నూతన జీసీసీ ప్రారంభించింది. రూ.30 కోట్ల పెట్టుబడితో 80 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ కోసం ప్రస్తుతం 700 మంది సిబ్బందిని నియమించుకున్నట్లు, ఈ ఏడాది చివరినాటికి ఈ సంఖ్యను 900కి పెంచుకోనున్నట్లు కంపెనీ సీవోవో ఫిల్ బిషప్ తెలిపారు. అలాగే వచ్చే రెండేండ్లలో మొత్తం సిబ్బందిలో 40 శాతం మంది మహిళ ఉద్యోగులను నియమించుకోనున్నట్లు ఆయన ప్రకటించారు.

### ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ రికార్డు

ముంబై, ఆగస్టు 20: ప్రముఖ బీమా సంస్థ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మరో మైలురాయికి చేరుకున్నది. జూలైతో ముగిసేనాటికి కంపెనీ అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్(ఏయూఎం) విలువ రూ.3 లక్షల కోట్లు దాటి రూ.3.14 లక్షల కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. క్లెయిం సెటిల్‌మెంట్ రేషియో 99.17 శాతంగా ఉన్నదని, కేవలం 1.27 రోజులోనే తమ పాలసీ సెటిల్‌మెంట్ చేస్తున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో అనూప్ బాగ్చి తెలిపారు.



*మంగళవారం హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన క్రెడాయ్ స్టేట్‌కాన్ 2024 సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు*

# రియల్టీలో మరో బూమ్

**క్రెడాయ్ సమావేశంలో మంత్రి ఉత్తమ్**


మాదాపూర్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరో బూమ్ రాబోతున్నదని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జోస్యం చెప్పారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో 'తెలంగాణ గోయింగ్ గ్లోబల్' థీమ్‌తో మంగళవారం క్రెడాయ్ స్టేట్‌కాన్ 2024 సమావేశం జరిగింది. దీనికి మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలతోపాటు భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్ రెడ్డి, చైర్మన్ మురళీకృష్ణా రెడ్డి, ప్రెసిడెంట్-ఎలెక్ట్ కే ఇంద్రసేనా రెడ్డి, ఐజీబీసీ జాతీయ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. నిర్మాణ రంగంలో జరుగుతున్న అభివృద్ధికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు రూ.10 వేల కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. తెలంగాణను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. భవన, నిర్మాణ రంగాభివృద్ధికి సహకరిస్తామన్న ఆయన.. రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా రూపాంతరం చెందుతున్నదని వివరించారు.

**నిజంగా గొప్పే..**

దేశంలో 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ.. ఇంత త్వరితగతిన పురోగతి సాధించడం గొప్ప విషయమంటూ ఈ సందర్భంగా గత పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలనను పరోక్షంగా మంత్రి ఉత్తమ్ అభినందించడం గమనార్హం. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రపంచ స్థాయికి ఎదగడానికి ఎంతో సమయం పట్టదని ఆయన చెప్పారు. తెలంగాణ వృద్ధిరేటుకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపున్నదని గుర్తుచేశారు. కాగా, రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని విశ్లేషిస్తూ సీబీఆర్ఈ ఈ సందర్భంగా ఓ రిసెర్చ్ రిపోర్టును విడుదల చేసింది.

**కొండ చరియలు పడి**

# పవర్ స్టేషన్ ధ్వంసం



గువాహటి, ఆగస్టు 20: కొండ చరియలు విరిగి పడటంతో సిక్కింలోని ఎన్‌హెచ్‌పీసీ తీస్తా అయిదో దశ ఆనకట్ట పవర్ స్టేషన్ ధ్వంసమైంది. గత కొన్ని వారాలుగా తరచూ తక్కువ స్థాయిలో కొండ చరియలు విరిగిపడటంతో ఈ 510 మెగావాట్ల స్టేషన్‌కు ప్రమాదం పొంచి ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం ఈ స్టేషన్‌ను ఖాళీ చేయించడంతో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. గతేడాది అక్టోబర్‌లో భారీ వర్షం కారణంగా ల్హోనాక్ హిమానీ నదపు సరస్సు కట్టలు తెగిపోవడంతో అయిదో దశ ఆనకట్ట పనికి రాకుండా పోయింది.

# నేడు భారత్ బంద్

- **రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి పిలుపు**
- **ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీం తీర్పుపై నిరసన**
- **దళిత, ఆదివాసీ సంఘాల మద్దతు**



న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం భారత్ బంద్ నిర్వహిస్తున్నట్టు రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి ప్రకటించింది. ఈ బంద్‌కు రాజస్థాన్‌లోని ఎస్సీ, ఎస్టీ సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఆయా రాష్ర్టాల్లోని పరిస్థితులకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీలలో కులాలను ఉప కులాలుగా విభజించి రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ర్టాలకు దఖలు పరుస్తూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన సంగతి తెలిసిందే. అయితే సుప్రీంకోర్టు తీర్పు అన్యాయంగా ఉన్నదని, దీని గురించి దేశ ప్రజలకు వెల్లడించేందుకు బుధవారం భారత్ బంద్ నిర్వహిస్తున్నట్టు సమితి ప్రకటించింది. పలు సామాజిక, రాజకీయ సంఘాలు, పార్టీలు ఈ బంద్‌కు మద్దతు ఇస్తాయని భావిస్తున్నారు. భారత్ బంద్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టినట్టు రాజస్థాన్ అధికారులు తెలిపారు.

**దళిత, ఆదివాసీ సంఘాల మద్దతు**

అట్టడుగు వర్గాలకు బలమైన రిజర్వేషన్, ప్రాతినిధ్యం కోరుతూ దళిత, ఆదివాసీ సంస్థలు కూడా భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ దళిత్ అండ్ ఆదివాసీ ఆర్గనైజేషన్ (ఎన్‌ఏసీడీఏఓఆర్) తమ డిమాండ్ల లిస్టును విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు సమానత్వం, న్యాయం కల్పించాలని కోరింది. రిజర్వేషన్లపై ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ఎస్సీ, ఎస్టీలకు సంక్రమించిన రాజ్యాంగ హక్కులకు భంగం కలిగిస్తుందని పేర్కొంది. దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు బుధవారం శాంతియుతంగా భారత్ బంద్‌లో పాల్గొని తమ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చింది.



### యూజర్‌నేమ్‌తో వాట్సాప్‌లో మెసేజ్‌లు!

**మొబైల్ నంబర్ అవసరం లేదిక..**

న్యూఢిల్లీ: యూజర్ల అనుభవాన్ని మరింత మెరుగుపరిచేందుకు ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ తీసుకొస్తున్న ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఈసారి మరో కొత్త అప్‌డేట్‌తో వచ్చేస్తున్నది. ఇకపై ఫోన్ నంబర్‌తో పనిలేకుండా యూజర్‌నేమ్‌తోనే మెసేజ్‌లు పంపేలా సరికొత్త ఫీచర్‌ను జోడించబోతున్నది. కొత్త వ్యక్తికి మన నంబర్ ఇచ్చేందుకు సంకోచించే వారికి ఇది చక్కగా ఉపయోగపడుతుంది. అయితే, యూజర్ నేమ్ చెప్పే సమయంలో మన నాలుగు అంకెల పిన్ నంబర్‌ను కూడా చెప్పాల్సి ఉంటుంది. దీనిని మనమే క్రియేట్ చేసుకోవచ్చు. మనమిచ్చే యూజర్ నేమ్‌తోపాటు ఆ పిన్ నంబర్‌ను ఎంటర్ చేస్తేనే అవతలి వ్యక్తి మనకు మెసేజ్ చేయడం వీలవుతుంది. అయితే, ఇప్పటికే మీ కాంటాక్ట్స్‌లో ఉన్న వారికి మాత్రం ఇదేమీ వర్తించదు. వారు యథావిధిగానే చాటింగ్, మెసేజ్‌లు కొనసాగించవచ్చు. యూజర్ల ప్రైవసీకి మరింత రక్షణ కల్పించడంలో భాగంగానే వాట్సాప్ ఈ నిర్ణయం తీసుకుంది.

## ఆప్ ఎంపీ సంజయ్‌ను అరెస్టు చేయండి!

**యూపీ కోర్టు ఆదేశాలు**

సుల్తాన్‌పూర్: రెండు దశాబ్దాల నాటి ఓ కేసులో విచారణకు హాజరుకాకపోవడంపై ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌పై యూపీలోని సుల్తాన్‌పూర్ కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన్ను అరెస్టు చేసి, ఈ నెల 28న తమ ముందు హాజరుపర్చాలని పోలీసులను ఆదేశించింది. మంగళవారం కోర్టుకు రావాలని ఆదేశిస్తూ సంజయ్ సింగ్‌తోపాటు ఎస్పీ నేత అనూప్ సందాపై కోర్టు ఈ నెల 13న నాన్ బెయిలబుల్ వారెంట్ జారీచేసింది. అయితే నిందితులు కోర్టుకు హాజరు కాలేదు. విద్యుత్తు సరఫరా సమస్యపై మాజీ ఎమ్మెల్యే అనూప్ సందా నేతృత్వంలో రోడ్డును దిగ్బంధించి నిర్వహించిన ఆందోళనకు సంబంధించి 2001, జూన్‌లో ఓ కేసు నమోదైంది. ఇందులో సంజయ్ సింగ్ పాల్గొన్నారు.

# వినేశ్ X బబితా

**హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఫోగాట్ సిస్టర్స్‌పోటీ?**




న్యూఢిల్లీ: ఇటీవలి ప్యారిస్ ఒలింపిక్స్‌లో స్వల్పంగా బరువు ఎక్కువ ఉండటంతో రెజ్లింగ్‌లో పతకాన్ని చేజార్చుకున్న వినేశ్ ఫోగాట్ రాజకీయ ప్రవేశంపై ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. వచ్చే నెలలో హర్యానాలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె తన కజిన్, కామన్‌వెల్త్ గేమ్స్‌లో రెజ్లింగ్ పతకధారి అయిన బబితా ఫోగాట్‌పై పోటీ చేయవచ్చని ఆమె సన్నిహిత వర్గాలు తెలిపాయి. అయితే తాను క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్టు వినేశ్ ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా, స్వరాష్ట్రమైన హర్యానా నుంచి ఆమెను పోటీకి దింపాలని కొన్ని పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. వినేశ్‌ను ఎంపీ దీపీందర్ హుడా కాంగ్రెస్‌లోకి ఆహ్వానించినట్టు ప్రచారం జరుగుతున్నది. దీంతో తన పెద్దనాన్న కుమార్తె అయిన బబితా ఫోగాట్‌పై ఈసారి ఆమె ఎన్నికల్లో పోటీకి దిగుతారని ప్రచారం జరుగుతున్నది. కాగా, బబితా ఫోగాట్ బీజేపీలో చేరి ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో దాద్రి నుంచి పోటీ చేసి ఓటమి చెందారు.

## చంద్రయాన్-4,5 డిజైన్‌లు పూర్తి

**ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి**

*న్యూఢిల్లీ, ఆగస్టు 20: చంద్రుడిపై ప్రయోగాలకు సంబంధించి తదుపరి చేపట్టబోయే చంద్రయాన్-4, 5 మిషన్ల రూపకల్పన పూర్తయిందని, ప్రభుత్వ అనుమతి తీసుకొనే ప్రక్రియలో ఉన్నామని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-4 ప్రయోగం ద్వారా చంద్రుడి ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసి అక్కడి రాళ్లు, మట్టిని తీసుకురావడం లక్ష్యమన్నారు. అదేవిధంగా రానున్న ఐదేండ్లలో 70 ఉపగ్రహాలను ప్రయోగించాలనే లక్ష్యంతో ఇస్రో ప్రణాళికలు వేస్తున్నదని తెలిపారు. 2028లో చంద్రయాన్-4 చేపట్టే లక్ష్యంతో ఉన్నామని అంతకుముందు ఇస్రో అధికారులు పేర్కొన్నారు.*

# ట్రైన్ ఫోర్స్ వన్!

- **రైలు మార్గంలో ఉక్రెయిన్‌కు మోదీ**
- **పోలాండ్ నుంచి 10 గంటల ప్రయాణం**



కీవ్, ఆగస్టు 20: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైలు మార్గాన ఉక్రెయిన్‌కు వెళ్లనున్నారు. పోలాండ్, ఉక్రెయిన్ పర్యటన కోసం మోదీ 22న బయలుదేరుతారు. పోలాండ్‌లో ఆయన పర్యటన ముగిసిన అనంతరం ఉక్రెయిన్ సరిహద్దు నుంచి 'ట్రైన్ ఫోర్స్ వన్'లో ఉక్రెయిన్ రాజధాని కీవ్ చేరుకోనున్నారు. ఇందుకోసం ఆయన 10 గంటల పాటు రైలు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కీవ్‌లో ఏడు గంటల పాటు మోదీ ఉండనున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమైన అనంతరం తిరిగి ఇదే రైలులో పోలాండ్ చేరుకొని అక్కడి నుంచి భారత్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. విలాసవంతమైన రైలుగా గుర్తింపు పొందిన ట్రైన్ ఫోర్స్ వన్‌లో మోదీ కంటే ముందు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్, జర్మన్ చాన్సిలర్ ఒలాఫ్ స్కూల్జ్ వంటి వారు ప్రయాణించారు.

**అధునాతన సదుపాయాలు**

రష్యాతో యుద్ధం కారణంగా ఉక్రెయిన్‌లో ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. నిత్యం బాంబు దాడులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి భద్రతను దృష్టిలో పెట్టుకొని ఉక్రెయిన్‌లో పర్యటించే దేశాధినేతలు అందరూ ఇదే రైలులో ప్రయాణిస్తున్నారు. ఈ రైలులో స్టార్ హోటల్ తరహా సదుపాయాలు ఉంటాయి. చెక్కతో చేసిన క్యాబిన్లు, పనులు చేసుకోవడానికి టేబుల్, సోఫా, సేదతీరడానికి మంచం, టీవీ వంటి అన్ని సదుపాయాలు ఉంటాయి.

## ఉత్తమ్ సింగ్, చిత్రకు లతా మంగేష్కర్ అవార్డు

ఇండోర్, ఆగస్టు 20: 2022, 2023కు సంబంధించి జాతీయ లతా మంగేష్కర్ అవార్డుకు వరుసగా ప్రముఖ సంగీతకారుడు ఉత్తమ్ సింగ్, గాయని కేఎస్ చిత్ర ఎంపికయ్యారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం మంగేష్కర్ జయంతి సెప్టెంబర్ 28 నాడున నిర్వహించే కార్యక్రమంలో వీరిద్దరికి అవార్డులను ప్రదానం చేయనున్నదని ఓ అధికారి మంగళవారం వెల్లడించారు. ప్రతి ఏడాది లతా మంగేష్కర్ జన్మదినాన మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక విభాగం ఈ అవార్డును అందిస్తున్నది. మొదటిసారిగా ఈ అవార్డు ప్రదానోత్సవం మంగేష్కర్ స్మారకంగా నిర్మించిన ఆడిటోరియంలో జరుగనున్నది.

# తీరని రుణం.. రైతుల రణం



• రోడ్డుపై బయ్యారం రైతుల బైఠాయింపు



రుణమాఫీ కాలేదంటూ మంగళవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారంలోని జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు, కాంగ్రెస్ నాయకులు

• నుస్రుల్లాబాద్‌లో రైతుల రాస్తారోకో



కామారెడ్డి జిల్లా నుస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని బోధన్-బాన్సువాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

• జనగామ కలెక్టరేట్ ఎదుట అన్నదాతల జంగ్



రూ.2 లక్షల రుణమాఫీ చేసి, కొత్త రుణాలను వెంటనే మంజూరు చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ జనగామ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, రైతులు

• ములుగు గ్రీవెన్స్ సెల్‌లో రైతుల రద్దీ



ములుగు జిల్లా కేంద్రంలోని రైతు గ్రీవెన్స్ సెల్ వద్ద జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అన్నదాతలు. అధికారుల సూచనల మేరకు వివిధ పత్రాలను జతచేస్తూ దరఖాస్తు ఫారాలను అందజేశారు.

• రుణమాఫీ కోసం రైతుగోస



ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్బీఐలోని ఫీల్డ్ ఆఫీసర్ కౌంటర్ వద్ద క్యూకట్టిన రుణాలు మాఫీ కాని రైతులు

• ఆదిలాబాద్ గిరిజన రైతుల ఆరాటం



రుణమాఫీ కోసం దరఖాస్తులు చేసేందుకు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రానికి నడిచి వెళ్తున్న గిరిజన రైతులు

• కల్వకుర్తిలో ఏడీఏకు రైతుల వినతి



కల్వకుర్తి ఏడీఏ కార్యాలయానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన రైతులు తమకు రుణమాఫీ ఎందుకు కాలేదంటూ నిలదీశారు. అనంతరం అధికారికి వినతిపత్రం అందజేశారు.

• ఇంట్లోనే ఆమరణ దీక్ష



జగిత్యాల జిల్లా రాఘవపేటలోని తన ఇంట్లోనే ఆమరణ దీక్షకు దిగిన రైతు సోమ శ్రీనివాస్

• ములుగు జిల్లా కేంద్రంలో..



ములుగులోని డీఏవో కార్యాలయానికి గేటు వేసి ఉండటంతో బయట నుంచి తన లోన్ మాఫీ గురించి వాకబు చేస్తున్న ఓ రైతు

## రుణమాఫీ కోసం బీఆర్‌ఎస్ రణం

- 22న మండల కేంద్రాల్లో ధర్నా
- పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు
- ఆంక్షల్లేకుండా మాఫీ చేయాలని డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని బీఆర్‌ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. అడ్డగోలు ఆంక్షలతో రుణమాఫీ కాక అయోమయంలో ఉన్న రాష్ట్ర రైతాంగానికి బాసటగా నిలిచేందుకు కార్యాచరణ ప్రకటించింది. ఈ మేరకు ఈ నెల 22న రాష్ట్రంలోని అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నా చేపట్టాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. రూ.2 లక్షల వరకు అందరికీ రుణమాఫీ అయ్యిందని ముఖ్యమంత్రి చెప్తుంటే, ఇంకా రుణమాఫీ పూర్తికాలేదని, కార్యక్రమం కొనసాగుతుందని మంత్రులు చెప్తున్న వైనాన్ని ఆయన ఎండగట్టారు. ఎవరికి తోచిన రీతిలో వారు మాట్లాడుతూ రైతులను ఆయోమయానికి, ఆవేదనకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీని అందరికీ వర్తింపజేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ స్పష్టంగా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ కోసం రూ.40 వేల కోట్లు అవసరమని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని, ఆ తర్వాత రూ.31 వేల కోట్లకే మంత్రివర్గ సమావేశం అనుమతిచ్చిందని చెప్పారని తెలిపారు. బడ్జెట్లో మాత్రం రూ.26 వేల కోట్లకు ఆమోదం తెలిపి రైతులను మోసం చేశారని విమర్శించారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ. 26 వేల కోట్లలో నుంచి కేవలం రూ.18 వేల కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం రైతులను నిలువునా ముంచిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో 40 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ లబ్ధి చేకూరలేదని క్షేత్రస్థాయి నుంచి తమకు సమాచారం ఉన్నదని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి కారణంగా లక్షలాది మంది రైతులు రోజూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అయ్యే వరకు బీఆర్‌ఎస్ వారికి అండగా ఉండి పోరాడుతుందని కేటీఆర్ తెలిపారు.



జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో రైతు ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## రైతుల ఉసురు తగులుతది

- మాఫీ చేసినమని సర్కారు సంబురాలు
- రుణం మాఫీ కాలేదని అన్నదాతల గగ్గోలు
- పుస్తెలతాళ్లు కుదువబెట్టి లోన్లు కడుతుండ్రు
- రైతుల ధర్నాలో మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల, ఆగస్టు 20: 'మాయమాటలతో గెలిచిన రేవంత్‌రెడ్డి రుణమాఫీ విషయంలో అంకెల గారడీ చేసి మాఫీ పూర్తయిందని సంబురాలు చేసుకుంటుండ్రు. తీరా సగం మందికి కూడా రుణమాఫీ కాక రైతులు గోస పడుతుండ్రు. రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుండ్రు. వ్యవసాయ పనులు వదిలి చేతుల్లో కాగితాలు పట్టుకుని బ్యాంకుల చుట్టూ తిరుగుతుండ్రు. ఎంత అప్పు ఉన్నా రూ.2 లక్షలే మాఫీ అయితది. మిగితావి కడితేనే మాఫీ వర్తిస్తుందని బ్యాంకు అధికారులు ఒత్తిడి చేస్తే పుస్తెల తాళ్లు అమ్మి రైతులు లోన్లు కడుతుండ్రు. బ్యాంకులు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. ఈ ప్రభుత్వానికి అన్నదాతల ఉసురు తగులుతది' అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో బ్యాంకు ఎదుట రైతులు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి పాల్గొని మాట్లాడారు. రుణమాఫీపై వాయిదాల మీద వాయిదాలు పెట్టడంతో రైతులంతా ఎదురుచూస్తున్నారని, బ్యాంకుల్లో అప్పులకు వడ్డీ తడిసి మోపెడవుతున్నదని చెప్పారు. రుణమాఫీ ఎగ్గొట్టాలని ఈ ప్రభుత్వం రైతులతో చెలగాట మాడుతున్నదని విమర్శించారు. రుణమాఫీ పూర్తి చేశామని రేవంత్‌రెడ్డి ఖమ్మంలో సంబురాలు చేసుకున్నారని, మాఫీ మరికొందరికి చేయాల్సి ఉందని మంత్రులు అంటున్నారని, ఇందులో ఎవరిని నమ్మాలో తెలియడం లేదని దుయ్యబట్టారు. రైతులందరికీ రుణమాఫీ అయ్యే వరకు ప్రభుత్వాన్ని విదలిపెట్టేది లేదని, రైతులంతా బీఆర్‌ఎస్‌తో కలిసి రావాలని స్పష్టంచేశారు.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి

## మాఫీలో పగటిదొంగ కాంగ్రెస్

- రుణం తీరిందని సీఎం డ్యాన్స్
- 17.13 లక్షల మందికి మాఫీ కాలే
- మంత్రి ఉత్తమ్ మాటలే నిదర్శనం
- రేవంత్ రాజీనామా చేయాలి
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పగటిదొంగలా దొరికిపోయిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. రైతుల ఆగ్రహానికి దిగొచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు ఇంకా 17.13 లక్షల మందికి రుణమాఫీ కాలేదని వెల్లడించినట్టు చెప్పారు. రుణమాఫీ మొత్తం అయిపోయిందని డ్యాన్స్ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడేం చెప్తారని నిలదీశారు. 'సీఎం చెప్పింది అబద్ధమని ఉత్తమ్ మాటలతో తేలిపోయింది.. ముక్కు నేలకు రాసి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తావా? చెంపలు వేసుకుంటావా?' అని నిలదీశారు. తెలంగాణభవన్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్ కుమార్, బీఆర్‌ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. రుణమాఫీలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని విమర్శించారు. బ్యాంకర్ల లెక్క ప్రకారం.. 50 లక్షల మందికిపైగా రైతుల రూ.2 లక్షల రుణాలు రూ.49 వేల కోట్ల వరకు ఉన్నాయని తెలిపారు. 'ఆగస్టు 15లోగా వివరాలు సరిగ్గా ఉన్న 22.37 లక్ష మంది రైతుల రుణాలు మాఫీ చేశాం. ఆధార్ నంబర్లలో తేడాలు ఉన్న 1.20 లక్షలు, బ్యాంకు, ఆధార్‌కార్డుల్లో పేర్లలో తేడాలున్న 1.6 లక్షలు, బ్యాంకులు ఇచ్చిన వివరాల్లో తప్పులు ఉన్న 1.5 లక్షలు, రేషన్‌కార్డులేనివారు 4.83 లక్షల మంది రైతులతోపాటు రూ.2 లక్షలకు మించి రుణం పొందిన మరో 8 లక్షల మంది.. ఇలా మొత్తం 17.13 లక్షలు మంది రైతులను రుణమాఫీ జరుగలేదు' అని మంత్రి ఉత్తమ్ చెప్పినట్టు గుర్తుచేశారు. మరి ఇప్పుడు ముక్కు నేలకు రాయాల్సింది ఎవరని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సెక్రటేరియట్ వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహం తొలగించి, ప్రజల అభిప్రాయం మేరకు అక్కడ విగ్రహం పెడతామని చెప్పారు. సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలన్న తమ డిమాండ్‌పై సీఎం రేవంత్ జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

## 'డీఎస్సీ'పై సర్కారు ఆరా!

➤ మొదటిపేజీ తరువాయి...

తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలిసింది. అయితే పేపర్ లీక్ వార్తలపై పాఠశాల విద్యాశాఖ ఒక ప్రకటనలో వివరణ ఇచ్చింది. విద్యాశాఖ విడుదల చేసిన డీఎస్సీ ప్రాథమిక 'కీ'పై భారీగా అభ్యంతరాలు రావడం గమనార్హం. ప్రాథమిక 'కీ'ని సవాల్ చేస్తూ అనేక మంది అభ్యంతరాలను సమర్పించారు. దాదాపు 28,500 అభ్యంతరాలు వచ్చినట్టు విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి. జూలై 18 నుంచి ఆగస్టు 13 వరకు నిర్వహించిన డీఎస్సీ పరీక్షల ప్రాథమిక కీలను ఈ నెల 13న విద్యాశాఖ విడుదల చేసింది. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు ఈ నెల 20 వరకు గడువును ఇచ్చారు. ఈ గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఈ నెలాఖరులో ఫైనల్‌కీని విడుదల చేసే అవకాశం ఉన్నది.

### ర్యాంకులు, ఫలితాలను ప్రభావితం చేయదు: ఈవీ నర్సింహారెడ్డి

డీఎస్సీ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించామని, ఎక్కడా పేపర్ లీక్ అనే ప్రశ్నే ఉత్పన్నంకాదని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్జీటీ పరీక్షలో 160 ప్రశ్నలు ఉండగా ఒక్కో ప్రశ్నపత్రంలో 8 వేర్వేరు విభాగాలు ఉంటాయని, మొత్తం 7 సెషన్లకు 14 సెట్ల ప్రశ్నపత్రాలను తయారు చేశామని తెలిపారు. జూలై 19న మొదటి సెషన్ ప్రశ్నపత్రంలోని సోషల్ స్టడీస్ సబ్జెక్టుకు సంబంధించిన 18 ప్రశ్నలు.. 23న రెండో సెషన్‌లోనూ పునరావృతమయ్యాయని అంగీకరించారు. 19న ఆరు జిల్లాలు, 23న మరో 6 జిల్లాల వారికి పరీక్షలు నిర్వహించామని, ఒక సెషన్‌లో ఒక జిల్లా వారికి మాత్రమే పరీక్షలను నిర్వహించడం వల్ల, ఇది ఏ విధంగానూ అభ్యర్థుల ర్యాంకులను, ఫలితాలను ప్రభావితం చేయదని తెలిపారు. దీనిపై అభ్యర్థులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన కోరారు.

## ప్రైవేటు టీచర్లకు రక్షణ చట్టం రావాలి

- ప్రభుత్వ నియామకాల్లో 25% వెయిటేజీ ఇవ్వాలి
- సెప్టెంబర్ 5న ప్రైవేట్ టీచర్లనూ సత్కరించాలి
- ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



ఖైరతాబాద్, ఆగస్టు 20: ప్రైవేటు ఉపాధ్యాయులు, ఉద్యోగుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం రావాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కోరారు. అప్పుడే కోర్టుల్లో తమ హక్కుల కోసం పోరాడవచ్చని చెప్పారు. తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ అధ్యక్షతన 'విద్యాభివృద్ధి-ప్రైవేట్ ఉపాధ్యాయుల పాత్ర' అన్న అంశంపై మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. అనేక ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించడంలేదని, అలాంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ టీచర్ల ఆత్మగౌరవం దెబ్బతీసేలా ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దురహంకార పూరితమైన వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, దీనిపై పోరాటం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ నియామకాల్లో ప్రైవేట్ టీచర్లకు 25 శాతం వెయిటేజీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 5న ప్రభుత్వ ఉపాధ్యాయులకే కాదు, ప్రైవేట్ ఉపాధ్యాయులనూ సత్కరించాలని కోరారు.

### సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి: ఈటల

ప్రైవేట్ టీచర్లపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదని, సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ఆచీతూచి మాట్లాడాలని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ఏడాదిలో 12 నెలలు సరిగా వేతనాలు అందక ప్రైవేట్ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వానికి చేతనైతే వారికి 12 నెలలు వేతనాలు ఇప్పించాలని సూచించారు.

# తీరని రుణం.. రైతుల రణం



## అధికారులకు రుణమాఫీ సెగ

- రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ జిల్లాల రైతుల ఆగ్రహం
- రుణమాఫీ చేయాలని వినతులు
- అందరికీ మాఫీ చేస్తామంటూ సర్దిచెప్పిన అధికారులు
- 2 లక్షలకుపైగా ఉన్న రుణం చెల్లించేందుకు ప్రత్యేక షెడ్యూల్
- వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 20(నమస్తే తెలంగాణ): వ్యవసాయ శాఖ అధికారులకు రుణమాఫీ సెగ తగిలింది. మంగళవారం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో రుణమాఫీపై అధికారులను రైతులు నిలదీశారు. రుణమాఫీలో అనేక సమస్యలు ఉన్నాయని, అర్హత ఉన్నా తమకు రుణమాఫీ కాలేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఎనిమిది జిల్లాల రైతులు రుణమాఫీ సమస్యలను అధికారుల ముందు ఏకరువు పెట్టారు. ఖమ్మం, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, జనగామ, భద్రాద్రి కొత్తగూడెం, సంగారెడ్డి, కామారెడ్డి, వరంగల్ జిల్లాల నుంచి భారీగా ఫిర్యాదులు అందడం గమనార్హం. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి రైతులకు సర్దిచెప్పారు. రైతులు లేవనెత్తిన పలు ఫిర్యాదులపై స్పష్టతనిచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు మాట్లాడుతూ.. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ నిర్ధారణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన విధి విధానాలను జారీ చేస్తుందని తెలిపారు. కుటుంబ రుణం రూ.2 లక్షలకుపైగా ఉన్నవారికి సంబంధించి పై రుణం బ్యాంకుల్లో చెల్లించేందుకు ప్రత్యేక షెడ్యూల్‌ను ప్రకటిస్తామని తెలిపారు. ప్రతి మండలంలో రుణమాఫీ ఫిర్యాదుల స్వీకరణకు నోడల్ అధికారులను నియమించాలని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఫిర్యాదులు తీసుకోవాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు.

## ఉత్తమన్నా... ప్రెస్‌మీట్ పెట్టన్నా!

**రుణమాఫీ రగడపై సీఎం రేవంత్ వేడుకోలు**

- గొడవను సద్దుమణిగించేలా మంత్రులతో మీడియా సమావేశం పెట్టాలని నిర్ణయం
- ప్రెస్‌మీట్ పెట్టేందుకు తుమ్మల నిరాకరణ
- సీఎం విన్నపంతో సరేనన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 20(నమస్తే తెలంగాణ): రుణమాఫీపై జరుగుతున్న రగడను సద్దుమణిగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నానా తంటాలు పడుతున్నట్టు తెలిసింది. కనీసం మంత్రులతోనైనా మీడియా సమావేశం పెట్టించి డ్యామేజ్ కంట్రోల్ చేసేందుకు ప్రయత్నించినట్టు సమాచారం. ఇటీవల ఒక సందర్భంలో సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగినట్టు తెలిసింది. రుణమాఫీపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని, దీనిని నిలువరించేందుకు మంత్రులతో మీడియా సమావేశం ఏర్పాటుకు గురించి చర్చించినట్టు సమాచారం. సీఎంతోపాటు మంత్రి శ్రీధర్‌బాబు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మీడియా సమావేశం నిర్వహించాలని కోరగా మంత్రి నిరాకరించినట్టు సమాచారం. ఇప్పటికే మీడియా సమావేశం నిర్వహించానని, మళ్లీ సమావేశం పెట్టాల్సిన అవసరం లేదని తోసిపుచ్చినట్టు తెలిసింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి అక్కడే ఉన్నత ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఉద్దేశించి.. 'ఉత్తమన్నా.. మీరన్నా ప్రెస్‌మీట్ పెట్టండి' అని కోరినట్టు తెలిసింది. ఇందుకు అంగీకరించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మరో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీ పూర్తికాలేదని, ఇంకా 9.14 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉన్నదని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

# రుణమాఫీ ఫిర్యాదులు 'లక్ష'!

- మంత్రి చెప్పిన లెక్కే 80 వేలు
- 'లెక్క'లోకి రాని ఫిర్యాదులు మరెన్నో
- 8 వేలు మాత్రమే పరిష్కారం
- 22 వేల మంది రైతుల ఖాతాల్లోంచి రుణమాఫీ రివర్స్
- ఫిర్యాదులపై పట్టించుకోని వ్యవసాయ శాఖ డైరెక్టరేట్
- క్షేత్రస్థాయిలో అధికారులపైనే పరిష్కార భారం



హైదరాబాద్, ఆగస్టు 20(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రైతు రుణమాఫీ సమస్యల సుడిగుండాన్ని తలపిస్తున్నది. అర్హతలున్నప్పటికీ తమకు రుణమాఫీ కాలేదంటూ రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు రోజుల క్రితం వరకు 80 వేల ఫిర్యాదులు అందినట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఇప్పుడు వీటి సంఖ్య లక్షణంగా లక్షకు చేరినట్టు తెలిసింది. ఇవి అధికారికంగా ఇచ్చిన ఫిర్యాదులు మాత్రమే. క్షేత్రస్థాయిలో ఏఈవోలకు, ఇతర అధికారులకు రైతులు పెట్టుకొన్న ఫిర్యాదుల సంఖ్య ఇందుకు రెట్టింపు ఉంటుందని అధికారులే చెప్తున్నారు. ఇవన్నీ అధికారిక 'లెక్క'లోకి రావడం లేదు. రుణమాఫీ ప్రారంభమైంది మొదలు.. రైతులు ఏఈవోలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. తమకు రుణమాఫీ కాలేదని, సమస్య పరిష్కరించాలంటూ ప్రతి అధికారికీ మొర పెట్టుకుంటున్నా.. రైతుల మొర అరణ్య రోదనే అవుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వీకరించిన, పరిష్కరించిన ఫిర్యాదుల సంఖ్య ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నది.

### ఫిర్యాదులు లక్ష.. పరిష్కారం 8 వేలు

వివిధ బ్యాంకుల్లో నెలకొన్న సాంకేతిక సమస్యల కారణంగా 80 వేల ఖాతాలకు సంబంధించిన వివరాలను తెప్పించుకున్నట్టు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఇందులో ఆధార్ నంబర్ ఇవ్వకపోవడం, సరిగ్గా లేకపోవడం, రుణాల మంజూరు తేదీలో తప్పులు ఇలా అనేక కారణాలు ఉన్నాయని వివరించారు. 80 వేల ఖాతాలకు సంబంధించిన సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. మొదటి రెండు విడతల్లో తప్పులు దొర్లిన 7,925 ఖాతాల సమస్యలను మాత్రమే పరిష్కరించినట్టు మంత్రి తెలపడం గమనార్హం. ఆయా ఖాతాలకు రూ.44.95 కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. అధికారికంగా 80 వేల ఖాతాల్లో సమస్యలు ఉంటే, ప్రభుత్వం పరిష్కరించింది 8 వేలు మాత్రమే. నెల రోజుల్లో 8 వేల ఖాతాల సమస్యలను మాత్రమే పరిష్కరించగా మిగిలిన 72 వేల ఖాతాల సమస్యలను పరిష్కరించేందుకు ఎన్ని నెలల సమయం తీసుకుంటారోననే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. 22 వేల ఖాతాల్లో జమైన రుణమాఫీ డబ్బు రివర్స్ వచ్చినట్టు తెలిపారు. రైతుల ఖాతాల్లో జమైన పైసలు.. తిరిగి ప్రభుత్వ ఖాతాల్లోకి వెళ్లడం గమనార్హం.

### ఫిర్యాదులకు పరిష్కారమెక్కడ?

రుణమాఫీ కాని వారు అధికారులకు ఫిర్యాదు చేయాలని, పరిష్కరిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. కానీ, వాటికి పరిష్కారం ఎప్పుడు, ఎక్కడ అనే ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. రుణమాఫీ ఫిర్యాదులకు సంబంధించి వ్యవసాయ శాఖ డైరెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని ఉన్నతాధికారి ఒకరు స్పష్టంచేశారు. మొత్తం క్షేత్రస్థాయిలోనే పరిష్కరిస్తున్నారని తెలిపారు. దీంతో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల జోక్యం లేకుండా సమస్యల పరిష్కారం జరుగుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ రైతుల ఫిర్యాదులను పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదుల భారాన్ని మొత్తం క్షేత్రస్థాయి అధికారులకు అప్పగిస్తే.. సమస్యల పరిష్కారం ఏ మేరకు అవుతుందనే సందేహం వ్యక్తమవుతున్నది. ఫిర్యాదు చేసిన రైతులు తమ సమస్య పరిష్కారమైందా? అంటూ క్షేత్రస్థాయి అధికారులను ఆరా తీస్తున్నారు. ఎక్కడి సమస్య అక్కడే ఉన్నదంటూ అధికారులు చెప్తున్న సమాధానంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమ ఫిర్యాదును పరిష్కరిస్తారా? లేదా? తమకు రుణమాఫీ అవుతుందా? లేదా? అంటూ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.


## రుణమాఫీపై ప్రతిపక్షాలది అనవసర రాద్ధాంతం

**రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం**



భీమదేవరపల్లి, ఆగస్టు 20: రుణమాఫీపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 69 లక్షల మంది రైతుల్లో 70 శాతం వరకు రుణాలు తీసుకున్న వాళ్లే ఉంటారని తెలిపారు. రుణాలు తీసుకోని వాళ్లకు కూడా రుణమాఫీ కాలేదని ప్రతిపక్షాలు పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. రుణమాఫీపై బండి సంజయ్, కేటీఆర్, హరీశ్‌రావు కూడబలుక్కుని మాట్లాడుతున్నారని చెప్పారు. కేంద్రం నుంచి రైతులకు ఏం జేసింద్రో బీజేపీ నేతలు చెప్పాలని, జవాబు చెప్పనంకనే తమను అడగాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ ఎన్ని దఫాల్లో చేసిందో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. రూ.లక్ష, లక్షన్నర వరకు రుణమాఫీ చేశామని, రెండు లక్షలకుపైగా ఉన్నవాళ్లకు కూడా మాఫీ చేసేందుకు యోచిస్తున్నామని తెలిపారు. అర్హత ఉండి రుణమాఫీ పొందని రైతుల కోసం గ్రీవెన్స్ ఏర్పాటు చేశామని, రుణమాఫీ రాని రైతులు రైతు వేదికల్లో వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు.

**లోకం పోకడ**







'నమస్తే కథనం'పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్‌లో చేసిన ట్యాగ్

## ముక్రా(కే)కు రుణమాఫీ చేయాలి

**'నమస్తే' కథనాన్ని ప్రభుత్వానికి ట్యాగ్ చేసిన హరీశ్‌రావు**

ఆదిలాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): రూ.2 లక్షల రుణమాఫీ రైతులకు అందకపోవడంపై మంగళవారం 'నమస్తే తెలంగాణ' ఆదిలాబాద్ జిల్లా సంచికలో వచ్చిన కథనానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్‌లో స్పందించారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే)లో 22 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తించడంపై 'నమస్తే'లో కథనం ప్రచురితమైంది. బీఆర్ఎస్ పాలనలో ఆదర్శంగా నిలిచిన ముక్రా(కే).. కాంగ్రెస్ ప్రభుత్వంలో అధ్వానంగా మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరిచి రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని సీఎంవోతోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ట్యాగ్ చేశారు.

### అణిచివేత దుర్మార్గం: శశిధర్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో రుణమాఫీ కాలేదని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని బీఆర్ఎస్ నేత, మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు.

### మాఫీ పూర్తి కాకుంటే పోరాటమే: కూనంనేని

హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 20: రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుంటే పోరాటం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ రుణమాఫీ విషయంలో రైతాంగానికి పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదని, వెంటనే చొరవ తీసుకొని అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణ మాఫీ చేయాలని సూచించారు.

### గ్రీన్ ఫీల్డ్ హైవే సమావేశంలో ఉద్రిక్తత

**పురుగుల మందు డబ్బాతో వచ్చిన రైతు**

గీసుగొండ, ఆగస్టు 20: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంపై మంగళవారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కోనాయిమాకులలో రైతులతో నిర్వహించిన సమావేశం ఉద్రిక్తతకు దారితీసింది. గీసుగొండ, ఊకల్, మచ్చాపురం, సంగెం మండలంలోని చింతలపల్లి, తీగరాజుపల్లి రైతులు భూములు ఇచ్చేందుకు నిరాకరించడంతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి.. రైతులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతు చల్లా రవి పురుగుల మందు డబ్బాతో వచ్చి గ్రీన్‌ఫీల్డ్ హైవేను ఆపాలని డిమాండ్ చేశారు. తనకు రెండెకరాల భూమే దిక్కని, అదిపోతే చావే శరణ్యమని కన్నీటి పర్యంతమయ్యాడు. సీఐ వెంటనే తేరుకుని మందు డబ్బాను లాక్కున్నాడు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం ఆగదని, అలైన్‌మెంట్ మార్చడం కుదరదని తెగిసి చెప్పారు. ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

**గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతు మృతి**

శాయంపేట, ఆగస్టు 20 : హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్లకానిపర్తికి చెందిన దాసరి వెంకటేశం (60)కు గట్ల కనపర్తి శివారులో 20 గుంటల భూమి ఉంది. గ్రీన్ ఫీల్డ్ హైవేలో భాగంగా భూసేకరణలో భూమి పోతుందని తెలియడంతో తీవ్ర మనోవేదనతో అనారోగ్యానికి గురై దవాఖానలో చేరాడు. మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈయనకు భార్య విజయ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## రుణమాఫీపై కాంగ్రెస్ బేవార్స్ డ్రామా

- పిడికెడు మందికే మాఫీ.. లక్షల మంది రైతులకు కాలే
- రుణమాఫీపై ప్రభుత్వం అబద్ధపు ప్రచారం : ఎమ్మెల్సీ దేశపతి
- బీఆర్ఎస్‌కు రాజీనామాలు కొత్త కాదు : దేవీప్రసాద్
- మైనంపల్లికి, సిద్దిపేటకు ఏం సంబంధం: ఎర్రోళ్ల శ్రీనివాస్
- మోసపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ : పద్మా దేవేందర్‌రెడ్డి
- సంపూర్ణ రుణమాఫీ కోసం సిద్దిపేటలో కార్యాచరణ సమావేశం



సిద్దిపేటలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంపూర్ణ రుణమాఫీ కార్యాచరణ సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేటలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

సిద్దిపేట ప్రతినిధి/ సిద్దిపేట, ఆగస్టు 20(నమస్తే తెలంగాణ) : రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన డ్రామా బేవార్స్ అని, పిడికెడు మందికే రుణమాఫీ అయిందని, లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ చెప్పారు. రైతులకు సంపూర్ణ రుణమాఫీ సాధన కోసం సిద్దిపేట లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కార్యాచరణ సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి దేశపతి మాట్లాడారు. రుణమాఫీ అయిపోయిందని ముఖ్యమంత్రి చెబుతుంటే.. ఇంకా పూరి కాలేదని మంత్రులు ఉత్తమ్, పొంగులేటి చెబుతున్నారని, ఎమ్మెల్సీ కోదండరాం కూడా పాక్షికంగానే రుణమాఫీ జరిగిందని చెబుతున్నారని తెలిపారు. దేవుళ్ల మీద ఒట్టుపెట్టి రుణమాఫీ చేస్తానన్న రేవంత్‌రెడ్డి, నోరు ప్రక్షాళన చేసుకోవాలని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, సంపూర్ణ రుణమాఫీ చేస్తేనే రాజీనామా చేస్తానని హరీశ్‌రావు సవాల్ విసిరితే పారిపోయి నేడు పాక్షికంగా రుణమాఫీ చేసి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు.

### ప్రభుత్వాన్ని నిలదీస్తాం : దేవీప్రసాద్

హరీశ్‌ను రాజీనామా చేయాలనే నైతిక హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని దేవీప్రసాద్ అన్నారు. పదవులకు రాజీనామాలు చేసుడు బీఆర్ఎస్‌కు కొత్తకాదని స్పష్టంచేశారు. ప్రభుత్వం హామీలు అమలు చేసేలా ప్రధాన ప్రతిపక్షంగా నిలదీస్తామని చెప్పారు. హామీలు అమలు చేయాలని కోరితే ఎదురు దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. మైనంపల్లి సిద్దిపేట పర్యటన గురించి మాట్లాడడం ఇష్టం లేదని చెప్పారు.

### మైనంపల్లికి సిద్దిపేటలో ఆధార్‌కార్డున్నదా? : ఎర్రోళ్ల శ్రీనివాస్

మైనంపల్లిని ప్రజలు రాజకీయాల నుంచి ఎప్పుడో తిరస్కరించారని, మెదక్‌లో పద్మాదేవేందర్‌రెడ్డి చేతిలో, మల్కాజిగిరిలో ఓడిపోయిన చరిత్ర ఆయనదని మైనంపల్లికి, సిద్దిపేటకు ఏం సంబంధమని ఎర్రోళ్ల శ్రీనివాస్ నిలదీశారు. హరీశ్‌ను రాజీనామా చేయాలని మైనంపల్లి అడగడం సిగ్గు చేటని, మైనంపల్లికి సిద్దిపేటలో ఆధార్ కార్డు ఉన్నదా అని ప్రశ్నించారు. 'నీకు దమ్ము, ధైర్యం ఉంటే నీ కొడుకు రోహిత్‌ను మెదక్‌లో రాజీనామా చేయించి.. మళ్లీ గెలిపించు' అని సవాల్ చేశారు. దేశ మొదటి ప్రధాని నెహ్రూ ఫొటోలు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నట్టే తెలంగాణను తెచ్చిన మహనీయుడు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటోలు ఉండడం కూడా అంతే అవసరమని చెప్పారు.

### అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ : మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి

మోసపూరిత వాగ్దానాలు, అబద్ధపు ప్రచారాలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని, ఎనిమిది నెలల్లో ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శించారు. హరీశ్‌రావు ఒత్తిడి వల్లే ప్రభుత్వ ఈ మాత్రం రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. మహిళలకు రూ.2500 మహాలక్ష్మి స్కీమ్ ఇస్తామని చెప్పి ఆ ఊసే ఎత్తడం లేదని జిల్లాలకు రూపాయి నిధులు కూడా ఇవ్వలేదని, కనీసం పారిశుద్ధ్యం కోసం సమీక్షలు చేసిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు.

### సిద్దిపేటలో రోజంతా టెన్షన్

సిద్దిపేటలో మంగళవారం రోజంతా టెన్షన్ వాతావరణం నెలకొన్నది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ సమావేశాలు, ర్యాలీలతో పట్టణంలో పొలిటికల్ హీట్ పుట్టింది. రుణమాఫీ విషయంలో రాజీనామలపై పోటాపోటీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, రాజీనామాల డిమాండ్‌ల నేపథ్యంలో మూడు రోజుల కిందట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ దాడి చేసిన విషయం తెలిసిందే. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ సంపూర్ణ రుణమాఫీ కోసం కార్యకర్తలతో సమావేశం నిర్వహించింది. అటు కాంగ్రెస్ నాయకులు రుణమాఫీ అభినందన ర్యాలీతో పాటు రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాలను మైనంపలి హన్మంతరావు నేతృత్వంలో ఏర్పాటు చేసుకున్నారు. రెండు సమావేశాలు ఒకే రోజు ఉండడంతో ఏం జరుగుతుందోనని పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.



గుడిపేట రైతు వేదికలో అధికారులతో మాట్లాడుతున్న రైతులు

## ముల్కల్లలో ముప్పైశాతమే మాఫీ

- రైతులను నిండాముంచిన కాంగ్రెస్ సర్కార్
- బ్యాంకులు, రైతు వేదికల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- మంచిర్యాల నియోజకవర్గంలో రుణమాఫీ కష్టాలు

*మంచిర్యాల, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్ ఆచరణలో చేతులెత్తేసింది. 30శాతం మందికే రుణమాఫీ చేసి మిగిలిన వారికి టోపీ పెట్టింది. మాఫీ కోసం ఆశగా చూసిన రైతాంగానికి బ్యాంకుల్లో చీత్కారాలే ఎదురయ్యాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నియోజకవర్గంలోని గ్రామాలను 'నమస్తే తెలంగాణ' బృందం మంగళవారం సందర్శించింది. మంచిర్యాల నియోజకవర్గంలోని ముల్కల్లలో(ముల్కల్ల+పోచంపాడు శివారు కలుపుకొని) 1040 మంది రైతులు ఉన్నారు. తొలి విడుతలో 165 మందికి, రెండో విడుతలో 60 మందికి మాఫీ అయ్యింది. మూడో విడుతలో ఎంత మందికి అయ్యిందో ఎవరికీ తెలియదు. మూడు విడుతల్లో కలిపి 300 మందికి కూడా రుణమాఫీ కాలేదని స్పష్టం చేసింద్రు. ఈ లెక్కన గ్రామంలో 30 శాతం మందికే రుణమాఫీ అయ్యింది. చాలా మంది రైతులు ముల్కల్ల గ్రామీణ బ్యాంక్ దగ్గర, రైతు వేదిక దగ్గర కనిపించింద్రు. బ్యాంకు దగ్గరున్న రైతులను ప్రశ్నిస్తే 'మిత్తి పైసలు కట్టేందుకు వచ్చినం' అన్నరు. గుడిపేట రైతు వేదిక దగ్గర అధికారుల కోసం రైతులు వచ్చారని తెలుసుకొని వెళ్లగా అక్కడ అదే పరిస్థితి. 'మాఫీ కాలేదు.. 30వ తేదీ దాకా ఆగమన్నరు. గవర్నమెంట్ నుంచి ఆదేశాలు అచ్చినంక మిత్తి కట్టుడా.. మొత్తమే మాఫీ చేసుడా తెలుస్తది' అని రైతులు చెప్పారు. బ్యాంక్‌కు వెళ్లి మిత్తి కట్టి రైతు వేదిక దగ్గరకు వచ్చిన రైతుల ముఖాలు తెల్లబోయాయి. మనిషికో సమాధానం చెప్పి గందరగోళం చేసుడు ఏందంటూ మండిపడ్డారు. వ్యవసాయ పనులు వదులుకొని బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.*

### రేషన్‌కార్డు లేకపోతే రైతును కాదా ?



*రూ. 2 లక్షలు దాటిందని మాఫీ కాలేదు. రూ.16 వేలు మిత్తి కడితే సెప్టెంబర్ 30 వరకు అయితదన్నారు. ఆ మిత్తి పైసలు బ్యాంక్‌లో కట్టేసిన. రేషన్‌కార్డు లేదని ల్యాండ్ పేపర్, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లన్నీ తీసుకొని రమ్మని సార్లు చెప్పిన్రు. కేసీఆర్ సర్కారు రుణమాఫీ చేసినప్పుడు ఇవ్వేమి అడగలేదు. సీదా రూ.60వేలు మాఫీ అయినయ్. ఈసారి గిన్ని చిక్కులు పెట్టింద్రు. రేషన్‌కార్డు లేకపోతే రైతును కాదా ? రుణమాఫీ కాదా ?* **- బేర ప్రభాకర్, ముల్కల్ల**

### రుణమాఫీ చేస్తారో ? లేదో ?



*పోయినేడాది కేసీఆర్ సర్కారు రూ.లక్ష రుణమాఫీ చేసింది. అది రెన్యూవల్ చేసి రూ.2 లక్షలు తీసుకున్న. రేషన్‌కార్డు ఉన్నది. గ్రామీణ బ్యాంక్ ముందే మా ఇల్లు. రెండు లక్షలకు రూ.15 వేలు మిత్తి అయ్యింది. బ్యాంక్‌లో రూ. 15 వేలు కట్టి అగ్రికల్చర్ ఆఫీసర్ దగ్గరికిపోతా. రుణమాఫీ చేస్తరో చేయరో తెల్వదు. మా ప్రయత్నమైతే చేస్తున్నాం.*

**- బోయిని మహేశ్, ముల్కల్ల**

### తిరగలేక యాష్టకస్తుంది



*మాది ముల్కల్ల పక్కనే ఉన్న పెద్దంపేట. నా పేరున రూ.1.10లక్షలు, నా భార్య పేరుమీద రూ.లక్ష లోన్ తీసుకున్నా. రూ.రెండు లక్షలు మాఫీ చేస్తారంటే మిగిలిన డబ్బులు, మిత్తితో కడతామని అధికారులకు చెప్పినం. మమ్ములను 30వతేదీ దాకా ఆగమన్నారు. నాతో పాటు వచ్చినోళ్లు కట్టారంట కదా.. నేను కూడా కడతా అంటే తొందరెందుకు పెద్దాయన అంటున్నరు. ఆ మాఫీ ఏమో కానీ తిరగలేక యాష్టకు వస్తాంది.*

**- అల్లంల పవ్వయ్య, శంకరమ్మ, పెద్దంపేట**

## రైతులకు చేరింది 7,500 కోట్లే: భట్టి

మొదటిపేజీ తరువాయి...

ఇవ్వడంలో బ్యాంకర్లు మానవీయ కోణంలో ఆలోచించాలని కోరారు. మంగళవారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రైతు రుణాల విషయంలో బ్యాంకర్లు లెక్కలతో కాదు, ఆత్మతో వ్యవహరించాలని సూచించారు. తమ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను వేగంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. రుణమాఫీ, రైతుభరోసా ద్వారా పెట్టుబడి సాయం అందించడంతోపాటు భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. వ్యవసాయంతోపాటు పారిశ్రామిక రంగాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్య అంశంగా పరిగణిస్తున్నదని, ఇన్నోవేటివ్ పాలసీలతో ముందుకు వెళ్తున్నదని వివరించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అమెరికా, కొరియా దేశాల్లో పర్యటించి రూ.36 వేల కోట్ల విలువైన ఎంవోయూలు కుదుర్చుకున్నారని తెలిపారు. సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ద్వారా పెద్ద సంఖ్యలో ఉపాధి లభిస్తుందని, వీరికి విరివిగా రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని బ్యాంకర్లకు సూచించారు. ఇందిరా మహిళాశక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాలకు రూ.లక్ష కోట్లు వడ్డీ లేని రుణాల రూపంలో ఇవ్వనున్నామని, వారికి సహకరించాలని కోరారు. రాష్ట్రంలో ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం అవసరమైన అన్ని సహాయ, సహకారాలను అందిస్తుందని చెప్పారు. రాబోయే త్రైమాసికంలో నిర్దేశించిన రుణ ప్రణాళికను అధిగమించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కోరారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కష్టకాలంలో కూడా ప్రభుత్వం రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తూ రూ.18 వేల కోట్లు ఇప్పటికే విడుదల చేసిందని గుర్తుచేశారు. కింది స్థాయిలో పనిచేసే బ్రాంచ్ మేనేజర్లు రుణ ఖాతాలో తప్పులు సరిదిద్ది రైతులకు మేలు చేయాలని కోరారు. బ్యాంకర్లు బాధ్యతగా వ్యవహరించి రుణమాఫీ కార్యక్రమాన్ని సంపూర్ణం చేయాలని సూచించారు. అంకెలు చదువుకొని మూడు నెలలకోసారి మీటింగ్‌లు పెట్టడం వల్ల, బ్యాంకర్ల సదస్సు నిర్వహణకు అర్థంలేదని చెప్పారు.

# మృదువుగా కానిద్దాం..

చిన్నపిల్లల పెంపకం ఓ కళ. దానిని మనసారా ఆస్వాదించాలంటే పెద్దల సలహాలు పాటించడం తప్పనిసరి. నెలల వయసున్న పిల్లల స్నానానికి ముందు నూనెతో ఒళ్లంతా మర్దనా చేయడం చూస్తుంటాం. అలా మసాజ్ చేయడం వల్ల.. పిల్లల కండరాలు బలంగా తయారవుతాయి. చక్కగా మర్దనా చేసి, గోరువెచ్చని నీటితో స్నానం చేయగానే బుజ్జాయిలు బుద్ధిగా బజ్జుంటారు. కంటి నిండా నిద్ర.. చంటిపాపలకు ఆరోగ్యాన్ని అందిస్తుంది. వాళ్లు చక్కగా ఎదగడానికి దోహదం చేస్తుంది.



**మసాజ్** చేయడం అంటే... ఏదో నూనె రాసేశాం, నీళ్లు పోసేశాం అన్నట్టు ఉండొద్దు. పిల్లలు నిద్రమత్తులో జోగేలా ఈ వ్యవహారం నడిపించాలి. వెచ్చని వాతావరణం ఉండేలా చూసుకోవాలి. మర్దనా చేసేది అమ్మ అయితే.. బిడ్డకు గాజులు తగలకుండా చూసుకోవాలి. ఈ కార్యాన్ని నాన్న చేసే పనైతే... ఉన్న బలాన్నంతా ప్రయోగించ కుండా సున్నితంగా డీల్ చేయాలి. అంతేకాదు పిల్లల ఒళ్లంతా నూనె రాసినప్పుడు వాళ్లు కాళ్ల నుంచి జారిపోయే ప్రమాదం ఉంది. అలా కాకుండా.. కాళ్లపై దళసరి వస్త్రం పరిచి మసాజ్‌కు శ్రీకారం చుట్టాలి.

**స్నానానికి** ముందు మసాజ్ చేయడం మంచిది. శరీరంలోని ప్రతి భాగానికి నూనె లేదా ఏదైనా మాయిశ్చరైజర్ అప్లయ్ చేసి మృదువుగా మర్దనా చేయాలి. తల, మెడ, భుజాలు, తొడలు, కాళ్లకు మసాజ్ చేస్తే పిల్లలు యాక్టివ్‌గా ఉంటారు. నెమ్మదిగా మర్దనా చేయడం వల్ల పిల్లల్లో రక్త ప్రసరణ సాఫీగా సాగుతుంది. శ్వాసక్రియ మెరుగవుతుంది. జీవక్రియలు నిరాటంకంగా సాగుతాయి. చక్కని నిద్ర పడుతుంది. పొట్ట పైభాగంలో మృదువుగా మర్దనా చేస్తే గ్యాస్, అజీర్తి సంబంధిత సమస్యలు దరిచేరవు.


# ఇలా బరువు తగ్గిద్దాం

**ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా ఎందరో అధిక బరువుతో సతమతమవుతున్నారు. పెరిగిన బరువును తలుచుకొని చాలామంది బాధపడుతుంటారు. వెయిట్ లాస్ కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే, సరైన రీతిలో బరువు తగ్గకపోతే మరిన్ని సమస్యలు చుట్టుముడతాయి. కాబట్టి, ఆరోగ్యకరమైన పద్ధతులు పాటిస్తూ బరువు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి.**

**బరువు** తగ్గాలనుకునేవారు శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం చాలా అవసరం. ఉదయం నిద్ర నుంచి లేవగానే గ్లాసు నీరు తాగితే మంచిదని నిపుణుల మాట. దీనిద్వారా జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్ బయటికి వెళ్లిపోవడానికి నీరు అవసరం. ఒక గ్లాసు వేడినీటిలో నిమ్మరసం కలిపి తాగితే మరీ మంచిది.

**బరువు** తగ్గడం కోసం చాలామంది ఆహారాన్ని నియంత్రిస్తుంటారు. కఠోర ఉపవాసాలు పాటిస్తుంటారు. ఇలా చేయడం వల్ల బరువు తగ్గడం మాట అటుంచితే.. కండరాలు బలహీనం అవుతాయి. ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కండరాలు బలంగా ఉంటూ, బరువు తగ్గాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. ఆహారంలోని ప్రొటీన్ కంటెంట్ పొట్టను ఎక్కువ సమయం నిండుగా ఉంచుతుంది. ఆకలిని నియంత్రిస్తుంది. తద్వారా ఆరోగ్యంగా ఉంటూనే బరువు తగ్గొచ్చు.

**బద్ధకించకుండా** క్రమం తప్పకుండా వర్కవుట్లు చేయడం వల్ల సులభంగా బరువు తగ్గొచ్చు. పొట్ట కొవ్వు తగ్గడానికి యోగా, జాగింగ్ సరైన ఎంపికలు. రెగ్యులర్‌గా కసరత్తులు చేయడం వల్ల ఒంట్లో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ క్రమంగా తగ్గుతుంది. ఫలితంగా బరువు తగ్గే అవకాశాలు ఉంటాయి.



**నిద్ర** నుంచి లేవగానే ఫోన్‌కు అతుక్కుపోకుండా.. పది నిమిషాలు ధ్యానం చేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి. మానసిక ఒత్తిళ్లు తలెత్తినప్పుడు శరీరంలో కార్టిసోల్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. ఇది బరువు పెరగడానికి కారణం అవుతుంది. ధ్యానంతో ఒత్తిడి తగ్గుతుంది. దీంతో కార్టిసోల్ అదుపులో ఉండి.. బరువు నియంత్రణలో ఉంటుంది.

# గర్భం ధరించాలంటే జిమ్ ఆపేయాలా?

**నమస్తే మేడం. నా వయసు 25 సంవత్సరాలు. పెండ్లయి ఏడాది దాటింది. కాస్త బొద్దుగా ఉంటానని సన్నబడే ఉద్దేశంతో రెండేండ్ల నుంచీ జిమ్‌కి వెళ్తున్నాను. రోజూ బరువులెత్తే వ్యాయామాలు కూడా చేస్తున్నాను. ప్రస్తుతం తల్లిని కావాలి అనుకుంటున్నాను. ఈ వ్యాయామాలు ఆపేయాలా? గర్భధారణ మీద వీటి ప్రభావం ఉంటుందా?**

**• ఓ పాఠకురాలు**





**బరువు** తగ్గడం అన్నది 75 శాతం ఆహారం మీద, 25 శాతం వ్యాయామం మీద ఆధారపడి ఉంటుంది. చిన్న కప్పెడు అన్నం, అంతే మొత్తంలో కాయగూరలు, పప్పులాంటివి తినాలి. నిజానికి అన్నానికన్నా ఎక్కువ కూర తినాలి. తినగానే ఓ పది నిమిషాలు నడవాలి. అప్పుడు ఆహారంలోని గ్లూకోజ్‌ని కండరాలు తీసుకుంటాయి. శరీరంలో గ్లూకోజ్ నిల్వ ఉండదు. ఉప్పు, పంచదారలకు దూరంగా ఉండాలి. జంక్‌ఫుడ్ జోలికి పోవద్దు. జ్యూస్‌ల స్థానంలో పండ్లు, కూరగాయల్ని నేరుగా తీసుకోవాలి. ఇలా చేస్తే ఎవరైనా ఇట్టే తగ్గిపోతారు. ఆరోగ్యమూ బాగుపడుతుంది. ఇక, వ్యాయామం విషయానికి వస్తే ఇందాక మనం చెప్పుకొన్నట్టు బరువు మీద పాతిక శాతం ప్రభావమే చూపుతుంది. గట్టిగా తిని వ్యాయామం చేస్తే కండపడతారు తప్ప తగ్గరు. ఆహారాన్ని నియంత్రించుకుంటూ వ్యాయామం చేస్తే సులభంగా బరువు తగ్గుతారు. ఎత్తుకు తగ్గ బరువు అన్నది కూడా త్వరగా నెలతప్పేందుకు ఉపయోగపడే విషయమే. ఇక, నిస్సంకోచంగా బరువులెత్తే వ్యాయామాలు సహా అన్నీ మీరు చేయొచ్చు. ఇవి గర్భధారణ మీద ప్రభావం చూపవు. యోగాలాంటివీ చక్కగా చేసుకోవచ్చు. నెలతప్పాక మాత్రం కొన్ని వ్యాయామాలు చేయకూడదు. మీ పరిస్థితిని బట్టి అప్పుడు డాక్టర్లు అవేంటో చెబుతారు.



**డాక్టర్ పి. బాలాంబ**
సీనియర్ గైనకాలజిస్ట్



# వర్చువల్ రియల్ స్టార్!







**కనిపించని ప్రపంచాన్ని కండ్ల ముందు ఆవిష్కరిస్తుంది వర్చువల్ రియాలిటీ. కనిపించే ప్రపంచాన్ని మనది కాదేమో అనిపించేలా చేసింది కొవిడ్. ఈ రెండూ ఆమె జీవితంపై అత్యంత ప్రభావాన్ని చూపించాయి. ఒకటి నిలబెడితే.. ఇంకోటి పడగొట్టింది. కష్టనష్టాల్లో తొణక్కపోవడం అమ్మ నుంచి నేర్చుకుందామె. అందుకే, ఓ పక్క కొవిడ్, మరో పక్క క్యాన్సర్ మూకుమ్మడిగా దాడిచేసినా స్థైర్యం సడలనివ్వలేదు. కరోనాకు ముందూ తర్వాతా ఆంత్రప్రెన్యూర్‌గా తన జీవితాన్ని రెండు భాగాలుగా విభజిస్తే... ఇంటర్వెల్ సహా ఆమె జీవితం హిట్టే! కోల్‌కతాకు చెందిన డీసీ విజన్ వీఆర్ సంస్థ స్థాపకురాలు ధృతి ఛటర్జీ... ఒడుదొడుకులతో సాగిన తన జీవితం గురించి 'జిందగీ'తో పంచుకున్నారిలా..**

**డ్రీమ్ హోమ్..** ఇన్ని గదులు, ఈ రంగుల గోడలు, ఇలాంటి ఇంటీరియర్... ఎన్నో ఊహలు. వాటికి నిజరూపం తీసుకొచ్చి మీరనుకున్నట్టే ఉందా... అని అడుగుతుంది వర్చువల్ రియాలిటీ. మనం ఉండబోయే ఇంటిని ఇలా చూపించడం బిల్డర్లకు, ఇంటీరియర్ డిజైనింగ్ వాళ్లకూ ఎంత అవసరమో.. ఇంటి యజమానులకూ అంతే మంచిది. రంగులన్నీ వేసి, కర్టెన్లు జతచేశాక... అబ్బే కాంబినేషన్ బాలేదు... అనిపిస్తుంది. అప్పుడు మార్చాలంటే డబ్బు, శ్రమ, సమయం వృథా! అదే వర్చువల్ రియాలిటీ ద్వారా మనమే నేరుగా వెళ్లినట్టు అన్నీ చూడగలిగితే వీటన్నిటినీ ఆదా చేసుకోవచ్చు. మా సంస్థ డీసీ విజన్ వీఆర్ చేసే పని ఇదే. ఒక్కమాటలో చెప్పాలంటే పునాది రాయి వేయకముందే... గృహప్రవేశం అయిన ఇంట్లో వర్చువల్‌గా అడుగు పెట్టొచ్చన్నమాట! ఒక్క ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే కాదు, కాలేజీలు, ఫ్యాక్టరీలు, సాఫ్ట్‌వేర్, ఫార్మా సంస్థలు... ఇలా ఎన్నిటికో మేం సేవలందిస్తున్నాం. గతేడాది 50కి పైగా ప్రాజెక్టులు పూర్తిచేసి, ఈ రంగంలో మాకంటూ పేరును సంపాదించుకున్నాం. నిజానికి దీనికి ముందు కూడా డిడాక్టిక్స్ ఐటీ సొల్యూషన్స్ పేరిట మరో సంస్థను ప్రారంభించి విజయవంతంగా నడిపాం. హైదరాబాద్ సహా అన్ని మెట్రో నగరాల్లోనూ మాకు క్లయింట్లు ఉన్నారు. బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్ దేశాల్లోనూ... చాలా ప్రాజెక్టులు పూర్తిచేశాం. ఆంత్రప్రెన్యూర్‌గా నా ప్రయాణం చెప్పాలంటే ముందు నా నేపథ్యం గురించీ చెప్పాల్సిందే.

### అలా మొదలైంది

మధ్యతరగతి జీవితం విలువల్ని నేర్పింది. పద్ధతులు, చదువు, నాట్యం, సంగీతం... ఇవే చిన్నప్పుడు నా ప్రపంచం. డిగ్రీ అయిపోయాక పీజీ (ఆంత్రపాలజీ) చదివాను. అయితే ఆ సమయానికి మంచి ఉద్యోగం రావాలంటే హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్‌లలో అవకాశాలు బాగున్నాయి... అన్నారు నాన్న. దీంతో డిప్లొమాలో చేరాను. నాన్న బ్యాంకర్. అమ్మకు సొంతంగా సెలూన్ ఉంది. అలా డిప్లొమాలో చేరినప్పుడు అక్కడ నేను తప్ప అంతా మగపిల్లలే. అయినా బెరుకు లేకుండా పూర్తిచేశాను. అదే ఇన్‌స్టిట్యూట్‌లో మొదటి లేడీ ఫ్యాకల్టీగా రెండేండ్లు పనిచేశా. తర్వాత కూడా కొన్ని ఉద్యోగాలు చేశా. అయిదేండ్లు గడిచేసరికి పెద్ద హోదా కలిగిన ఉద్యోగంలోనే ఉన్నా.. ఒకానొక సమయంలో నాకంటూ సొంతంగా కంపెనీ ఉంటే బాగుండు అనిపించింది. అమ్మ కూడా సొంతంగా సెలూన్ ప్రారంభించి నడుపుతూ ఉండటం వల్ల కాస్త ధైర్యమూ వచ్చింది. అలా 2011లో ముగ్గురు మిత్రులం కలిసి 'డిడాక్టిక్స్ ఐటీ సొల్యూషన్స్' ప్రారంభించాం. వివిధ కంపెనీలకు ట్రైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అందించడం మా సంస్థ పని. అంటే, ఒక సంస్థకు సంబంధించిన ఉద్యోగులకు ఒక సాఫ్ట్‌వేర్‌లో శిక్షణ కావాలి అంటే, మేమే నిపుణుల్ని మాట్లాడి, హాల్స్ బుక్ చేసి, భోజనం ఏర్పాటుచేసి... ఎన్నాళ్లు అవసరం అయితే అన్నాళ్ల శిక్షణ ఇచ్చేవాళ్లం.

**ఐబీఎం,** క్యాప్‌జెమిని, టీసీఎస్, యాక్సెంచర్... ఇలా ఎన్నో పేరెన్నికగన్న ఐటీ సంస్థలకు మా సేవలందించాం. ఒకరకంగా చెప్పాలంటే, అసలు మా రంగంలో తిరుగులేకుండా దూసుకెళ్లాం. అదే సమయంలో నాకు ఏఆర్ వీఆర్ (అగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ) టెక్నాలజీ గురించి ఒక ప్రొఫెసర్ ద్వారా తెలిసింది. బాగా ఆసక్తిగా అనిపించడంతో దాని గురించి సింగపూర్, మలేషియాలాంటి దేశాల్లోని ఎగ్జిబిషన్లకు వెళ్లి మరీ తెలుసుకున్నా. లండన్ యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ కోర్సు కూడా చేశా. కొవిడ్ సమయంలో దీని అవసరం మరింత ఉందనిపించి 2020 డిసెంబరులో డీసీ విజన్ వీఆర్ సంస్థ ప్రారంభించా. 250 మందికి పైగా విద్యార్థులకు దీని ద్వారా ట్రైనింగ్ కూడా ఇచ్చా. అయితే అన్నీ అనుకున్నట్టు జరిగితే జీవితం ఏముంటుంది. ఒడుదొడుకులూ ఎదురుదెబ్బలూ మనమేంటో పరీక్షిస్తాయిగా...

### దెబ్బ మీద దెబ్బ

కొవిడ్ దెబ్బకు మా శిక్షణ సంస్థ అతలాకుతలం అయింది. అందులోని ఉద్యోగులకు జీతాలు ఇవ్వడమే కష్టమైన పరిస్థితి ఏర్పడింది. నాకు అంతకుముందు నుంచీ ఎండోమెట్రియాసిస్ అనే నెలసరి సంబంధిత సమస్య ఉండేది. నెలలో 20 రోజులపాటు సమస్య ఎదుర్కొనే దాన్ని. కొన్నేండ్లపాటు దాంతో సహజీవనం చేశా. కానీ, నాకు సెకండ్ వేవ్‌లో కొవిడ్ వచ్చాక ఇది తట్టుకోలేని సమస్యగా మారిపోయింది. నొప్పి తీవ్రంగా వేధించింది. లాక్‌డౌన్ వేళ ఆసుపత్రులకు వెళ్లలేని పరిస్థితి. ఆ సమయంలో నరకం అనుభవించా. చివరికి ఫ్యామిలీ డాక్టర్ సాయంతో కొన్ని పరీక్షలు చేసుకున్నాక, డాక్టర్‌ని కలిశా. గర్భాశయ క్యాన్సర్ తొలిదశలో ఉందన్నారు. ఆపరేషన్ చేశారు. వ్యాపారాలు, ఆరోగ్యం అన్నీ ఒకేసారి కుదేలయ్యాయి. దిక్కుతోచని పరిస్థితిలో ఓ మెంటార్‌ని కలిశా. ఆర్థికంగానే కాదు, మానసికంగానూ ఆమె నాకు దన్నుగా నిలిచారు. అలాగే, ఎత్తుపల్లాలు వచ్చినప్పుడు తొణక్కుండా పనిచేయడం అమ్మ నుంచి నేర్చుకున్నా. అమ్మా, నాన్న, మావారు నాకు ఎప్పుడూ సపోర్ట్‌గా ఉన్నారు. అలా కోలుకుని, ఏడాది విరామం తర్వాత నా కొత్త సంస్థ మీద దృష్టి పెట్టా. అది విజయవంతంగా నడుస్తున్నది. తొలి సంస్థ డిడాక్టిక్స్‌కూ పునరుత్తేజం తీసుకొచ్చాం. వర్చువల్ రియాలిటీ రంగానికి సంబంధించి నా అనుభవాన్నీ, ఆలోచనలనూ పంచుకోమంటూ చైనా ప్రభుత్వం పిలిచింది. సొంతకాళ్లపై నిలబడాలన్న ఆశ ఉన్న నాలాంటి 250 మందికిపైగా మహిళా ఆంత్రప్రెన్యూర్లకు మెలకువలు నేర్పించాను.

### ఆ పిల్లల కోసం

> "**తొలి** నుంచీ నాకంటూ ఒక ప్రత్యేకత ఉండాలని కోరుకునేదాన్ని. నేను చేసే పనులకు కూడా పరంపర కొనసాగాలనుకుంటా. ఎన్ని ఆటంకాలు వచ్చినా.. కష్టపడటం ఆపకపోవడానికి అదే స్ఫూర్తి. ఆ పరంపరను ఏర్పాటు చేయడమే నా లక్ష్యం కూడా. అలాగని నా పిల్లలు ఇదే వ్యాపారం చేయాలని నేను ఒత్తిడి చేయను. నాకు కవల పిల్లలు. వయసు పదహారేండ్లు. మా పాప నన్ను అనుసరిస్తుంది. తను ఇప్పటికే యూట్యూబర్. బాబు టీం ఇండియాకు ఆడాలన్న లక్ష్యంతో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్నాడు. ఇలా, ఎవరికి నచ్చిన రంగంలోకి వాళ్లు వెళ్లే వసతి అందరి పిల్లలకూ ఉండదు. అలాంటి పిల్లల కోసం 'స్కూల్ ఆఫ్ ఆల్టర్నేటివ్ థాట్' పేరిట ఒక శిక్షణాలయం ఏర్పాటు చేయాలనుకుంటున్నా. అక్కడ వాళ్లు తమకు నచ్చిన నైపుణ్యాలను నేర్చుకోవచ్చు. మనం జీవించడానికి పుస్తకాల్లోని చదువుకన్నా, మనం నేర్చుకున్న నైపుణ్యాలే ఎక్కువ ఉపయోగపడతాయని నమ్ముతాను. ఇకమీదట దీని కోసమూ కష్టపడతాను!"

... లక్ష్మీహరిత ఇంద్రగంటి



# స్పామ్.. బ్లాక్ చేసేద్దాం

**పలకరింపు** సందేశాలకు కొత్త భాష్యం చెప్పిన ప్లాట్‌ఫామ్ వాట్సాప్. ఒకప్పుడు చాటింగ్‌కే పరిమితమైన వాట్సాప్ ఇప్పుడు 'ఆల్ ఇన్ వన్'గా మారింది. వాయిస్ కాల్స్, వీడియో కాల్స్, పేమెంట్స్, చానెల్స్, కమ్యూనిటీలు... ఇలా అన్నిటికీ వేదికైంది. యూజర్లకు మరింత దగ్గర కావడానికి వాట్సాప్ రెగ్యులర్‌గా కొత్త ఫీచర్స్‌ను పరిచయం చేస్తున్నది. ఈ క్రమంలో వచ్చిన మరో హాట్ అప్‌డేట్ 'స్పామ్ బ్లాకర్'. ఇది త్వరలోనే ఆండ్రాయిడ్ ఐఓఎస్‌లపై లాంచ్ కానుంది. దీని సాయంతో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలకు అడ్డుకట్ట వేయొచ్చు. వాట్సాప్‌లో తరచూ అన్‌నోన్ నంబర్స్, గ్రూప్స్ నుంచి మెసేజ్‌లు రావడం, వాటిని చూసి డిలీట్ చేయడం రొటీన్‌గా మారింది. ముఖ్యంగా ఆఫర్లు, డిస్కౌంట్లు, వర్క్ ఫ్రమ్ హోమ్.. ఇలా రకరకాల మెసేజ్‌లు వరుసకట్టి వస్తుంటే.. చికాకు కలగకమానదు. ఈ ఇబ్బందులకు 'స్పామ్ బ్లాకర్' ముగింపు పలకనుంది. దీన్ని ఉపయోగించి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే స్పామ్ మెసేజ్‌లను ఫిల్టర్ చేయొచ్చు. ఒకవేళ మీరు ఈ బీటా వెర్షన్‌ని వాడుతున్నట్లయితే సెట్టింగ్స్‌లో 'ప్రైవసీ'లోకి వెళ్లి 'బ్లాక్ అన్‌నోన్ అకౌంట్ మెసేజెస్' ఆప్షన్ ఎనేబుల్ చేసుకుంటే సరి!




# సరిగమప.. సమరం

**బుల్లితెర** ప్రేక్షకులకు వినోదాన్ని అందించడంలో ముందుండే జీ తెలుగు.. సరిగమప సమరానికి సిద్ధమవుతున్నది. పదిహేను సీజన్లుగా ఎంతోమంది ప్రతిభావంతులైన గాయనీ గాయకులను వెలికితీసిన ఈ కార్యక్రమం 'ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్' శీర్షికతో పదహారో సీజన్‌కు నాంది ప్రస్తావన చేస్తున్నది. ఇందులో భాగంగా తెలుగు రాష్ర్టాల్లో ఆడిషన్స్ నిర్వహిస్తున్నది. ఈ నెల 25 ఆదివారం హైదరాబాద్‌లో ఆడిషన్స్ చేపట్టనుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సనత్‌నగర్‌లోని హిందూ మహిళా కళాశాల, హిందూ పబ్లిక్ స్కూల్ దగ్గర ఈ కార్యక్రమం జరగనుంది. 15 ఏండ్ల నుంచి 30 ఏండ్ల మధ్యనున్న గాయనీ గాయకులు ఇందులో పాల్గొనవచ్చు. ఇతర వివరాల కోసం 9154670067 నెంబర్‌ను సంప్రదించవచ్చు. అంతేకాదు ఔత్సాహికులు ఈ నెల 30 వరకు డిజిటల్ ఆడిషన్స్ ద్వారా కూడా ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవచ్చు. పాల్గొనదలచిన వారు తాము పాడిన పాటకు సంబంధించిన వీడియోను 9154670067 నెంబర్‌కు వాట్సాప్ గానీ, ztsaregamapa@zee.com ఐడీకి ఈ-మెయిల్ చేయొచ్చు.



**నర్సరీ పిల్లలపై లైంగిక వేధింపులు**
- మహారాష్ట్ర బద్లాపూర్‌లో స్కూల్ స్వీపర్ ఘాతుకం
- తల్లిదండ్రులు, స్థానికుల్లో వెల్లువెత్తిన ఆగ్రహం
- పాఠశాల, రైల్వే స్టేషన్‌పై దాడి.. 30 రైళ్లు రద్దు

› 7


మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA


పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..


బుధవారం WEDNESDAY 21.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం Pages: 12+4 + 8 Pages NIPUNA supplement | సంపుటి (Volume): 14 ॥ సంచిక (Issue): 77 ॥ వెల (Price) రూ.6.50


విదియ

బుధవారం, సూర్యోదయం: 6-00, సూర్యాస్తమయం: 6-38. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం కృష్ణ పక్షం తిథి: విదియ సాయంత్రం 5-07 వరకు. నక్షత్రం: పూర్వాభాద్ర రాత్రి 12-34 వరకు. వర్జ్యం: ఉదయం 8-52 నుంచి ఉదయం 10-18 వరకు. రాహుకాలం: పగలు 12-19 నుంచి పగలు 1-53 వరకు. దుర్ముహూర్తం: పగలు 11-53 నుంచి పగలు 12-44 వరకు. అమృతకాలం: సాయంత్రం 5-25 నుంచి సాయంత్రం 6-50 వరకు.


PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline


# బడి పిల్లల ముందు బజారు భాష

## స్థాయిని మరచి సీఎం రేవంత్ చిల్లర మాటలు.. కేసీఆర్‌పై అసభ్య వ్యాఖ్యలు



హైదరాబాద్ సోమాజీగూడలో మంగళవారం జరిగిన రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమంలో బడిపిల్లల ముందు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలన్నందుకు కేసీఆర్ చావుకోరిన ముఖ్యమంత్రి**

మళ్లీ అదే ఎత్తుగడ.. మళ్లీ అదే నోటి దురుసు.. సచివాలయం ముందు అమరవీరుల స్థూపం పక్కన... గతంలో తెలుగుతల్లి విగ్రహం ఉన్నచోట మన తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించాలని తెలంగాణ సమాజం, తెలంగాణ వాదులు, బీఆర్‌ఎస్ ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రతీక అయిన తెలుగుతల్లి విగ్రహం ఉన్న ప్రదేశంలో తెలంగాణ తల్లిని స్థాపించినప్పుడే తెలంగాణ అస్తిత్వభావన పరిపూర్ణమవుతుందని విజ్ఞప్తి చేస్తూవచ్చాయి. దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ పేరుమీద రాష్ట్రంలో ఇప్పటికే అనేక ప్రతీకలు ఉన్నందున ప్రత్యేకంగా అక్కడే ఆయన విగ్రహం పెట్టాల్సిన అవసరం లేదన్నది తెలంగాణ వాదుల భావన. వాస్తవం ఇది కాగా, దీనిపైనా రేవంత్ వక్రభాష్యం మొదలుపెట్టారు. తెలుగుతల్లి విగ్రహం ఉన్న ప్రదేశంలో కేసీఆర్ విగ్రహం పెట్టాలని కేటీఆర్ ఆలోచిస్తున్నారంటూ ఊహాకల్పన చేశారు. తన మెదడుకు తోచిందే నిజమని భావించి కేసీఆర్‌పై నోరుపారేసుకున్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బడిపిల్లలు ఉన్నారన్న విషయం మరిచి చెప్పలేని, రాయలేని భాషలో కేసీఆర్‌ను, కేటీఆర్‌ను తిట్టిపోశారు. › 6

## సచివాలయంలో తెలంగాణ తల్లి

- సీఎం రేవంత్‌రెడ్డి హడావుడి ప్రకటన
- గంటల్లోనే రెండు సార్లు స్థల పరిశీలన
- తెలుగుతల్లి విగ్రహం ఉన్నచోట రాజీవ్ గాంధీ విగ్రహమే పెడ్తామని మంకుపట్టు
- రాజీవ్ విగ్రహంపై చెయ్యేస్తే చెప్ప తెగుతదంటూ హోదా మరిచి వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తామన్న ప్రకటనపై విమర్శలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు ప్రారంభించింది. ఉమ్మడి రాష్ట్ర సచివాలయంలో తెలుగుతల్లి › 6వ పేజీలో



అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ నేతలు బాల్క సుమన్, దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్ తదితరులు

## సీఎంపై బీఆర్‌ఎస్ ఫిర్యాదు

- రేవంత్ అనుచిత వ్యాఖ్యలపై పంజాగుట్ట పోలీసులకు కంప్లెయింట్
- చీఫ్‌మినిస్టర్ గుర్తుపెట్టుకో!.. సెక్రటేరియట్ పరిసరాల్లో చెత్తను తొలగిస్తం
- మానసిక అనారోగ్యం నుంచి రేవంత్‌రెడ్డి త్వరగా కోలుకోవాలి: కేటీఆర్
- పిల్లలముందా వికృత మాటలు?.. రాష్ట్రం పరువుతీస్తున్న సీఎం: దేశపతి
- ముఖ్యమంత్రి నోటిని ఫినాయిల్‌తో కడగాలి.. విరుచుకుపడిన నెటిజన్లు › 6

# రుణ భంగం.. రణ రంగం

## రైతన్నల నిరసనలు.. అధికారుల నిలదీతలతో దద్దరిల్లిన తెలంగాణ



కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో..

ఒకవైపు రుణమాఫీ సంపూర్ణమన్న ముఖ్యమంత్రి మాటలు.. మరోవైపు ఇంకా ఉన్నదన్న మంత్రుల వ్యాఖ్యలు.. ఆ రెండింటి మధ్య బ్యాంకుల దగ్గర బారులు.. మాఫీ కాకపోవడంపై కడుపుమండి రోడ్డెక్కిన రైతులు! నాలుగురోజులుగా రాష్ట్రం రైతు ఆందోళనలతో అట్టుడుకుతున్నది. కొర్రీలు పెట్టి, కోతలు విధించి మాఫీపై సర్కారు ధోకా చేసిందంటూ మంగళవారం కూడా అన్ని జిల్లాల్లో రైతులు ఆందోళనకు దిగారు. వ్యవసాయ కార్యాలయాల వద్ద బైఠాయించారు. తమకు జరిగిన అన్యాయంపై అధికారులను నిలదీశారు. బ్యాంకులకు తాళం వేసి సర్కారు మాఫీ డ్రామాపై నిప్పులుకక్కారు. పలుజిల్లాల్లో కర్షకుల నిరసన గొంతుకను నొక్కేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో ఆందోళనకు దిగిన రైతులను పోలీసులు చెదరగొట్టారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో రాస్తారోకో చేస్తున్న రైతులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు.

### ఉత్తమన్నా.. నువ్వన్నా మాట్లాడు!

- రైతు రుణమాఫీపై ప్రెస్‌మీట్ పెట్టాలంటూ ముఖ్యమంత్రి వేడుకోలు › 5
- వ్యవసాయ మంత్రి తుమ్మల నిరాకరణ
- పదే పదే కోరడంతో ఒప్పుకున్న ఉత్తమ్

## రైతులకు చేరింది 7,500 కోట్లే: భట్టి

- రుణమాఫీ కింద బ్యాంకులకు 18 వేల కోట్లు ఇచ్చాం
- వారం ఆలస్యమైనా ఫలితం ఉండదు: డిప్యూటీ సీఎం
- సాయంత్రానికి మాటమార్పు.. 17వేల కోట్లని వివరణ

హైదరాబాద్, ఆగస్టు 20(నమస్తే తెలంగాణ): రుణమాఫీ కింద ప్రభుత్వం బ్యాంకులకు రూ.18 వేల కోట్లు అందజేస్తే, రైతులకు ఇప్పటివరకు రూ.7,500 కోట్లు మాత్రమే చేరాయని డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రుణాల మాఫీలో వారం ఆలస్యమైనా ఫలితం ఉండబోదని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం పత్రికా ప్రకటన విడుదల చేశారు. అయితే, ఆ పత్రికా ప్రకటన తప్పు అంటూ ఆయన పీఆర్వో సాయంత్రం మరో ప్రకటన జారీ చేశారు. ప్రభుత్వం బ్యాంకులకు రూ.18 వేల కోట్లు జమ చేస్తే.. తిరిగి రైతులకు కొత్త రుణాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నాయనేది భట్టి విక్రమార్క ఉద్దేశం అంటూ ఆయన పీఆర్వో వివరణ ఇచ్చారు. సీజన్ ప్రారంభమైనప్పటికీ17,300 కోట్లు మాత్రమే రుణాలు ఇవ్వడం సరైంది కాదని భట్టి అన్నారని పేర్కొన్నారు. రైతులకు రుణాలు › 5వ పేజీలో

**22న బీఆర్‌ఎస్ ధర్నాలు** › 3



## 'స్వచ్ఛ్ బయో'పై ఈడీకి ఫిర్యాదు

- స్వయంగా ఢిల్లీ ఆఫీసుకు వెళ్లిన క్రిశాంక్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడి మధ్య డీల్‌పై విచారణ జరుపాలని అభ్యర్థన
- ఫిర్యాదు స్వీకరించిన ఈడీ అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం, స్వచ్ఛ్ బయో కంపెనీ మధ్య జరిగిన అవగాహన ఒప్పందంపై వెంటనే విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి ఫిర్యాదు చేశారు. ఢిల్లీలోని దర్యాప్తు సంస్థ కార్యాలయానికి వెళ్లి ఈడీ డైరెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన తమ్ముడు ఎనుముల జగదీశ్‌రెడ్డితో అమెరికా పర్యటన సందర్భంగా జరిగిన ఒప్పందంపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ ఆధారాలు కూడా సమర్పించినట్టు తెలిపారు. అధికారులు తన ఫిర్యాదును స్వీకరించి ఇచ్చిన అక్నాలెడ్జ్‌మెంట్‌ను మీడియాకు చూపించారు. క్రిశాంక్ లేఖ పూర్తి సారాంశం ఇలా ఉంది.. '2024 ఆగస్టు 6న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం › 10వ పేజీలో

### నల్లా కనెక్షన్లకు 30వేలు లంచం

ఏసీబీకి పట్టుబడిన జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డి › 10

### కోల్‌కతా ఘటనపై సుప్రీం ప్రశ్నల వర్షం

- ఎఫ్‌ఐఆర్ జాప్యంపై సీరియస్
- వైద్య సిబ్బంది భద్రతపై టాస్క్‌ఫోర్స్
- డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి చోటు › 7



# హైడ్రా హద్దు ఎందాక?

- ఔటర్ వరకు మాత్రమేనని జీవోలో స్పష్టీకరణ.. ఓఆర్‌ఆర్‌కు అవతల హైడ్రా చర్యలపై మొదలైన చర్చ
- ఔటర్‌కు 15 కి.మీ వెలుపలా కూల్చివేతలు.. స్వచ్ఛందంగా ప్రజల నుంచి ఫిర్యాదులు: కమిషనర్



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ విపత్తుల స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ సంస్థ (హైడ్రా) పరిధి ఎంతవరకు? అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై ఉక్కుపాదం మోపడంలో దూకుడు ప్రదర్శిస్తున్న హైడ్రా పరిధి, దాని అధికారాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. హైడ్రా రూపకల్పనకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్న పరిధి.. జరుగుతున్న పరిణామాలు కొంత గందరగోళం కలిగిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి తన విజన్‌ను వివరిస్తూ.. నగరం చుట్టూ ఉన్న ఓఆర్‌ఆర్ వరకు అర్బన్ తెలంగాణ, రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) వరకు సెమీ అర్బన్ తెలంగాణ, ఆ వెలుపల గ్రామీణ తెలంగాణగా అభివర్ణించారు. అర్బన్ తెలంగాణలో ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణకు హైడ్రాను ఏర్పాటుచేశారు. హైడ్రా పరిధి, అధికారాలు, విధులను ఖరారుచేస్తూ గత నెల 19న రాష్ట్ర ప్రభుత్వం జీవో 99 జారీచేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పూర్తి పరిధి, ఓఆర్‌ఆర్ వరకు ఉన్న పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల వరకు హైడ్రా › 6వ పేజీలో



### 'ఆమ్రపాలి' కుదింపు!

- మూసీ, హెచ్‌ఎండీఏ నుంచి తొలగింపు
- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా పూర్తి బాధ్యత
- సీనియర్ ఐఏఎస్‌లకు ఇవ్వాల్సిన పోస్టును అప్పగించడంపైనా వివాదం › 10

## 'డీఎస్సీ'పై సర్కారు ఆరా!

- ప్రశ్నలు పునరావృతం కావడంపై విచారణ
- బాధ్యులెవరో తేలితే చర్యలు తీసుకునే చాన్స్
- ప్రాథమిక కీపై 28 వేలకు పైగా అభ్యంతరాలు
- 'పేపర్ లీక్' ప్రశ్నే ఉత్పన్నంకాదన్న విద్యాశాఖ

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ పరీక్షల్లో ఒకరోజు వచ్చిన ప్రశ్నలు మరోరోజు రావడం.. ఇలా 19 ప్రశ్నలు పునరావృతం కావడంపై సర్కారు ఆరా తీసింది. ఈ అంశంపై 'నమస్తే తెలంగాణ'లో మంగళవారం 'డీఎస్సీ పేపర్ లీక్' అన్న శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై ప్రభుత్వ పెద్దలు సహా విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఆరా తీశారు. ప్రశ్నలు పునరావృతం కావడంపై పాఠశాల విద్యాశాఖ పరిశీలిస్తున్నది. ఈ తప్పిదం ఎలా జరిగింది అని, ఇందుకు బాధ్యులెవరు? అన్న కోణంలో విచారణ జరుపుతున్నది. ఈ విచారణ అనంతరం బాధ్యులైన వారిపై చర్యలు › 3వ పేజీలో

## ముంచెత్తిన వాన స్తంభించిన రవాణా

- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జడివాన బీభత్సం
- సగటున 12 సెం.మీ వాన.. పొంగిన నాలాలు
- భారీగా ట్రాఫిక్ జామ్.. వాహనదారుల ఇక్కట్లు
- పలు జిల్లాల్లో కుంభవృష్టి.. స్తంభించిన జనజీవనం
- 24 వరకు ఇదే తరహా వానలు: వాతావరణశాఖ › 10



హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్

## సీతక్క అనుచరుడి ఇసుక దందా

- డబ్బులు తీసుకొని ఇసుక లోడింగ్ చేయలేదని లారీ డ్రైవర్ల వాగ్వాదం.. సోషల్ మీడియాలో వీడియో వైరల్
- సీతక్క, కాంగ్రెస్‌తో నాకు సంబంధం లేదు: శ్రీనివాస్‌రెడ్డి



కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డిని నిలదీస్తున్న లారీ డ్రైవర్లు

ములుగు, ఆగస్టు 20 (నమస్తేతెలంగాణ): మంత్రి సీతక్క అనుచరుడు ఇసుక రీచ్‌ల వద్ద హల్‌చల్ చేస్తున్న ఓ వీడియో వైరల్ అయింది. డబ్బులు తీసుకొని ఇసుక లోడింగ్ చేయకపోవడంతో లారీ డ్రైవర్లు అతడిని నిలదీశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి.. ఇసుక రీచ్‌ల వద్ద ఇసుక లోడింగ్ చేస్తానంటూ డబ్బులు తీసుకొని చేయకపోవడంతో లారీ డ్రైవర్లు తిరగబడ్డారు. పది రోజుల క్రితం ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు) మండలంలోని వీరభద్రాపురం వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నది. ఓ లారీ డ్రైవర్ వీడియో తీసి పోస్టు › 10వ పేజీలో

## కాంగ్రెస్‌లో గొల్లకురుమ భేరి

- ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం లేదంటూ ఆగ్రహం
- అంజన్‌కుమార్‌యాదవ్ నేతృత్వంలో ప్రత్యేక భేటీ
- తమ వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఉద్ఘాటన
- పీసీసీ చీఫ్, మంత్రిపదవి ఇవ్వాలని డిమాండ్ › 6

# తీరని రుణం.. రైతుల రణం

• తల్లడిల్లిన తాడ్వాయి



రైతులందరికీ రుణమాఫీ చేయాలని మంగళవారం కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

• తాళం వేసిన తోటపల్లి




సిద్దిపేట జిల్లా తోటపల్లి ఇండియన్ బ్యాంకుకు తాళం వేసి ఆందోళన చేస్తున్న రైతులు

## సర్కారు ధోకాపై సమరం

**రుణమాఫీపై** ధోఖా చేసిన సర్కారుపై రైతులు సమరశంఖం పూరించారు. మూడు విడతల్లోనూ మాఫీ కాకపోవడంతో కడుపుమండి రోడ్డెక్కారు. ప్రభుత్వ రుణభంగాన్ని నిరసిస్తూ మంగళవారం రాష్ట్రమంతటా రణరంగమైంది. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో 44 జాతీయరహదారిపై, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి 63వ జాతీయ రహదారిపై రైతులు బైఠాయించారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కాప్రిలో, నిజామాబాద్ జిల్లా ఏర్గట్లలో, బోధన్ మండలం కల్దుర్కిలో, కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో అన్నదాతలు ఆందోళనలు నిర్వహించారు. బాన్సు వాడలో రుణమాఫీకాని రైతుల సంతకాలను సేకరించారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి, ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లో,మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలోని రైతువేదిక వద్ద రైతులు వ్యవసాయ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ ఏపీజీవీబీకి, సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లిలోని ఇండియన్ బ్యాంకుకు రైతులు తాళం వేశారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ తెలంగాణ గ్రామీణ బ్యాంకు వద్ద రైతులు పడిగాపులు కాశారు.నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ వ్యవసాయ శాఖ కార్యాలయం, వికారాబాద్ జిల్లా మైలార్‌దేవ్‌పల్లి ఏడీ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. కథలాపూర్‌లో జరిగిన ధర్నాలో మహిళలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఇదే ధర్నాలో ఏనుగు సాగర్ రెడ్డి అనే రైతు ఆత్మహత్యాయత్నం చేశారు. ఎస్‌ఐ నవీన్‌కుమార్ అప్రమత్తమై రైతు చేతిలో నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కెళ్లారు.

– నమస్తే తెలంగాణ, న్యూస్‌నెట్‌వర్క్




• బెజ్జంకి గర్జన



సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో జిల్లా వ్యవసాయ అధికారి మహేశ్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

• పిడికెలెత్తిన కల్దుర్కి



నిజామాబాద్ జిల్లా కల్దుర్కిలో రుణమాఫీ కాలేదని నిరసన తెలుపుతున్న కర్షకులు

• మెట్టుదిగని మెట్‌పల్లి




జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద 63వ జాతీయ రహదారిపై బైఠాయించిన నిరసన తెలుపుతున్న రైతులు

• బాన్సువాడలో రచ్చబండ



అర్హులందరికీ రుణమాఫీ చేయాలని కామారెడ్డి జిల్లా బాన్సువాడలో రుణమాఫీకాని రైతుల నుంచి సంతకాలు సేకరిస్తున్న బీజేపీ నాయకులు

• మైలార్‌దేవ్‌పల్లిలో మాఫీ మోసం




వికారాబాద్‌లోని ఏడీ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్న మైలార్‌దేవ్‌పల్లి రైతులు

• ఏవోతో వాగ్వాదం



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట రైతు వేదిక వద్ద ఏవోతో వాగ్వాదం చేస్తున్న రైతులు

• కథలాపూర్ కన్నెర్ర



2 లక్షల రుణమాఫీ చేయాలని జగిత్యాల జిల్లా కథలాపూర్‌లో జరిగిన ధర్నా వద్ద పురుగులమందు తాగే ప్రయత్నం చేస్తున్న రైతు సాగర్‌రెడ్డి

• ఖానాపూర్ కడుపుమంట



నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతులు

• ఇచ్చోడలో పడిగాపులు



ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ బ్యాంకు గేటు ఎదుట పడిగాపులు కాస్తున్న రైతులు

• షరతుల్లేని మాఫీ కావాలె




షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని నిజామాబాద్ జిల్లా ఏర్గట్లలో ధర్నా చేస్తున్న అన్నదాతలు



**ఏపీజీవీబీకి తాళం** | ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ ఏపీజీవీబీకి తాళం వేసి నిరసన తెలుపుతున్న రైతులు



**కదిలిన ఖమ్మం ఖిల్లా** | ఖమ్మం జిల్లా వేంసూరు మండలం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డుపై బైఠాయించిన రైతులు, నాయకులు

• సర్కారుపై సమరశంఖం



ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్‌లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకు వద్దకు వెళ్తున్న రైతులు, నాయకులు

• మాఫీ మాకెందుకు కాలె



ఆదిలాబాద్ జిల్లాలోని బజార్‌హత్నూర్ రైతువేదికలో రుణమాఫీ గురించి అధికారులను నిలదీస్తున్న రైతులు

• రైతన్నకు తప్పని రణం



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని కాప్రి ఎక్స్ రోడ్డు వద్ద రైతులను చెదరగొడుతున్న పోలీసులు

# మేఘా సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి

- దోపిడీ కంపెనీ అని ముద్రేసి ఇప్పుడు ప్రేమెందుకు?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్
- పోలీస్ వ్యవస్థ అధ్వానంగా మారిందని మండిపాటు




హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : సుంకిశాల ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని, మేఘా ఇంజినీరింగ్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని ప్రధాన ప్రతిపక్షంగా డిమాండ్ చేస్తున్నట్టు మంగళవారం ఎక్స్‌వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు. సుంకిశాల ఘటనకు కారణమైన మేఘా ఇంజినీరింగ్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోకుండా వారికి రూ.4,350 కోట్ల విలువైన కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను బహుమతిగా ఇవ్వబోతున్నారని తెలిపారు. ఈస్ట్ ఇండియా కంపెనీ అని, తెలంగాణ సంపదను దోపిడీ చేసే కంపెనీ అని నాడు ముద్రవేసిన కంపెనీ పట్ల ఈ దాతృత్వం, ప్రేమ ఎందుకని ప్రశ్నించారు.

### రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ అధ్వానం

పోలీసుల వేధింపులకు విసిగి వేసారిన నిజామాబాద్‌లోని ఓ స్వీట్ షాపు యజమాని తన షాపు ముందు 'పోలీసుల వేధింపుల కారణంగా షాపు మూసేస్తున్నా' అని భారీ బ్యానర్ కట్టాడని కేటీఆర్ తెలిపారు. ఓ వైపు నిజామాబాద్‌లో చిరు వ్యాపారులను వేధించే పనిలో పోలీసులు నిమగ్నమైతే మరోవైపు వరంగల్‌లో ఏకంగా ఓ ఏసీపీ మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని హల్‌చల్ చేశారని గుర్తుచేశారు. కేక్‌కట్ చేయడమే కాకుండా పటాకులు పేల్చడంతో రోడ్డుపై ఉన్న నలుగురు అమాయకులు గాయపడ్డారని, వారిని ఎంజీఎంకు తరలించారని తెలిపారు. మహబూబాబాద్‌లో మూడు రోజుల క్రితం గూండాల వేధింపులకు 17 ఏండ్ల బాలిక ఆత్మహత్యాయత్నం చేసిందని, మూడు రోజుల పాటు దవాఖానలో ప్రాణాలతో పోరాడిందని, తన సోదరులను మళ్లీ చూడలేనన్న బాధతో మరణానికి కొన్ని గంటల ముందు వారికి రాఖీ కట్టిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ హృదయ విదారక వీడియో ఇప్పుడు వైరల్‌గా మారిందని పేర్కొన్నారు. ఘటన జరిగి నాలుగు రోజులు గడిచినా పోలీసుల చర్యలు శూన్యమని కేటీఆర్ విమర్శించారు.

# సచివాలయం పరిసరాల్లో చెత్తను తొలగిస్తం

- చీఫ్ మినిస్టర్.. నా మాట గుర్తుంచుకో!
- రేవంత్‌రెడ్డి మానసిక అనారోగ్యం నుంచి కోలుకోవాలి: కేటీఆర్ ఫైర్
- రేవంత్‌రెడ్డి రాష్ట్రం పరువు తీస్తున్నడు
- పిల్లల ముందు వికృత మాటలు
- మేధావులూ మీరైనా చెప్పండి : దేశపతి
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై పంజాగుట్ట పీఎస్‌లో బీఆర్ఎస్ ఫిర్యాదు



పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న ముఠాగోపాల్, బాల్కసుమన్, దాసోజు, గెల్లు శ్రీనివాస్

హైదరాబాద్/ సిద్దిపేట, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : 'చీఫ్ మినిస్టర్.. నా మాట గుర్తుంచుకో.. మేము మళ్లీ అధికారంలోకి వచ్చిన రోజే సచివాలయం పరిసరాల్లో చెత్తా చెదారాన్ని తొలగిస్తాం.. మీలాంటి ఢిల్లీ గులాం తెలంగాణ ఆత్మగౌరవాన్ని అర్థం చేసుకుంటారని ఆశించలేం' అని ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కిగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దెప్పిపొడిచారు. 'బడి పిల్లల ముందు నీచమైన పదజాలాన్ని ఉపయోగించడం మీ నీచమైన ఆలోచనను సూచిస్తున్నది' అంటూ విమర్శించారు. 'మీరు మానసిక అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా' అంటూ ఎద్దేవాచేశారు.

### హోదాకు తగినట్టు మాట్లాడు: దేశపతి

రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు వికృతంగా ఉన్నదని, పిల్లల ముందు ఆయన మాట్లాడిన తీరు బాగాలేదని, ముఖ్యమంత్రి హోదాకు తగినట్టు మాట్లాడాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ చనిపోవాలని రేవంత్‌రెడ్డి కోరుకోవడం తప్పు అని, రేవంత్‌రెడ్డి తెలంగాణ పరువు తీస్తున్నాడని మండిపడ్డారు. మేధావులైనా ఆయనకు తెలిసేలా చెప్పాలని కోరారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లోని అమరజ్యోతి, సెక్రటేరియట్ మధ్యలో ఉన్న ఐలాండ్‌లో కేసీఆర్ విగ్రహం పెడుతామని ఎవరూ అనలేదని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మాత్రమే పెట్టాలని నిర్ణయించామని చెప్పారు. రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతామని సీఎం రేవంత్‌రెడ్డి అంటే మేధావులు, కవులు, కళాకారులు ఒత్తిడి తెచ్చారని, అందుకే ఆయన వెనక్కి తగ్గి సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు సభ్యసమాజం సహించని తీరుగా ఉందని మండిపడ్డారు. పుట్టిన గడ్డకు నమస్కరించని మూర్ఖుడు రేవంత్‌రెడ్డి అని, ఆయనకు పదవీ వ్యామోహం తప్ప.. ప్రజల కోసం పనిచేసే సోయి లేదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ఉద్యమంలో లేడని, తెలంగాణ ఆత్మలో అంతకంటే లేడని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న బీఆర్ఎస్ కార్యకర్తకు కూడా రేవంత్‌రెడ్డి సరిపోడని ఎద్దేవాచేశారు. తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లను తుడిపేయాలని కాంగ్రెస్ పార్టీ పగటి కలలు కంటున్నదని, తెలంగాణలో ఎక్కడచూసినా కేసీఆర్ ఆనవాళ్లు ఉన్నాయని గుర్తుచేశారు. అంబేద్కర్ విగ్రహంపై పువ్వు పెట్టే అవకాశం కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు.

### పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు

ఖైరతాబాద్: కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు ఖండించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దాసోజు శ్రవణ్ కుమార్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సోమాజిగూడలో జరిగిన రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న సీఎం ఉన్నతాధికారులు, విద్యార్థుల సమక్షంలో కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారని చెప్పారు. పదేండ్ల పాటు గౌరవప్రదంగా ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. కేసీఆర్ గౌరవాన్ని దెబ్బతీసేలా, అభ్యంతరకరంగా, హింసాత్మక ధోరణిలో మాట్లాడారని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదని, సీఎం రేవంత్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## వరంగల్ ఏసీపీకి షోకాజ్ నోటీసులు

**మంత్రి సురేఖ బర్త్‌డే వేడుకల్లో పాల్గొని చోద్యం చూసినందుకే..**

నమస్తే ఎఫెక్ట్

సుబేదారి, ఆగస్టు 20 : మంత్రి కొండా సురేఖ బర్త్ డే వేడుకల్లో పాల్గొని ప్రజలకు ఇబ్బందులకు గురిచేసిన ఏసీపీ నందిరాంనాయక్‌కు మంగళవారం షోకాజ్ నోటీస్ జారీ అయ్యింది. ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది సమక్షంలోనే మంత్రి అనుచరులు రాఖీ పండుగ రోజు రద్దీగా ఉన్న వరంగల్ కాశీబుగ్గ జంక్షన్ ప్రధాన రోడ్డును బ్లాక్ చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా రోడ్డుపై పటాకులు కాల్చడంతో నలుగురు గాయపడిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తీసుకువచ్చింది. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, ఏసీపీ నందిరాం నాయక్‌కు మంగళవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. 5రోజుల్లో జవాబు చెప్పాలని అందులో పేర్కొన్నట్టు తెలిసింది. ఈ విషయమై సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమాను సీపీ విచారణకు ఆదేశించారు.



హైదరాబాద్‌లో అంజన్‌కుమార్ నేతృత్వంలో జరిగిన యాదవ నేతల సమావేశం

# కాంగ్రెస్‌లో గొల్లకురుమల రణభేరి

- ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం లేదంటూ ఆగ్రహం
- అంజన్‌కుమార్‌యాదవ్ నేతృత్వంలో ప్రత్యేక భేటీ
- తమ వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఉద్ఘాటన
- పీసీసీ చీఫ్, మంత్రివర్గంలో స్థానం ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వంపై అధికార పార్టీకి చెందిన గొల్లకురుమ నాయకులు తిరుగుబాటు జెండా ఎగరేశారా? తమకు పదవులు దక్కకపోవడంపై ఆగ్రహంతో రగిలిపోతున్నారా? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన గొల్లకురుమ వర్గాలకు చెందిన పలువురు కీలక నేతలు మాజీ ఎంపీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ నేతృత్వంలో మంగళవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో పలువురు నేతలు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వంలో గొల్ల కురుమలకు ప్రాధాన్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చిన గొల్ల కురుమలకు ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. రాజకీయంగా బీసీలకు రావాల్సిన వాటా రావడం లేదని, ఈ సమయంలో బీసీలంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వంలో గొల్ల కురుమలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. తమ కులం వారికి టీపీసీసీ అధ్యక్ష పదవితో పాటు మంత్రివర్గ విస్తరణలో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు 6 కార్పొరేషన్ చైర్మన్ పదవులు, 5 కమిషన్ మెంబర్లు ఇవ్వాలని కోరారు. ఇంకా రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో తోటకూర జంగయ్య యాదవ్, చరణ్‌కౌశిక్ యాదవ్, గౌరీసతీశ్, లోకేశ్ యాదవ్, రాజేశ్, గడ్డం శేఖర్ యాదవ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, సాధని భూమన్న యాదవ్, కల్పన, మధుకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డీ..నోరు అదుపులో పెట్టుకో!

**బీఆర్ఎస్ నేత తుంగబాలు**

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని బీఆర్ఎస్ నేత తుంగబాలు సూచించారు. సీఎం హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి హుందాగా వ్యవహరించాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తన సామర్థ్యం తెలుసుకోలేనివాడు తనని నాయకుడిగా భావించే వారందరినీ నాశనం చేస్తాడని, రేవంత్‌రెడ్డి తీరు కూడా అలాగే ఉందని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుకు కారణమైన అంబేద్కర్ పేరును కొత్త సచివాలయానికి పెట్టిన చరిత్ర కేసీఆర్‌ది అని, దేశానికి భారతమాత ఎలాగో రాష్ట్రానికి తెలంగాణతల్లి అలాగని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం కాకుండా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సచివాలయానికి ఎదురుగా పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి అహంకారమే ఆయన పతనానికి కారణమని పేర్కొన్నారు.

## సచివాలయ విగ్రహంపై బీజేపీ వైఖరేమిటి?

**బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి డిమాండ్**

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై బీజేపీ తన వైఖరిని స్పష్టం చేయాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ప్రకటనలో డిమాండ్ చేశారు. సెక్రటేరియట్ ముందు కేసీఆర్ ప్రతిపాదించిన తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలా? రేవంత్‌రెడ్డి ప్రతిపాదించిన రాజీవ్‌గాంధీ విగ్రహం ఉండాలా? అనే దానిపై కేంద్రమంత్రులైన కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ తీరు చూస్తుంటే రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నదనే అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు. తెలంగాణను, తెలంగాణతల్లిని అవమానించేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని వై సతీశ్‌రెడ్డి ఆరోపించారు.

# రేవంత్ నోట బజారు భాష

- స్కూల్ పిల్లల ముందు బూతు పురాణం
- సీఎం స్థాయి మరచి... చిల్లర మాటలు
- వ్యక్తులను కించపరిచేలా నీచపు మాటలు
- సీఎం తీరుపై మేధావుల మండిపాటు

హైదరాబాద్, ఆగస్టు 20(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డికి ఎక్కడ, ఎవరి ముందు ఏం మాట్లాడాలనే సోయి కూడా ఉండడం లేదు. స్కూల్ పిల్లల ముందు బజారు భాష మాట్లాడుతున్నారు. తాను సీఎంననే ఇంగితం మరచి రోత మాటలు మాట్లాడుతున్నారు. అది కూడా పలకలేని, పత్రికలో రాయలేని భాషను మాట్లాడుతుండడం గమనార్హం. మంగళవారం సోమాజీగూడ చౌరస్తాలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి.. వందలమంది స్కూలు పిల్లల ముందు మాట్లాడుతూ బూతు పురాణం అందుకున్నారు. తాగుబోతులు, సన్నాసులు, వాడు, వీడు, అయ్య.. అంటూ నోటికొచ్చినట్టు మాట్లాడారు. పిల్లల ఎదుట సీఎం ఇలా మాట్లాడడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

### ఏ కార్యక్రమం.. ఏం మాట్లాడారు?

మంగళవారం జరిగింది మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి. అక్కడ మాట్లాడాల్సింది ఆయన గురించి.. దేశానికి ఆయన అందించిన సేవల గురించి. కార్యక్రమానికి హాజరైన బడిపిల్లలకు రాజీవ్ గొప్పతనం గురించి చెబుతూ వారిలో స్ఫూర్తి రగిలించాల్సిన సీఎం సమయం సందర్భం లేకుండా మాట్లాడారు. ప్రాణాలు పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ ప్రజల దశాబ్దాల కల నెరవేర్చిన కేసీఆర్ లక్ష్యంగా చేసుకున్నారు. పదేండ్లపాటు రాష్ట్రాన్ని పాలించి అభివృద్ధిలో పరుగులు పెట్టించిన నేత చావు కోరేలా మాట్లాడారు. సచివాలయం ఎదుట కేసీఆర్ విగ్రహం పెడదామనుకున్నారంటూ.. రాయలేని, చెప్పలేని భాషలో మాట్లాడారు. సెక్రటేరియట్ వద్ద ఆయన విగ్రహం పెట్టి సమాజానికి ఏం సందేశమివ్వాలనుకుంటున్నారని కూడా సీఎం ప్రశ్నించారు.

### అసలు కేటీఆర్ ఏమన్నారు?

సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాల్సిన ప్రతిపాదిత ప్రదేశంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనిని బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఆ పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. తెలంగాణకు ఏమాత్రం సంబంధం లేని ఆయన విగ్రహాన్ని ఎలా పెడతారని, తాము అధికారంలోకి వచ్చాక ఆ విగ్రహాన్ని తొలగించడంతోపాటు శంషాబాద్ విమానాశ్రయానికి ఉన్న రాజీవ్ పేరును కూడా తొలగిస్తామని హెచ్చరించారు. అంతేకాదు, రాజీవ్, ఇందిర పేర్లతో ఉన్న ఇతర పథకాల పేర్లను కూడా మారుస్తామని చెప్పారు. నిజానికి సచివాలయం ఎదురుగా అంబేద్కర్, అమరవీరుల స్థూపం ఒక క్రమ పద్ధతిలో ఉన్నాయి. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం పెడితే తెలంగాణ పోరాటానికి అర్థవంతంగా ఉంటుందనేది కేటీఆర్ భావన. తెలంగాణతో ఏమాత్రం సంబంధం లేని రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు సబబు కాదన్నది కేటీఆర్ వాదన. అక్కడ రాజీవ్ విగ్రహం ఏర్పాటు చేసి ఆయన జయంతి నాడు రాహుల్‌గాంధీని పిలిచి ఆవిష్కరించి అధిష్ఠానం వద్ద మార్కులు కొట్టేయాలని, తద్వారా పడిపోతున్న గ్రాఫ్‌ను నిలబెట్టుకోవాలని రేవంత్ భావించారు. తెలంగాణ సమాజం నుంచి దీనిపై వ్యతిరేకత వ్యక్తం కావడంతో ప్రస్తుతానికి అలాంటి పనిలేకుండానే, రాహుల్‌ను పిలవకుండానే రాజీవ్ జయంతిని నిర్వహించాల్సి వచ్చింది. ఇది రేవంత్‌లో ఫ్రస్ట్రేషన్‌కు కారణమైంది. అదే మరింత పెరిగి నోటి వెంట బూతులు రావడానికి కారణమైందని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, నిరసనలతో వెనక్కి తగ్గిన సీఎం ఆ తర్వాత సచివాలయంలో సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. అందుకు తగిన స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.

## సభ ఏదైనా.. బూతు పురాణమే

సీఎం రేవంత్‌రెడ్డి బూతులు మాట్లాడడం ఇదే తొలిసారి కాదు. సీఎం కాకముందు కూడా ఆయన మాటలు ఇలానే ఉండేవి. రాజకీయ సభ అయినా, ప్రభుత్వ సభ అయినా, అక్కడ మహిళలు ఉన్నా, పిల్లలు ఉన్నా ఆయన భాష మాత్రం మారడం లేదు. రేవంత్‌రెడ్డి తీవ్ర అసహనంతోనే ఇలాంటి భాషను వాడుతున్నట్టు రాజకీయ, మేధావి వర్గాల్లో చర్చ జరుగుతున్నది. పార్టీలో లుకలుకలు, ప్రభుత్వంలో పూర్తిగా పట్టు సాధించలేకపోవడం వల్లే ఆయన ఇలా వ్యవహరిస్తున్నట్టు చెప్తున్నారు. మేధావులు సైతం సీఎం తీరుపై మండిపడుతున్నారు. గౌరవప్రదమైన స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వ్యాఖ్యలపై సోషల్ మీడియాలోనూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన మాట్లాడిన వీడియోను షేర్ చేస్తూ ట్రోల్ చేస్తున్నారు. రేవంత్ తాను ముఖ్యమంత్రినన్న విషయాన్ని గుర్తించుకుని మాట్లాడాలని హితవు పలుకుతున్నారు.

# సచివాలయంలో తెలంగాణ తల్లి

> మొదటిపేజీ తరువాయి...

విగ్రహం ఉన్నచోట తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని, తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు అదే అసలైన ప్రతీక అవుతుందని గతంలో కేసీఆర్ సర్కార్ నిర్ణయం తీసుకున్నది. అయితే ఆ ప్రతిపాదిత స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని బీఆర్ఎస్ పార్టీ ఆక్షేపించింది. తెలంగాణ తల్లి విగ్రహం మినహా మరేది అక్కడ ఏర్పాటు చేసినా ఊరుకునేది లేదని హెచ్చరించింది. తెలంగాణ మేధో సమాజం కూడా సర్కార్ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ ప్రతీకలో ప్రధానమైన తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు విషయంలో రేవంత్‌రెడ్డి ప్రజాభీష్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మేధావులు, కవులు, కళాకారులు, పాత్రికేయులు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి లేఖ రాశారు. ప్రధానప్రతిపక్షమే కాకుండా రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా బీఆర్ఎస్ పార్టీ నుంచి వస్తున్న వ్యతిరేకత, మరోవైపు తెలంగాణ బుద్ధిజీవుల నుంచి వస్తున్న విమర్శల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మంగళవారం రేవంత్‌రెడ్డి నష్టనివారణ చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటిదాకా 'జై తెలంగాణ' అనని, తెలంగాణ తల్లిని తలవని రేవంత్‌రెడ్డికి తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు ఆగమేఘాలపై ఒకటికి రెండుసార్లు సచివాలయంలో స్థల పరిశీలన చేశారు.

### అల్టిమేటం జారీ చేసిన 24 గంటల్లోనే

తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు విషయంలో ప్రభుత్వానికి బీఆర్ఎస్ అల్టిమేటం జారీచేసిన 24 గంటల్లోనే రేవంత్ సర్కారు దిగొచ్చింది. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయ ప్రాంగణాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి వేర్వేరుగా రెండుసార్లు స్థల పరిశీలన చేశారు. రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తొలిరోజుల్లోనే జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ విభాగం మాజీ ప్రొఫెసర్ నేతృత్వంలో కమిటీ వేశారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా విగ్రహ ఏర్పాటు ఊసేలేదు. ఇపుడు బీఆర్ఎస్ హెచ్చరికల నేపథ్యంలో సర్కారులో చలనం వచ్చింది.



పెద్దపల్లిలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

# కులగణనా.. సీఎం కుర్చీ ఖాళీనా?

- ఇదే నినాదంతో బీసీ ఉద్యమం
- రేపు అఖిలపక్ష భేటీ, 26న కలెక్టరేట్ల ముట్టడి
- వచ్చే నెల 9న కులగణన మార్చ్
- కామారెడ్డి డిక్లరేషన్‌ను నెరవేర్చాల్సిందే..
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల డిమాండ్

పెద్దపల్లి, ఆగస్టు 20: కాంగ్రెస్ ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని నిలబెట్టుకొని, వెంటనే సమగ్ర కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దపల్లిలోని ఎంబీ గార్డెన్‌లో బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అధ్యక్షతన బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. 'సమగ్ర కుల గణన చేపట్టాలి లేదా సీఎం రేవంత్‌రెడ్డి కుర్చీ అయినా ఖాళీ చేయాలి' అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 'స్వాతంత్ర్యం వచ్చి 78 ఏండ్లయినా రాష్ట్రంలో బీసీ బిడ్డ ముఖ్యమంత్రి అయిండా? అని ప్రశ్నించారు. ఓట్లు బీసీలవీ, సీట్లు అగ్రవర్ణాలవా?, ఎందుకీ వివక్ష?, బీసీలకు రాజ్యాధికారం వద్దా?, ఇంకెన్నాళ్లీ కష్టాలు, కన్నీళ్లు, బానిస బతుకులు, ఇకనైనా తెగబడుదాం.. కలబడుదాం.. నిలబడుదాం, ఐక్యతతో పోరాటాలు చేస్తూ రాజ్యాధికారం చేపట్టే దిశగా అడుగులు వేద్దామని' పిలుపునిచ్చారు. అధికారంలో వచ్చిన ఆరు నెలల్లో సమగ్ర కులగణన చేపడుతామని నమ్మించి, బీసీ ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం, తొమ్మిది నెలలైనా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయడం లేదని విమర్శించారు. భావితరాల కోసమైనా సమగ్ర కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో అఖిలపక్ష సమావేశం, 26న కలెక్టరేట్ల ముట్టడి, వచ్చే నెల 9న కుల గణన మార్చ్ నిర్వహిస్తామని వెల్లడించారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఫోన్‌ట్యాపింగ్ చేయొచ్చు

**హైకోర్టుకు నివేదించిన కేంద్రహోం శాఖ**

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఫోన్ల ట్యాపింగ్ చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఉన్నదని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ హైకోర్టుకు నివేదించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఫోన్ ట్యాపింగ్ చేసేందుకు తమ అనుమతి అవసరంలేదని తెలిపింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై పోలీసులు దాఖలు చేసిన కౌంటర్ పిటిషన్లలో కేంద్ర ప్రభుత్వ ప్రస్తావన లేదని గుర్తుచేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర ప్రభుత్వ ప్రస్తావన లేదని, కనీసం తమకు సమాచారం కూడా ఇవ్వలేదని పేర్కొంది. గత పాలనలో రాజకీయ ప్రత్యర్థులు, ప్రైవేటు వ్యక్తులతో పాటు హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్టుగా పత్రికల్లో వచ్చిన వార్తలను సుమోటోగా పరిగణించి హైకోర్టు విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ టీ వినోద్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం మరోసారి విచారించింది. కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ వాదనలు వినిపించారు. 'కేంద్ర టెలికమ్యూనికేషన్ చట్టం-23 జూన్ 2021 నుంచి అమల్లోకి వచ్చింది. దీనికి సంబంధించిన నిబంధనల రూపకల్పన జరగలేదు. కాబట్టి ప్రస్తుతం టెలిగ్రాఫ్ నిబంధనలే అమల్లో ఉన్నాయి. కొత్త చట్టం ప్రకారం అనుమతి లేకుండా చట్టవిరుద్ధంగా ట్యాపింగ్‌కు పాల్పడితే మూడేండ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.2 కోట్ల జరిమానా లేదా రెండూ కలిపి విధించవచ్చు. ఏ పరిస్థితుల్లో ఫోన్ ట్యాపింగ్ చేయవచ్చో టెలిగ్రాఫిక్ చట్ట నిబంధనల్లో ఉంది. దీని ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హోంశాఖ కార్యదర్శులు ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలు జారీచేయవచ్చు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక అధికారాలు ఉన్నాయి. ట్యాపింగ్ ఎందుకు చేయాల్సి వస్తున్నదో కారణాలు రికార్డుల్లో నమోదు చేయాలి. ఈ ఉత్తర్వులను సమీక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేర్వేరుగా రివ్యూ కమిటీలు ఉంటాయి. ఈ కమిటీ వాటిని ధ్రువీకరించాలి. ట్యాపింగ్ ఉత్తర్వులు 60 రోజుల వరకు అమల్లో ఉంటాయి. ఆ తర్వాత మళ్లీ పొడిగించేందుకు వెసులుబాటు ఉంది. గరిష్ఠంగా 180 రోజుల వరకు అనుమతి ఉంటుంది. వీటికి చెందిన రికార్డులను ఆరు మాసాల్లో ధ్వంసం చేయవచ్చు' అని కేంద్రం కౌంటర్ పిటిషన్‌లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారమే కౌంటర్ దాఖలు చేసినట్టు చెప్పింది. దీంతో తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా పడింది.

# నిబంధనల ప్రకారమే ఎల్ఆర్ఎస్

- స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు పర్యవేక్షణ బాధ్యత
- పదిరోజుల్లో ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి
- భారీ వర్షాలతో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పొంగులేటి



హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): లే అవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్)ను పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌కు బాధ్యత అప్పగించాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం సీఎస్ శాంతికుమారితో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అక్రమాలకు తావులేకుండా నిబంధనల ప్రకారమే భూముల క్రమబద్ధీకరణ జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో అవసరమైన ధ్రువపత్రాలు ఇవ్వని వారి నుంచి ఇప్పుడు తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టు కింద ప్రతి జిల్లాలో మొదటి దశలో వంద ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకురాబోతున్న నూతన రెవెన్యూ చట్టం 2024పై 23, 24 తేదీల్లో జిల్లాల్లో వివిధ రంగాల మేధావులతో వర్క్ షాప్ నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ధరణిలో పెండింగ్ దరఖాస్తులను పదిరోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు.

### ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వానికి నోటీసులు

ఎల్ఆర్ఎస్‌కు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రేవంత్‌రెడ్డి సర్కారును ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శికి వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం మంగళవారం నోటీసులు జారీ చేసింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

# హైడ్రా హద్దు ఎక్కడికి?

> మొదటిపేజీ తరువాయి...

పరిధి అని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఈ పరిధిని పెంచడంగానీ, తగ్గించడంగానీ చేసే అవకాశం ఉందని కూడా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక రంగంలోకి దిగిన హైడ్రా గత నెల రోజులుగా అక్రమ నిర్మాణాలు, చెరువుల కబ్జాపై ఉక్కుపాదం మోపుతున్నది. దీనిపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతున్నది. ఆక్రమణల విషయంలో ఎవరినీ ఉపేక్షించేదిలేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రతి సందర్భంలోనూ ప్రకటిస్తున్నారు. కొన్నిరోజుల కిందట ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నియోజకవర్గంలో ఒక పార్కు స్థలానికి సంబంధించి చోటుచేసుకున్న వివాదంలోనూ రంగనాథ్ ఢీ అంటే ఢీ అనే స్థాయిలో నిక్కచ్చిగా అడుగులు వేశారు. ఈ విషయంలో సీఎం నుంచి కూడా ఆయనకు మద్దతు లభించినట్టు వార్తలు వచ్చాయి. అయితే మొన్నటివరకు హైడ్రా ఔటర్ పరిధిలోనే ఈ కూల్చివేతల్ని చేపట్టింది. కాగా ఈ నెల 18న హైడ్రా యంత్రాంగం చేపట్టిన కూల్చివేతలతో అసలు దాని పరిధి ఎంతవరకు? అనే సందేహాలు మొదలయ్యాయి.

### ఔటర్ దాటి పంచాయతీల్లో కూల్చివేతలు

18న గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఆక్రమణల్ని హైడ్రా కూల్చివేసింది. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో రెండు భారీ నిర్మాణాలను నేలమట్టం చేసింది. వాస్తవానికి ఖానాపూర్ ఓఆర్ఆర్‌కు అవతల ఉంటుంది. కానీ ఆ గ్రామం ఓఆర్ఆర్‌కు ఇవతల ఉన్న నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోకి వస్తుంది. అదేరోజు హైడ్రా యంత్రాంగం అప్పోజీగూడ గ్రామపంచాయతీ పరిధిలో మూడు, హిమాయత్‌నగర్, చిలుకూరు గ్రామపంచాయతీ పరిధిల్లో ఒకటి చొప్పున భారీ నిర్మాణాలను కూల్చివేసింది. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన పరిధి ప్రకారం కాకుండా హైడ్రా ఓఆర్ఆర్ అవతల కూడా అక్రమ నిర్మాణాలు, చెరువుల కబ్జాపై ఉక్కుపాదం మోపుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

### నార్సింగి వరకు హైడ్రా పరిధి

హైడ్రా పరిధిపై కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. ఓఆర్ఆర్ వరకు మాత్రమే హైడ్రా పరిధి అని స్పష్టంచేశారు. గండిపేట ఎఫ్‌టీఎల్ కూల్చివేతలను ప్రస్తావించినపుడు నార్సింగి మున్సిపాలిటీ ఔటర్ లోపల ఉన్నందున దాని పరిధి ఎంతవరకు ఉంటే అంతవరకు హైడ్రాలోకి వస్తుందని తెలిపారు. అయితే ఓఆర్ఆర్ అవతల ఉన్న మరో మూడు గ్రామపంచాయతీ పరిధుల్లోనూ హైడ్రా కూల్చివేతలు చేపట్టడంపైనే అయోమయం నెలకొంది. ఓఆర్ఆర్ నుంచి హిమాయత్‌నగర్ సుమారు ఏడెనిమిది కిలోమీటర్లు, చిలుకూరు పది కిలోమీటర్లు, అప్పోజిగూడ 15 కిలోమీటర్ల దూరం ఉంటాయి. అంటే ఓఆర్ఆర్ అవతల 15 కిలోమీటర్ల వరకు హైడ్రా వెళ్లింది. దీంతో అవుటర్ దాటిన తర్వాత కూడా హైడ్రా పరిధి వస్తుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జీవోలో పేర్కొన్నట్టు ప్రభుత్వం దాని పరిధిని పెంచొచ్చు, తగ్గించొచ్చు.. కానీ పెంచుతున్నట్టు ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు.

### హైడ్రాకు ప్రజల నుంచి ఫిర్యాదులు

హైదరాబాద్ మహానగరంలో ప్రభుత్వ భూములను కాపాడుతూ కబ్జాలకు గురవుతున్న చెరువులు, కుంటలకు ప్రాణం పోసేందుకు హైడ్రా తనవంతు పాత్ర పోషిస్తుందని ఏవీ రంగనాథ్ వెల్లడించారు. హైడ్రాకు ప్రజల నుంచి స్వచ్ఛందంగా రోజూ 30 నుంచి 40 ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. గండిపేట చెరువును కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలపై, ఇతర ప్రాంతాలలోని అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తున్నామని, 40 వరకు చిన్న, పెద్ద అక్రమ కట్టడాలను కూల్చేశామని తెలిపారు. కొందరు నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తుండగా మరికొందరు ఫేస్‌బుక్, వాట్సాప్‌లో ఫిర్యాదులు చేస్తున్నారని చెప్పారు. ఆ ఫిర్యాదులను విశ్లేషించి అధికారులతో మాట్లాడుతూ తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. హైడ్రాకు ఇంకా సిబ్బందిని నియమించలేదని, రెండు నెలల్లో ఆ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. కబ్జాల కారణంగా అనేక ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచిపోతున్నదని, దీంతో ట్రాఫిక్ స్తంభిస్తున్నదని అన్నారు.



బద్లాపూర్ రైల్వే స్టేషన్‌లో పట్టాలపై ఆందోళన చేస్తున్న నిరసనకారులు

# నర్సరీ పిల్లలపై లైంగిక వేధింపులు

- మహారాష్ట్రలోని ఓ స్కూల్‌లో స్వీపర్ ఘాతుకం
- తల్లిదండ్రులు, స్థానికుల్లో వెల్లువెత్తిన ఆగ్రహం
- పాఠశాల, బద్లాపూర్ రైల్వే స్టేషన్‌పై దాడి
- గంటల తరబడి రైల్ రోకో.. 30 రైళ్లు రద్దు

థాణె/ముంబై, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): నర్సరీ చదువుతున్న ఇద్దరు చిన్నారులపై ఓ కీచకుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. మహారాష్ట్రలోని థాణే జిల్లా బద్లాపూర్‌లో జరిగిన ఈ ఘటనపై ప్రజల్లో ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. నిర్లక్ష్యం వహించిన పాఠశాలతో పాటు, బద్లాపూర్ రైల్వే స్టేషన్‌పై స్థానికులు, తల్లిదండ్రులు దాడి చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గంటల తరబడి రైల్ రోకో నిర్వహించారు. తల్లిదండ్రుల కథనం ప్రకారం.. బద్లాపూర్‌లోని ఓ పాఠశాలలో నర్సరీ చదువుతున్న ఇద్దరు చిన్నారులు(మూడేండ్లు, నాలుగేండ్ల వయస్సు) ఆగస్టు 13న టాయిలెట్‌కు వెళ్లగా, అక్కడే స్వీపర్‌గా పని చేస్తున్న అక్షయ్ షిండే అనే వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆగస్టు 16న వీరిలో ఓ చిన్నారి తనకు ప్రైవేటు భాగాల వద్ద నొప్పిగా ఉందని తల్లిదండ్రులకు ఏడుస్తూ చెప్పింది. దాంతో ఆరా తీయగా, మరో చిన్నారికి కూడా అలా జరిగిందని తెలియడంతో ఇద్దరు చిన్నారులను స్థానిక దవాఖానకు తీసుకెళ్లగా వారిపై లైంగిక వేధింపులు జరిగాయని వైద్యులు చెప్పారు. దీంతోపోలీసులకు ఫిర్యాదు చేయగా ఆగస్టు 17న నిందితుడు అక్షయ్ షిండేను అరెస్టు చేశారు.

**ప్రజల్లో ఆగ్రహజ్వాలలు**

చిన్నారులపై లైంగిక వేధింపులకు ఒడిగట్టిన కీచకుడిపై, పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం ఉదయం తల్లిదండ్రులు, స్థానికులు పాఠశాల వద్ద నిరసన తెలిపారు. కొందరు ఆగ్రహంతో పాఠశాలపై దాడికి పాల్పడి వస్తువులు ధ్వంసం చేశారు. తర్వాత పక్కనే ఉన్న బద్లాపూర్ రైల్వే స్టేషన్‌పైనా రాళ్లు రువ్వారు. స్టేషన్‌లోకి ప్రవేశించి పట్టాలపై కూర్చొని రైల్ రోకో నిర్వహించారు. దీంతో 30 లోకల్ రైళ్లు రద్దయ్యాయి. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన 12 రైళ్లను దారి మళ్లించారు. చాలా రైళ్లు ఆలస్యమయ్యాయి. కేసులో పోలీసుల నిర్లక్ష్యంపై ఆరోపణలు రావడంతో బద్లాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఎస్సై, హెడ్ కానిస్టేబుల్‌ను వెంటనే సస్పెండ్ చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్, క్లాస్ టీచర్‌తో పాటు ఓ మహిళా సహాయకురాలిని విధుల నుంచి తొలగించినట్టు పాఠశాల యాజమాన్యం ప్రకటించింది.

**విచారణ జరపనున్న ఎన్‌సీపీసీఆర్, సిట్**

బద్లాపూర్ ఘటనపై బాలల హక్కుల రక్షణ జాతీయ కమిషన్(ఎన్‌సీపీసీఆర్) స్పందించింది. కేసులో పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఎన్‌సీపీసీఆర్ చైర్‌పర్సన్ ప్రియాంక్ కనుంగో తెలిపారు. దీనిపై విచారణ జరిపేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఐజీ స్థాయి అధికారి ఆర్తి సింగ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను నియమించింది. కేసును ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో విచారణ జరిపించి, న్యాయం జరిగేలా చూస్తామని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తెలిపారు. కాగా, ఈ పాఠశాల బీజేపీకి చెందిన వ్యక్తిదని తనకు తెలిసిందని, అయినా రాజకీయాలు చేయదల్చుకోలేదని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని శివసేన(ఉద్ధవ్) అధినేత ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు.

# ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యమెందుకు?

## హత్యాచారం జరిగిన రోజు రాత్రి వరకు ఎందుకు నమోదు చేయలేదు?

- అసలు కాలేజీ ప్రిన్సిపాల్ ఏం చేస్తున్నారు?
- ఆత్మహత్య అని ముందు ఎందుకు చెప్పారు?
- ట్రైనీ డాక్టర్ హత్యాచారంపై పోలీసులు, ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ప్రశ్నల వర్షం
- ఆందోళనలపై అధికారం చెలాయించొద్దు
- శాంతి భద్రతల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే
- క్షేత్రస్థాయిలో మార్పులకు మరో అత్యాచారం, హత్యనో జరిగే వరకు వేచి చూడొద్దని వ్యాఖ్య
- వైద్య సిబ్బంది భద్రతపై జాతీయ ప్రొటోకాల్ రూపకల్పనకు 10 మంది సభ్యులతో కమిటీ
- వెంటనే విధుల్లో చేరాలని వైద్యులకు సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 20: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనను సుమోటోగా తీసుకొన్న సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పశ్చిమబెంగాల్ ప్రభుత్వం, కోల్‌కతా పోలీసులు, ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్‌కు ప్రశ్నల వర్షం కురిపించింది. ట్రైనీ డాక్టర్ హత్యాచారాన్ని భయానక ఘటనగా పేర్కొన్న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో అంత ఆలస్యం ఎందుకు జరిగిందని రాష్ట్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించింది. 'పోస్టుమార్టం పూర్తయిన తర్వాత, మృతదేహాన్ని అంత్యక్రియలకు అప్పగించిన తర్వాత రాత్రి సమయంలో ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయాల్సి వచ్చింది? కోల్‌కతా పోలీసులు, దవాఖాన అధికారులు అప్పటి వరకు ఏం చేస్తున్నారు? కూతురి మృతదేహాన్ని చూపించేందుకు తల్లిదండ్రులు గంటలపాటు వేచిచూసేలా ఎందుకు చేశారు?' అని ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది.

**పోలీసులు ఏం చేస్తున్నారు?**

ప్రభుత్వ దవాఖానపై వందల మంది దుండగులు దాడి చేయడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విధ్వంసకారులపై తీసుకొన్న చర్యలపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దవాఖానపై జరిగిన మూకదాడి, ఘటనా స్థలి నుంచి పోలీసులు పారిపోయారన్న ఆరోపణలను న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. క్రైమ్ సీన్ ఉన్న దవాఖానపై దాడి, విధ్వంసం జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారు? అని ప్రశ్నించింది. వైద్యులు విధుల్లోకి తిరిగి వెళ్లేలా దవాఖాన వద్ద సీఐఎస్ఎఫ్ బలగాలను మోహరించాలని ఆదేశించింది. అదేవిధంగా కేసు దర్యాప్తులో పురోగతిపై స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని సీబీఐని ఆదేశించింది.

**ఆందోళనలపై సున్నితంగా వ్యవహరించాలి**

హత్యాచార ఘటనను నిరసిస్తూ శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న వారిపై అధికారం చెలాయించొద్దని, దేశమంతా ఆందోళన వ్యక్తం చేస్తున్న ఈ తరుణంలో సున్నితంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా న్యాయస్థానం ప్రభుత్వానికి సూచించింది. 'డాక్టర్లు, పౌర సమాజాన్ని అడ్డుకోవడం సరికాదు. క్రైమ్ సీన్‌ను రక్షించాల్సిన, శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే' అని స్పష్టం చేసింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఈనెల 22కు వాయిదా వేసింది.

**ప్రిన్సిపాల్‌కు ప్రశ్నల వర్షం**

కేసు విచారణ సందర్భంగా కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ వ్యవహారశైలిని కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. కేసును ఆత్మహత్యగా చెప్పేందుకు ప్రయత్నించారని, కుమార్తె మృతదేహాన్ని చూడనీయకుండా బాధిత తల్లిదండ్రులను గంటల పాటు వేచి చూసేలా చేశారని విమర్శించింది. 'ప్రిన్సిపాల్ ఏం చేస్తున్నారు? మొదట ఆత్మహత్యగా చెప్పే ప్రయత్నం చేయడంతో పాటు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఎందుకు నిష్క్రియతో ఉన్నారు? మృతదేహాన్ని కూడా అంత్యక్రియల కోసం ఆమె తల్లిదండ్రులకు రాత్రి సమయంలో అప్పగించారు' అని అసహనం వ్యక్తం చేసింది. ప్రిన్సిపాల్‌పై దర్యాప్తు జరుగుతుండగానే రాజీనామా తర్వాత అయన్ను వెంటనే మరో కాలేజీకి ఎలా నియమిస్తారు? అని ప్రశ్నించింది.

**పోలీసులు తగిన చర్యలు తీసుకొన్నారు: సిబల్**

కోర్టు పరిశీలనలను పశ్చిమబెంగాల్ ప్రభుత్వ తరపు న్యాయవాది కపిల్ సిబల్ తిరస్కరించారు. కోల్‌కతా పోలీసులు తగిన చర్యలు





తీసుకొన్నారని, వాస్తవాలను తాను కోర్టు ముందు ఉంచుతానని వాదించారు. పోలీసులు క్రైమ్ సీన్‌కు చేరుకోకముందే ఫొటోలు, వీడియోలు సర్క్యులేట్ అయ్యాయన్నారు. ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు వెంటనే అసహజ మృతిగా రిజిస్టర్ చేశారని వెల్లడించారు. పోలీసులు వెంటనే నిందితుడ్ని అరెస్టు చేశారని తెలిపారు.

**ఫొటోలు, వీడియోలు వెంటనే తొలగించండి**

బాధిత ట్రైనీ డాక్టర్ పేరు, ఫొటోలు, వీడియోలను అన్ని సోషల్ మీడియా వేదికల నుంచి వెంటనే తొలగించాలని సీజేఐ ధర్మాసనం ఆదేశించింది. లైంగిక దాడి బాధితురాలి గుర్తింపును బయటపెట్టడం నిపున్ సక్సేనా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్నది. ఈ మేరకు లాయర్ కిన్నోరి, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ ఆదేశాలు ఇచ్చింది.

### మాపై విశ్వాసం ఉంచి.. విధుల్లో చేరండి

'మాపై విశ్వాసం ఉంచి, వెంటనే విధుల్లో చేరండి' అని కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న వైద్యులకు సుప్రీంకోర్టు సూచించింది. సమ్మె విరమించి, విధులకు హాజరు కావాలని కోరింది. వైద్యులు విధులకు దూరంగా ఉండటం వలన ఆరోగ్య రక్షణ అవసరమైన సమాజంపై ప్రభావం పడుతుందని పేర్కొన్నది. వైద్య సిబ్బందికి భద్రత, రక్షణ కల్పించేందుకు తాము ఇక్కడ ఉన్నామని స్పష్టం చేసింది. వైద్య సిబ్బందికి భద్రత కల్పించే అంశంపై కోర్టు జోక్యం చేసుకోవడాన్ని ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ స్వాగతించింది. దేశవ్యాప్తంగా విధులకు దూరంగా ఉన్న వైద్యులను వెంటనే విధులను కొనసాగించాలని కోరుతామని పేర్కొన్నది.

### సురక్షిత పని పరిస్థితులు లేకపోవడంపై ఆందోళన

దేశవ్యాప్తంగా ప్రధానంగా ప్రభుత్వ దవాఖానల్లో సురక్షిత పని పరిస్థితులు లేకపోవడంపై బెంచ్ ఆందోళన వ్యక్తం చేసింది. పలు చోట్ల వైద్యులపై దాడులు జరుగుతున్న అంశాన్ని ప్రస్తావించిన కోర్టు.. ఇవి వైద్య సిబ్బందికి రక్షణ కల్పించడంలో నిర్మాణాత్మక వైఫల్యానికి ఉదాహరణలు అని పేర్కొన్నది. చాలా మంది యువ వైద్యులు వరుసగా 36 గంటల పాటు పనిచేస్తున్నారని, వారికి డ్యూటీ రూమ్‌లు లేకపోవడాన్ని గుర్తించామని, అదేవిధంగా పురుష, స్త్రీ డాక్టర్లు, నర్సులకు వేర్వేరు రెస్ట్‌రూమ్‌లు లేవని పేర్కొన్నది. ఒక మహిళ తన పని ప్రదేశానికి సురక్షితంగా వెళ్లలేకుంటే, మనం సమానత్వాన్ని నిరాకరిస్తున్నట్టేనని కోర్టు అభిప్రాయపడింది. క్షేత్రస్థాయిలో మార్పులు జరిగేందుకు మరో అత్యాచారమో లేదా హత్యనో జరిగేంత వరకు వేచి చూడొద్దు అని పేర్కొన్నది. దీని కోసం పని ప్రదేశాల్లో వైద్యులు, ఇతర వైద్య సిబ్బందికి భద్రత కల్పించేందుకు ఒక జాతీయ ప్రొటోకాల్‌ను రూపొందించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడిన సుప్రీంకోర్టు.. అందుకు సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్తి శరన్ నేతృత్వంలో 10 మంది సభ్యులతో కూడిన ఒక నేషనల్ టాస్క్‌ఫోర్స్(ఎన్‌టీఎఫ్)ను ఏర్పాటు చేసింది. మూడు వారాల్లో మధ్యంతర నివేదిక ఇవ్వాలని సూచించింది.

### బాలికలు కోరికలు అణచుకోవాలన్న తీర్పు కొట్టివేత

**నిందితుడికి శిక్ష పునరుద్ధరణ**

న్యూఢిల్లీ, ఆగస్టు 20: కౌమార బాలికలు తమ లైంగిక వాంఛలను నియంత్రించుకోవాలని సూచిస్తూ కలకత్తా హైకోర్టు గత ఏడాది ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. ఆ కేసులో నిందితుడికి విధించిన శిక్షను పునరుద్ధరిస్తున్నట్టు వెల్లడించింది. ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి కింది కోర్టు 20 ఏండ్ల జైలు శిక్ష విధించింది. దీనిపై నిందితుడు దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు... అతన్ని నిర్దోషిగా విడుదల చేస్తూ గత ఏడాది అక్టోబర్ 18న తీర్పు ఇచ్చింది. బాలిక అతడితో ఇష్టపూర్వకంగా సాన్నిహిత్యం కొనసాగించిందన్న కారణంతో నిందితున్ని నిర్దోషిగా ప్రకటించింది.



### అంటార్కిటికా పైపైకి

న్యూయార్క్, ఆగస్టు 20: అంటార్కిటికాలో వేగంగా వస్తున్న మార్పులు మిగతా ప్రపంచానికి పెనుముప్పుగా మారబోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భూతాపం కారణంగా ఈ మంచు ఖండంలో మంచు వేగంగా కరిగిపోతున్నది. దీని ఫలితంగా ఈ ఖండం బరువు తగ్గుతున్నదని, క్రమంగా ఇది సముద్రమట్టానికి పైకి వెళ్తున్నదని అమెరికాలోని మసాచుసెట్స్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు గుర్తించారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా సముద్రమట్టం వేగంగా పెరిగే ముప్పు ఉందని చెప్పారు. భూ తాపం తక్కువగా ఉంటే 2500 నాటికి సముద్రమట్టం 1.7 మీటర్ల మేర పెరుగుతుందని, భూతాపం ఎక్కువగా ఉంటే 19.5 మీటర్ల వరకు కూడా పెరగొచ్చని, సముద్రంలోకి ఎక్కువగా నీరు చేరడం వల్ల ఈ ముప్పు పెరుగుతున్నట్టు తెలిపారు.



### అప్పట్లో రోజుకు 26 గంటలు!

బీజింగ్, ఆగస్టు 20: రోజుకు ఎన్ని గంటలు అంటే ఠక్కున 24 గంటలు అని చిన్న పిల్లలు సైతం చెప్పేస్తారు. కానీ, ఒకప్పుడు ఈ లెక్క వేరేలా ఉండేదట. అవును, కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై ఒక రోజుకు 26 గంటలు ఉండేవట. చైనాలోని చెంగ్డూ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన పరిశోధకులు జరిపిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. చంద్రుడి గురుత్వాకర్షణ భూభ్రమణంపై ప్రభావం చూపుతుందని, ఈ శక్తి తగ్గడం వల్ల భూభ్రమణ వేగం రెండు గంటల మేర పెరిగిందని తెలిపారు. 500 మిలియన్ ఏండ్ల నుంచి 650 మిలియన్ ఏండ్ల మధ్య సంభవించిన కేంబ్రియన్ పేలుడు, 280 మిలియన్ సంవత్సరాల నుంచి 340 మిలియన్ సంవత్సరాల మధ్య జరిగిన మరో పేలుడు వల్లనే రోజు నిడివి పెరిగిందని వీరు పేర్కొన్నారు. రోజు నిడివి, భూభ్రమణంపై హిమనీనదాల కంటే అలల ప్రభావమే ఎక్కువ ఉంటున్నదని గుర్తించారు.


### ఎంపాక్స్.. కొవిడ్ కాదు

**నియంత్రణ సాధ్యమేనన్న డబ్ల్యూహెచ్‌వో**

బెర్లిన్, ఆగస్టు 20: ఎంపాక్స్ కొత్త కొవిడ్ కాదని, దాని వ్యాప్తిని అరికట్టడంలో ప్రపంచవ్యాప్త ప్రయత్నాలు కీలకమని డబ్ల్యూహెచ్‌వో యూరప్ ప్రాంతీయ సంచాలకులు హన్స్ క్లుగె మంగళవారం తెలిపారు. ఎంపాక్స్‌ను ఎదుర్కోవడం, నిర్మూలించడంలో నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యాధిని ప్రపంచం ఎలా ఎదుర్కొంటుందనేది భవిష్యత్తులో ప్రజారోగ్య రక్షణకు కీలక పరీక్ష లాంటిదని హెచ్చరించారు.

**టీకా అభివృద్ధిలో సీరమ్**

ప్రపంచదేశాలను కలవరపరుస్తున్న మంకీపాక్స్ (ఎంపాక్స్) వ్యాధికి టీకాను అభివృద్ధి చేసే పనిలో నిమగ్నమైనట్టు సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో అదర్ పూనావాలా మంగళవారం వెల్లడించారు. ఏడాదిలోగా దీనిపై సానుకూల ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నట్టు తెలిపింది. కాగా, ఇటీవల కాలంలో ఈ వ్యాధి ముఖ్యంగా ఆఫ్రికా దేశాలలో విజృంభిస్తుండటంతో డబ్ల్యూహెచ్‌వో దీనిని ప్రపంచ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది.



### గెలిస్తే మస్క్‌ను క్యాబినెట్‌లోకి తీసుకొంటా!

**డొనాల్డ్ ట్రంప్ ఆఫర్.. సిద్ధమేనన్న మస్క్**

వాషింగ్టన్, ఆగస్టు 20: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది ఆఖరులో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో తాను గెలిస్తే టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు క్యాబినెట్ పోస్టు లేదా ప్రభుత్వంలో ముఖ్యమైన సలహాదారుడిగా తీసుకుంటానని ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో పేర్కొన్నారు. దీనిపై వెంటనే స్పందించిన మస్క్ .. 'సేవ చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను' అని ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డీవోజీఈ) అని రాసి ఉన్న పోడియం ముందు నిలబడిన ఫొటోను మస్క్ షేర్ చేశారు. ఇటీవల మస్క్ తన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్రంప్‌ను ఇంటర్వ్యూ చేశారు. ప్రభుత్వ వ్యయాన్ని పర్యవేక్షించేందుకు 'గవర్నమెంట్ ఎఫిషియెన్సీ కమిషన్' ఏర్పాటును ప్రతిపాదించారు. ఇందుకు ట్రంప్ కూడా సానుకూలంగానే స్పందించారు.

### జన్ పోషణ్ కేంద్రాలుగా రేషన్ షాపులు

**తెలంగాణ సహా 4 రాష్ర్టాల్లో కేంద్రం పైలట్ ప్రాజెక్ట్**

న్యూఢిల్లీ, ఆగస్టు 20: రేషన్ దుకాణాలను జన్ పోషణ్ కేంద్రాలుగా మార్చే పైలట్ ప్రాజెక్ట్‌ను కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మంగళవారం ప్రారంభించారు. తెలంగాణ, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్‌లో పైలట్ ప్రాజెక్టు కింద 60 రేషన్ షాపులను జన్ పోషణ్ కేంద్రాలుగా మార్చనున్నట్టు ఆయన చెప్పారు. ఈ ప్రాజెక్ట్ అమలయ్యే షాపుల్లో ఇకపై చిరుధాన్యాలు, పప్పులు, పాల ఉత్పత్తులు, నిత్యావసరాలు అమ్మవచ్చు. అందరూ లాభపడేలా ఈ మార్పు ఉంటుందని కేంద్ర మంత్రి అన్నారు. ప్రస్తుతం ఎఫ్‌పీఎస్ డీలర్లకు ఇస్తున్న కమీషన్ విధానం సరిగా లేదని. .షాపు స్థలాన్ని, పనివారిని సమర్థంగా ఉపయోగించుకొనే ప్రత్యామ్నాయ విధానాలు అవసరమని ఆయన అన్నారు.

# ల్యాటరల్ ఎంట్రీపై 'యూటర్న్'

- వ్యతిరేకత రావడంతో కేంద్రం వెనకడుగు
- నియామక ప్రకటన రద్దు చేసిన యూపీఎస్సీ



న్యూఢిల్లీ, ఆగస్టు 20: ల్యాటరల్ ఎంట్రీపై కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గింది. కేంద్రంలోని 45 జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీల పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తులతో భర్తీ చేయడానికి ఇటీవల ఇచ్చిన ప్రకటనను మంగళవారం యూపీఎస్సీ రద్దు చేసింది. ఈ ప్రకటనను రద్దు చేయాలని అంతకుముందు యూపీఎస్సీ చైర్మన్ ప్రీతి సుదన్‌కు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ లేఖ రాశారు. ఆగస్టు 17న ల్యాటరల్ ఎంట్రీపై యూపీఎస్సీ ప్రకటన జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ పద్ధతిలో నియామకాలు జరపడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్ల హక్కులు దూరమవుతాయనే వివాదం మొదలయ్యింది. ప్రతిపక్షాలతో పాటు ఎన్డీయే పక్షమైన లోక్ జనశక్తి(రామ్ విలాస్) అధ్యక్షుడు, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ సైతం ల్యాటరల్ ఎంట్రీ ప్రకటనను వ్యతిరేకించారు. తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో కేంద్రం వెనక్కు తగ్గక తప్పలేదు. కాగా, ల్యాటరల్ ఎంట్రీ విధానంలో రిజర్వేషన్ల అమలు అవకాశాలను కేంద్రం పరిశీలించనున్నదని తెలుస్తున్నది.

**పీడీఏ ఐక్యతకు తలొగ్గిన కేంద్రం: అఖిలేశ్**

'వెనుకబడిన వర్గాలు(పిచ్‌డే), దళితులు, అల్పసంఖ్యాకుల'(పీడీఏ) ఐక్యతకు కేంద్రం తలొగ్గిందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. 'రిజర్వేషన్లను తిరస్కరించి యూపీఎస్సీలో ల్యాటరల్ ఎంట్రీ ద్వారా నియామకాలు చేపట్టాలనుకున్న కుట్ర పీడీఏ ఐక్యత ముందు తలొగ్గింది. ఇప్పుడు బీజేపీ కుట్రలు విజయవంతం కావడం లేదు. పీడీఏలో వచ్చిన అవగాహన, మేలుకొలుపు సాధించిన పెద్ద విజయం ఇది' అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. నియంతృత్వ రాజ్యం పొగరును రాజ్యాంగశక్తి ఓడిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ల్యాటరల్ ఎంట్రీ లాంటి బీజేపీ కుట్రలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ విఫలం చేస్తామని, రాజ్యాంగాన్ని, రిజర్వేషన్ల వ్యవస్థను కాపాడతామని రాహుల్ గాంధీ అన్నారు. ల్యాటరల్ ఎంట్రీ రద్దుతో తమ ప్రభుత్వం కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పిందని, భవిష్యత్తులోనూ ప్రభుత్వాలు ప్రజల భావోద్వేగాల పట్ల ఇంతే సున్నితత్వాన్ని చూపించాలని కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ పేర్కొన్నారు.

# ఎన్డీఏ సర్కారు పీఛేముడ్!

- ఒకసారి నిర్ణయం.. ఆపై వెనక్కు తీసుకోవడం
- మూడో టర్మ్‌లో మారిన ఎన్డీయే సర్కారు తీరు
- మొన్న వక్ఫ్ సవరణ బిల్లు, ప్రసార బిల్లుపై వెనకడుగు
- ఇప్పుడు ల్యాటరల్ ఎంట్రీపైనా ఇదే వైఖరి
- వ్యతిరేకతకు జడుస్తున్న నరేంద్ర మోదీ సర్కారు



న్యూఢిల్లీ, ఆగస్టు 20: గత పదేండ్లలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పట్టుబట్టిన పనులన్నీ పూర్తి చేసింది. సంప్రదింపులు, సమీక్షలు వంటివేమీ లేకుండా చేయాలనుకున్న చట్టాలన్నీ చేసింది. విమర్శలు వచ్చినా, వ్యతిరేకత వ్యక్తమైనా వినిపించుకోలేదు. అయితే, నరేంద్ర మోదీ మూడో పర్యాయం అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మొత్తం మారిపోయింది. కేవలం మూడు నెలల కాలంలోనే నాలుగు విషయాల్లో కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గింది. ఎన్నికల్లో ఊహించని స్థాయిలో సీట్లు తగ్గిపోయిన ప్రభావమో, మిత్రపక్షాలపై ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపుతుండటం వల్లనో కానీ ఏదైనా నిర్ణయంపై వ్యతిరేకత వస్తే మోదీ ప్రభుత్వం పీఛేముడ్ అంటున్నది.

**వరుసగా యూటర్న్‌లు**


కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రసార సేవల(నియంత్రణ) చట్టం చేయాలనుకుంది. ముసాయిదా రూపొందించి స్టేక్‌హోల్డర్లకు పంపించింది. అయితే, ఈ బిల్లు స్వతంత్ర జర్నలిస్టుల గొంతునొక్కేలా ఉందనే విమర్శలు వచ్చాయి. భావప్రకటన స్వేచ్ఛను హరించేలా ఈ బిల్లు ఉందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో కేంద్రం ఈ ముసాయిదా బిల్లును వెనక్కు తీసుకుంటున్నట్టు ప్రకటించింది. తర్వాత వక్ఫ్(సవరణ) బిల్లు విషయంలోనూ ఇలానే జరిగింది. వక్ఫ్ బోర్డు వ్యవస్థలో కీలక మార్పులు చేస్తూ మోదీ ప్రభుత్వం చట్టం చేయాలనుకుంది. అయితే, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అనేక పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించాయి. దీంతో బిల్లును జాయింట్ పార్లమెంటరీ ప్యానెల్ పరిశీలనకు ప్రభుత్వం పంపించాల్సి వచ్చింది.

**అప్పుడలా.. ఇప్పుడిలా..**

స్థిరాస్తుల అమ్మకాలపై వచ్చే లాభాలపై విధించే మూలధన లాభాల పన్నులో ఇండెక్సేషన్ ప్రయోజనం విషయంలోనూ వ్యతిరేకత రావడంతో కేంద్రం వెనక్కు తగ్గింది. ఇండెక్సేషన్ ప్రయోజనం లేని కొత్త విధానం, పాత పన్ను విధానంలో ఏదైనా ఎంచుకునే వెసులుబాటును ప్రజలకు కల్పించింది. ఇప్పుడు ల్యాటరల్ ఎంట్రీ విషయంలోనూ ఇదే జరిగింది. 2018లోనూ ఈ విధానంలో కేంద్రం పలు నియామకాలు చేపట్టింది. అప్పుడు విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. ఇప్పుడు మాత్రం చిరాగ్ పాశ్వాన్ వంటి ఎన్డీఏలోని నేతలే వ్యతిరేకించడంతో వెనక్కు తగ్గక తప్పలేదు.

# దొంగల బడి!

- కోర్సు ఫీజు రూ.2 లక్షల నుంచి 3 లక్షలు
- పాఠ్యాంశాలుగా దోపిడీలు, దొంగతనాలు
- పిల్లల్ని పోటీపడి చేర్పిస్తున్న తల్లిదండ్రులు
- కోర్సు పూర్తయ్యాక, ఏడాదికి రూ.5 లక్షలు చొప్పున ఫ్యామిలీలకు చెల్లిస్తున్న ముఠాలు
- ఎంపీ గ్యాంగ్స్‌తో పోలీసులకు ముచ్చెమటలు



*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

*హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): అది మధ్యప్రదేశ్. రాజధాని భోపాల్‌కు 117 కిలోమీటర్ల దూరంలో కడియా, గుల్‌ఖేడీ, హుల్‌ఖేడీ అనే మూడు గ్రామాలు ఉన్నాయి. ఈ పల్లెల్లోని పిల్లలు రాత్రి కాగానే ఓ బడికి వెళ్తారు. 'నైట్ స్కూల్' అనుకొంటే పొరపాటే. ఆ స్కూల్‌లో మంచి బుద్ధులు, సంస్కారం నేర్పించే పాఠాలు బోధించరు. దొంగతనాలు ఎలా చెయ్యాలి? దోపిడీలకు ఎలా పాల్పడాలి? దొంగతనం చేస్తుండగా పట్టుబడితే, ఎదుటివారిపై దాడి చేసి ఎలా తప్పించుకోవాలి? వంటి విషయాలు నేర్పిస్తారు. అదే 'దొంగల బడి'. ఈ స్కూల్‌లో తమ పిల్లలను చేర్పించడానికి ఆయా గ్రామాల్లోని తల్లిదండ్రులు పోటీపడుతున్నారు.*

***శిక్షణ కోసం లక్షల్లో ఫీజు***

*దొంగతనాలకు సంబంధించి ఇచ్చే శిక్షణ ఏడాది పాటు ఉంటుంది. ఫీజు రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకూ వసూలు చేస్తారు. కోర్సులో చేరే పిల్లల వయస్సు 12 ఏండ్ల నుంచి 17 ఏండ్ల మధ్య ఉండాలి. పట్టుబడినప్పటికీ, మైనర్లన్న కారణంతో ఎక్కువ శిక్ష పడకూడదనే ఈ వయస్సును నిర్ణయించారు. పిక్‌పాకెటింగ్, విలువైన వస్తువులున్న బ్యాగుల దొంగతనం, దోపిడీలు, పట్టుబడితే కొట్టి వేగంగా పరుగెత్తడం, పోలీసులకు దొరక్కుండా దాక్కోవడం వంటి వాటిల్లో ఈ కోర్సులో భాగంగా శిక్షణ ఇస్తారు.*

***శిక్షణ పూర్తయ్యాక..***

*పిల్లలకు శిక్షణ పూర్తయ్యాక.. శ్రీమంతుల ఇండ్లల్లో జరిగే ఖరీదైన పెండ్లిళ్లు, శుభకార్యాలకు పిల్లలను అందంగా ముస్తాబు చేసి ఈ గ్యాంగ్ పంపిస్తుంది. బంగారం, వజ్రాల నగలు, డబ్బును దొంగిలించేలా ప్లాన్‌ను పక్కాగా అమలు చేస్తుంది. ఆగస్టు 8న జైపూర్‌లో జరిగిన ఓ హైదరాబాదీ ఫంక్షన్‌లో దొంగిలించబడిన రూ. 1.5 కోట్ల వజ్రాల హారం, గత మార్చిలో గురుగ్రామ్‌లో, గత డిసెంబర్‌లో ఢిల్లీలో వేర్వేరుగా జరిగిన బంగారం చోరీలు ఇలా ఇవన్నీ ఈ స్కూల్ పిల్లల పనే.*

***దొంగిలించిన తర్వాత..***

*దొంగిలించిన తర్వాత పిల్లలు ఆయా వస్తువులతో సరాసరి గ్రామానికి చేరుకొంటారు. మరికొన్ని సందర్భాల్లో దగ్గర్లో ఏమైనా జాతర, వేడుకలు జరిగితే వాటిల్లో పాల్గొంటారు. స్వగ్రామాల్లోకి చేరుకోక ముందే ఆ పిల్లలను పోలీసులు పట్టుకోవాల్సి ఉంటుంది. లేకపోతే కష్టమే. దొంగతనాలు ఆ పిల్లల పనే అని తెలిసినప్పటికీ, పోలీసులు ఆ గ్రామాల్లోకి వెళ్లాలంటే జంకుతారు. కారణం.. పోలీసులు పొలిమేరల్లోకి వస్తున్నారని తెలియగానే, గ్రామాల్లోని మహిళలందరూ గుమిగూడి తరమి కొడతారు.*

***ఈ స్కూల్‌లో ఎందుకు చేర్పిస్తున్నారు?***

*ఈ ఊళ్ల నుంచి 300 మంది చిన్నారులు ఈ నేరపూరిత చర్యల్లో పాల్గొంటున్నారని, మొత్తంగా ఈ గ్రామాల్లో 2 వేల మంది క్రిమినల్స్ ఉన్నారని పోలీసులు తెలిపారు. ఇప్పటివరకూ ఈ గ్రామస్థులపై 8 వేల కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు. పిల్లలను వినియోగించుకొంటున్నందుకు ఆయా పిల్లల ఫ్యామిలీలకు ఈ ముఠాలు ఏడాదికి రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకూ చెల్లిస్తాయి. పేదరికం కారణంగానే గ్రామస్థులు తమ పిల్లలను ఈ నేరపూరిత రొంపిలోకి దింపుతున్నట్టు తెలుస్తున్నది.*



### ప్రపంచంలోనే వృద్ధ మహిళ కన్నుమూత

మాడ్రిడ్, ఆగస్టు 20: ప్రపంచంలోనే అత్యంత వృద్ధ మహిళగా భావిస్తున్న స్పెయిన్‌కు చెందిన మరియా బ్రన్‌యాస్(117) కన్నుమూశారని ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు. 'మరియా మమల్ని వదిలి వెళ్లారు. తాను కోరుకున్న రీతిలో ఎలాంటి నొప్పి లేకుండా నిద్రలోనే ప్రశాంతంగా మరణించారు' అని ఆమె ఎక్స్ ఖాతాలో వారు రాశారు. వృద్ధుల అధ్యయన బృందం జపాన్‌కు చెందిన టొమికో ఇటుకా(116)ను ప్రస్తుతం అత్యంత వృద్ధ మహిళగా పేర్కొంది. శాన్‌ఫ్రాన్సిస్కోలో జన్మించిన మరియా మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో అట్లాంటిక్ సముద్రాన్ని దాటిన జ్ఞాపకం తనకు ఉందని చెప్పేవారు. 113 ఏండ్ల వయసులో కొవిడ్ బారిన పడ్డా ఆమె కోలుకోగలిగారు.